
- సూర్య
ఒక మానసిక వ్యాధిగ్రస్తుని ఆత్మకథ

# ఒక మానసిక వ్యాధిగ్రస్తుని ఆత్మకథ

సూర్య

# ముందుమాట

ఈ పుస్తక రచయిత నాకు గత ఏడు సంవత్సరముల నుండి తెలుసు. రచయిత నన్ను ఈ పుస్తకాన్ని చదివి, ఈ పుస్తకానికి ముందుమాట వ్రాయమని వ్రాతప్రతిని నాకిచ్చినప్పటికే అతను చెప్పుకోదగినట్టి స్పష్టమైన మానసికస్థితి కలిగి ఉన్నాడు. నాకు ఈ పుస్తకములో కూడా అవే లక్షణాలు కనిపించినవి. నిస్సందేహంగా ఈ పుస్తకము ద్వారా రచయిత మనకు చాలా విలువైన సమాచారాన్ని అందించాడు.

మానసిక అనారోగ్యము గురించి చర్చించుటకు చాలామంది నేటికి సిగ్గు, భయము కలిగి, అవమానకరమైనదిగా భావిస్తారు. అటువంటి విభాగములో ఈ పుస్తకము మనకు అరుదైన, అర్థవంతమైన వాస్తవాన్ని గ్రహించే జ్ఞానాన్ని అందిస్తున్నది. భారతదేశములోని ప్రజలకు మానసిక ఆరోగ్యము గురించి అవగాహన కలిగించి, వారికి సహాయపడుట కొరకై రచయిత తన సమయాన్ని ఇందు కొరకు వినియోగించాడని నా నమ్మకము. మానసిక వ్యాధిగ్రస్తుని ఆలోచనా దృక్పదము నుంచి చూస్తే ఈ పుస్తకము వెలకట్టలేనిది. ఎందుకంటే, ఇందులో స్కిజోఫ్రీనియా లాంటి మానసిక జబ్బు ఎంతటి వేదనకు గురి చేస్తుందో మనకు క్రొత్తగా తెలుస్తున్నది. భారతదేశములోని మానసిక ఆరోగ్య పరిరక్షణలోని నాణ్యత, సంఘములో ఈ వ్యాధి వలన ఉత్పన్నమయ్యే సిగ్గు, భయము, అవమానములను ఈ వ్యాధిగ్రస్తుడు స్వయంగా తన అనుభవాలతో వివరించడము ఈ పుస్తకములోని గొప్పతనము.

రచయిత తన అనుభవాలను ఇంత స్పష్టంగా, సరళంగా ఈ పుస్తకములో వివరించగలగడము అతని గొప్ప విజయము. పాఠకులుగా మనలను, రచయిత తన జీవన ప్రయాణంలోని తన చిన్ననాటి స్మృతుల నుండి నేటి వరకూ తీసుకొనిపోయి, ఒక బాలునిగా, విద్యార్థిగా, యువకుడిగా, ఆ తరువాత స్కిజోఫ్రీనియా అనే వ్యాధికి ఎలా గురైనాడో తెలియజేస్తాడు. తర్వాత రచయిత ఈ వ్యాధి వలన ఎంతటి సంఘర్షణకు గురైనాడో, మెల్లగా తర్వాత వేగంగా ఎలా కోలుకుంటాడో తెలుసుకుంటాము. మొత్తము పుస్తకము యొక్క రచనా స్రవంతిలో రచయిత తన భావాలను మరియు స్కిజోఫ్రీనియా బాధితునిగా తన అనుభవాలను, అప్పుడు తాను పడ్డ సంఘర్షణ గురించి అద్భుతంగా ఎలా వ్యక్తీకరించాడు అంటే, పాఠకులు, తమ మనసూ ఇలా తమకు ఎదురు తిరిగితే ఎలా? అని ఆలోచించక మానరు.

ఇందులో, భారతదేశములో మనకు లభించు మానసిక ఆరోగ్యమునకు చెందిన వైద్య సౌకర్యముల గురించిన ప్రశ్న సందర్భోచితంగా వుంది. నిజమే, మనము ఈ వ్యాధిగ్రస్తులను అసైలమ్‌లలో వుంచడమో లేక ఒంటరిగా నిర్భందించడమో చేయు రోజుల నుండి చాలా దూరమే వచ్చాము. సంఘములో ఇముడ్చుకొనుటకు మెల్లగా అంగీకరిస్తున్నాము. ఇప్పుడు మెరుగైన వైద్యము అందుబాటులో వుంది. ఈ సౌకర్యములన్నీ మానసిక వేదనకు గురైన సామాన్యులందరికి చేరవలెనన్న మనమింకా చాలా దూరము ప్రయాణించవలసి ఉన్నది. ముఖ్యంగా గ్రామ ప్రాంతాలలో ఈ వ్యాధి గురించిన అవగాహన కలిగించడము అత్యంత ఆవశ్యకము. ఇది ఒక జాతీయ కార్యక్రమంగా దేశమంతటా చేపట్టవలసివుంది.

ఇలాంటి రచనలు ఈ సమస్యను పరిష్కరించాలనే మంచి ఆలోచనను ముందుకు తీసుకొనిపోవుటకు చాలా సహాయము చేస్తాయి. ఈ పుస్తక రచయిత మొత్తము మీద మనకు చాలా విలువైన సమాచారాన్ని అందించాడని మరలా ఇంకొకసారి నొక్కి చెప్తున్నాను.

**డా॥ యమ్.యస్.ధర్మేంద్ర,**
**M.B.B.S., D.P.M;**
**M.R.C Phychiatry (U.K),**
**మానసిక వైద్య నిపుణులు,**
**బెంగుళూరు.**

# ఉపోద్ఘాతము

మానసిక అనారోగ్యము సర్వసాధారణమైనది మరియు ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ప్రముఖ సమస్య. నిజానికి ప్రపంచములో వైకల్యము కలిగించు పది ప్రధాన వ్యాధులలో నాలుగు మానసిక అనారోగ్యానికి సంబంధించినవే. మానసిక అనారోగ్యము మొదట తన కుటుంబముపైన, స్నేహితులతోనూ మరియు ప్రక్కనున్న సమాజము మీద కూడా ప్రభావము చూపిస్తుంది. మానసిక వ్యాధి వున్నవారు ఆ జబ్బు వల్ల పలురకాలైన దుష్ప్రభావాలకు లోనౌతారు. సరియైన వైద్య నిపుణుని సహాయము లేనిచో, ఇటువంటి వ్యాధి వల్ల జీవితములో చాలా కోల్పోవలసి వస్తుంది.

ఇతర వ్యాధులతో పోలిస్తే మానసిక అనారోగ్యము అధిక ప్రాధాన్యత కలిగినప్పటికీ, దీనిపట్ల సరియైన అవగాహన కొరవడింది. అందువలన మానసిక వ్యాధుల గురించి ప్రజలలో అవగాహన పెంచడము అత్యవసరము. ఈ విధంగా మానసిక వ్యాధితో బాధపడ్డ వ్యక్తి యొక్క కథ, మానసిక వ్యాధుల గురించి అవగాహన పెంచుటకు చాలా ఉపయోగపడుతుంది. తన మానసిక వ్యాధి గురించి ఇతరులతో చెప్పుకొనడము చాలా కష్టము మరియు నాకు తెలిసినంత వరకు చాలా కొద్ది మంది మాత్రమే అంత ధైర్యము చేస్తారు. ఇది తెలిసి కూడా ఈ రచయిత తన జీవిత చరిత్ర, ముఖ్యంగా తన మానసిక వ్యాధి గురించి ప్రజలందరికి తెలియచెప్పుటకు వ్రాయడము చాలా గొప్ప విషయము.

ఈ జీవిత చరిత్రలో, చాలా చక్కగా, బాలునిగా తన చిన్ననాటి విషయాలను చెప్పుకుంటూ తర్వాత పాఠకులను మెల్లగా తనకు మానసిక వ్యాధి మొదలైన కాలానికి పరిచయము చేస్తాడు. ఈ రచనా ప్రవంతిలో రచయిత ఎలాంటి తర్క, వితర్కములు చేయకుండా అంతా పాఠకుల ఊహకే వదలివేస్తాడు. ఈ విధంగా కడవరకు పాఠకులలో ఉత్కంఠతని తగ్గకుండా వుంచారు. మామూలుగా మానసిక వ్యాధికి లోనైన వారికి ఆ వ్యాధి పట్ల సరియైన అవగాహన వుండదు. కొందరు మాత్రమే తమకు మానసిక వ్యాధి ఉన్నది అంగీకరించి, మానసిక వ్యాధి నిపుణుని సంప్రదిస్తారు. ఈ పుస్తకములో రచయిత తన వ్యాధి లక్షణాల్ని చాలా స్పష్టంగా వివరించారు. సగటు మనిషి ఈ వ్యాధి గురించి అర్థము చేసికొనుటకు ఈ వివరాలు చాలా ఉపయోగపడతాయి.

...2..

ఈ పుస్తకములో రచయిత తన మానసిక వ్యాధి యొక్క వివిధ దశల గురించి చాలా గొప్పగా వివరించారు. ఇతను తన మానసిక వ్యాధి గురించి తనకు అవగాహన లేని సమయము నుంచి, తనకు వ్యాధి ఉన్నట్లు గమనించి మానసిక వైద్యుని ఏలా సహాయము కోరుతాడో, ఆ వివరాలన్నీ చాలా చక్కగా వివరించారు. ఈ వ్యాధి వల్ల కలిగే బాధ అపారమైనది. రచయిత ఈ పుస్తకములో తన మానసిక బాధను చాలా చక్కగా వ్యక్తపరిచారు.

ముఖ్యంగా తనకు మొదట మానసిక వ్యాధి లక్షణాలు ఎందుకు, ఎలా వచ్చినవో, రచయిత ఈ వ్యాధితో ఎలా బాధపడినాడో, ప్రతిసారి మానసిక వ్యాధి నిపుణుని సహాయము కోరి మందులు వాడుచూ జీవితాన్ని ఎలా కొనసాగించాడో, ఈ వివరాలన్నీ పాఠకులకు మానసిక వ్యాధి పట్ల అవగాహన పెరిగి, వారికి చికిత్స పట్ల ఒక దృఢవిశ్వాసాన్ని యిస్తాయి.

ఈ కథ బహుశా చాలా కొద్ది మంది మానసిక వ్యాధితో బాధపడ్డ వారి జీవిత చరిత్రల్లో ఒకటి. ఈ పుస్తకము మానసిక ఆరోగ్య రూపకర్తలు, వైద్యులు, మానసిక అనారోగ్యములతో బాధపడే వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు మరియు సాధారణ ప్రజలకు చాలా ఉపయోగపడుతుంది.

రవి సింగారెడ్డి, **MD., FAPA.,**
బోర్డ్ సర్టిఫైడ్ సైక్రియాట్రిస్ట్,
మానసిక వ్యాధి నిపుణులు,
**U.S.A.**

# రచయిత మాట

నా ఆత్మ కథ వ్రాయు ముఖ్యఉద్దేశము ఏమిటంటే, 'స్కిజోఫ్రీనియా' అనే మానసిక వ్యాధిగ్రస్తునిగా నేననుభవించిన బాధ, అప్పటి నా అనుభవాలను గురించి ఈ ప్రపంచమునకు తెలియ చెప్పటయే. తద్వారా ప్రజలందరికి ఈ వ్యాధి గురించిన అవగాహన కలిగించి, ఈ వ్యాధి గ్రస్తులకు కొంతవరకైనా సహాయ పడవలెనన్నదే నా ఆలోచన. ఇందులో నేను నా జీవితము గురించిన అవసరములేని విషయముల గురించి ప్రస్తావించలేదు. ముఖ్యముగా ఆ వ్యాధి బారిన పడినప్పటి నా అనుభవములకే ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చాను.

ఇది ఒక చిన్న పుస్తకము. దీనిలో నా బాల్యము గురించి, నా విద్యాభ్యాసము గురించి, తర్వాత నేను 'స్కిజోఫ్రీనియా' అనే మానసిక వ్యాధి బారినపడి, అప్పుడు నేననుభవించిన మానసిక వేదన మరియు అప్పటి నా మానసికస్థితి గురించి తర్వాత నేను పొందిన చికిత్స గురించి తెలిపినాను. దీని ద్వారా ఈ ప్రపంచమునకు ముఖ్యముగా చెప్పేదేమిటంటే, ఈ వ్యాధికి చికిత్స వున్నది, కేవలము చికిత్స ద్వారానే ఈ వ్యాధి నయమవుతుంది లేకపోతే నయమవడము చాలా కష్టము. వ్యాధి గుర్తించిన వెంటనే సరియైన చికిత్స చేసినయెడల తొంభై శాతము వ్యాధి నయమవుతుంది. ఈ సత్యానికి నేనే ఒక ఉదాహరణ. కాని చికిత్సా విధానము వ్యాధి తీవ్రతను బట్టి, వ్యక్తులను బట్టి మారుతూవుంటుంది.

ఈ పుస్తకములో నేను తీసుకున్న చికిత్స గురించి, అందుకు నేను వాడిన మందుల గురించి వివరించడము జరిగింది. కాని, ఈ మందులు మానసిక వ్యాధి నిపుణుని పర్యవేక్షణలోనే వాడాలి. కేవలము వారు మాత్రమే ఏ వ్యక్తికి, ఎప్పుడు, ఏ మందులు వాడవలెనో చెప్పగలరు. కనుక ఎట్టి పరిస్థితులలోను మానసిక వ్యాధికి వాడు మందులు సొంతంగా తమంతకు తామే వాడరాదు. అది ప్రమాదకరము కూడా!

ఇందులోని నా జీవిత చరిత్ర పూర్తిగా ఒక యదార్ధ గాథ! కాని ప్రస్తుత ప్రపంచములో మానసిక వ్యాధిగ్రస్తులపై కొనసాగుతున్న వివక్ష కారణంగా నా కుటుంబ సభ్యులు నన్ను, ఈ పుస్తకాన్ని నా కలం పేరుతో వ్రాయమని కోరారు. యింకా ఇందులోని కొన్ని పాత్రల పేర్లు, ఊర్ల పేర్లు మార్చి వ్రాయమని సలహా యిచ్చారు. కనుక, నా కుటుంబముపై నాకున్న బాధ్యత నెరవేర్చుట కొరకు, వారు కోరినట్లే చేసినాను. దీని వలన నా ముఖ్య ఉద్దేశమునకు ఎటువంటి భంగము వాటిల్లదని భావిస్తు, పాఠకులు ఈ విషయాన్ని సహృదయముతో అర్ధము చేసుకొగలరని ఆశిస్తున్నాను.

**సూర్యా**

# ఒక మానసిక వ్యాధిగ్రస్తుని ఆత్మకథ

– సూర్యా

**మొదటి భాగము**

మాది ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లా, కోవెలకుంట్ల మండలము నందు కొత్తపల్లె అనే చిన్న గ్రామము. నేను 1952 వ సంవత్సరము ఏప్రిల్ నెల, 19వ తేదిన, రంగారెడ్డి, పార్వతమ్మ అనే దంపతులకు జన్మించినాను. మా నాన్న ఒక దృఢ స్వభావము కలిగి, కష్టపడి పనిచేయు మోతుబరి రైతు. మాకు 100 ఎకరములకు పైగా మెట్ట పొలాలు ఉండేవి. మా నాన్న ప్రాధమిక విద్య మాత్రమే చదువుకున్నాడు. కాని మంచి లోక జ్ఞానం కలిగివుండేవాడు. మా అమ్మ, మా నాన్నకు రెండవ భార్య, మొదటి భార్య ఉండగానే రెండవ పెళ్ళి చేసుకున్నాడు. దీనివలన తరువాతి కాలములో మాకుటుంబంలో అనేకమైన ఒడిదుడుకులు కలిగినవి. ముఖ్యముగా నా జీవితంలో విపరీతమైన పరిస్థితులు అనేకము ఎదుర్కొనవలసి వచ్చింది. మా అమ్మ మంచి సాంప్రదాయం కలిగినది. ఆమె వివేకవంతురాలు, కష్టపడి పనిచేయు మనస్తత్వం కలిగినది. ఈమె కూడా ప్రాధమిక విద్య మాత్రమే చదువుకొని యున్నది.

మా ఊరిలోని వారంతా వ్యవసాయం మీదనే ఆధారపడి ఉండేవారు. కొందరేమో మోతుబరి రైతులు, కొందరు సన్నకారు రైతులు, మిగిలిన వారంతా వ్యవసాయ కూలీలు, ఊరికి తూర్పు దిక్కున సారవంతమైన మెట్ట పొలాలు ఉండేవి. వ్యవసాయం వర్షంపై ఆధారపడి చేస్తూ ఉండేవారు. వేసవికాలం అంతా చాలా మందికి ఏ పని ఉండేది కాదు. ఊరిలో కొంత మంది నేసే వారు కూడా ఉండేవారు. వీరు చీరెలు, పంచెలు నేసేవారు. కాలక్రమేణ వారికి ఆదరణ కరువై ఆ వృత్తిని పూర్తిగా మానివేసినారు. వారు కూడా క్రమంగా వ్యవసాయ పనులకు అలవాటు పడ్డారు. ఊరిలో చాలా మంది పేదరికంతో బాధలు పడేవారు. ఊరిలో విద్యుత్ ఉండేది కాదు. రాత్రిపూట వెలుతురు కొరకు కిరోసిన్ ఆయిల్ బుడ్లు, లాంతర్లు వాడేవారు. ప్రభుత్వ పాఠశాల ఉండేది కాదు అయితే ఒక బత్రాజుల బడి ఉండేది. కొంత మంది విద్యార్థులు అందులో చదువుకొనేవారు. అక్కడ పెద్దబాల శిక్ష, వేమన శతకం, సుమతి శతకం మొదలుగు వాటితో పాటు ఎక్కములు, కూడికలు, తీసివేతలు, భాగహరములు మొదలగు వాటిని మాత్రమే చెప్పేవారు. అయితే తరగతులు ఒకటి నుండి ఐదవ తరగతి వరకు ఉండేవి.

అప్పటి ప్రకృతిలో స్వచ్ఛమైన గాలి, పచ్చని పంట పొలాలు నాకు బాగా గుర్తు, ఇప్పుడు అవన్నీ కనుమరుగై పోయాయి. ఇప్పుడేమొ ఊరి చుట్టూ ఫ్యాక్టరీలు, ముడి సరుకును వెలికి తీయుటచే పొలాలన్ని నాపరాళ్ళ గనులయ్యాయి. 24 గంటలు సిమెంటు ఫ్యాక్టరీలు పనిచేయడంవల్ల అవి వెదజల్లే కాలుష్యముతో ఇచ్చటి వాతావరణం అంతా కలుషితమై పోయింది. అప్పుడు ఊరంతా ప్రశాంతంగా ఉండేది. ఊరివారంతా చాలా ఐకమత్యంగా ఒకరికొకరు సహకరించుకుంటూ ఉండేవారు. ఊరు ఊరంతా తెల్లవారు జామునే లేచేది. ప్రొద్దుపొడిచే లోపలే అంతా వారి వారి పనులకు వెళ్ళేవారు. నాకు ప్రొద్దున్నే లేచే అలవాటు లేకపోయినా మెలకువగానే ఉండేవాడిని. పొలాలకు వెళ్ళే ఎద్దుల మువ్వల చప్పుడు, అమ్మ పెరుగు చిలుకుతున్న కవ్వపు చప్పుళ్లు, నాన్న పనివాళ్ళకు పురమాయించే పనుల కంఠ ధ్వనులు, ఇంటి బయట బావి వద్ద నీళ్ళుతోడే గిలక చప్పుళ్ళు, కొన్ని ఇష్టంగా, కొన్ని కష్టంగా ఆలకించేవాడిని. అన్ని పల్లెల్లో వ్యవసాయ పనులకు ఎద్లు, ఎద్ల బండ్లు

ఉపయోగించేవారు. చాలా మంది గేదెలు, ఆవులు, మేకలు, పొట్టేల్లు, కోళ్ళు పెంచుకునేవారు. వీటన్నిటిని ఇంటిలోనే ఉంచుకొనేవారు. అలా అయితే వాటి ఆలనా, పాలనా బాగా చూచుకొనవచ్చునని వారి అభిప్రాయము. కాని వీరి జీవన శైలి వలన పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత సరిగా ఉండేది కాదు.

1957వ, సంవత్సర ప్రాంతంలో ఊరిలో ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల ప్రారంభమైంది. అప్పుడు నేను రెండవ తరగతిలో ఉండేవాడిని. శివారెడ్డి అనే ఉపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయుడుగా ఉండేవారు. ఆయన వృత్తి పట్ల మంచి అంకిత భావము ఉన్న వ్యక్తి. ఊరిలోని పిల్లలందరిని స్కూల్లో చేర్పించి అందరికి విద్య నేర్పించవలెనని పాటుపడుచుండేవారు. కాని చాలా మంది పిల్లలు, వారి తల్లిదండ్రులకు విద్యపై సరియైన అవగాహన లేనందున స్కూలు వదిలి వెళ్ళేవారు. అప్పుడు ప్రధానోపాధ్యాయుడు మంచి విద్యార్థులందరిని ఒక జట్టుగా ఏర్పరచారు. వారు మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్కూల్‌కు రాని పిల్లల ఇళ్లకు వెళ్ళి వారి తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియపరచి తమ, తమ పిల్లలను తిరిగి స్కూల్‌కు పంపమని కోరేవారు. కొంత మంది తిరిగి తమ పిల్లలను స్కూల్‌కు పంపేవారు. కాని చాలా మంది తల్లిదండ్రులు, తమ పిల్లలు వ్యవసాయ పనులలో తమకు సహాయ పడుట వలన మరల స్కూలు మాన్పించేవారు. అందులో ఆ రోజుల్లో అన్ని ఊర్లలోనూ బాల కార్మిక వ్యవస్థ చాలా ఎక్కువగా ఉండేది. ఇది చట్ట విరుద్ధమే ఆయినా, దాన్ని సరిగా అమలు పరచక పోవటం వల్ల ఎవరూ దాన్ని పాటించేవారు కాదు. చాలా మంది ఇళ్లలో కాఫీ కాని, టీ కాని కాచేవారు కాదు. చాలా మంది ప్రొద్దున్నే పాలను త్రాగేవారు. కొందరేమో ప్రొద్దున్నే కమ్మటి పెరుగు వేసుకొని చద్ది అన్నం తినేవారు. మా ఇంట్లో మా అమ్మ అందరికి కాఫీ చేసేది. పనిచేసే వాళ్ళకు కూడా తలా ఒక కప్పు కాఫీ ఇచ్చేది. అయితే అప్పట్లో అందరికి బెల్లము కాఫీనే చేసేది. మాకంతా చెక్కెర కాఫీ రుచి తెలియనందువల్ల, బెల్లం  కాఫీనే ఆనందంగా ఆస్వాదించేవారము. చెక్కెర ఏదో కొన్ని ముఖ్యమైన వంటలకు తప్ప అసలు వాడేవారమే కాదు. ఎందుకంటే అప్పుడు చెక్కెరకు రేషన్ ఉండేది. ఫ్రీ మార్కెట్‌లో దొరికేది కాదు. అన్ని బాగానే ఉన్నాయి కాని అప్పట్లో దళితులను చాలా చిన్న చూపు చూసేవారు,  వారంతా నిరక్షరాస్యులు, వ్యవసాయ కూలీలు మాత్రమే. వారి పట్ల వివక్ష చాలా ఎక్కువగా ఉండేది. వారికి సరి అయిన కూలీ ఇచ్చేవారు కాదు. అప్పటికే వారి అభ్యున్నతి కోసం చాలా చట్టాలు ఉన్నా, వాటి గురించి ఎవ్వరికీ సరైన అవగాహన ఉండేది కాదు. దళితులు కూడా వారికి జరిగే అన్యాయం గురించి ఎక్కడ ఫిర్యాదు చేసేవారు కాదు. అలాగే ప్రభుత్వ అధికారులు కూడా వీరికి రక్షణగా ఉన్న శాసనాలను అమలు పరచాలనే ఆలోచన కూడా చేసేవారు కాదు. కాని ఈ రోజు, అంటే 2013 సంవత్సరానికి వారి జీవితంలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. ఇప్పుడు వారిని నీచంగా కించపరచాలనే సాహసం ఎవరూ చేయరు. వారూ విద్యాధికులు అయినారు. వారి హక్కులు వారు కాపాడుకోగలరు కాని ఇంకా పూర్తి సమాన ప్రతిపత్తి రాలేదు. కాని ఆ రోజు ఇంకెంతో దూరంలో లేదు.

అది 1959 వ సంవత్సరం, నేను అప్పుడప్పుడే నాల్గవ తరగతిలో చేరినాను. నేను  అప్పుడు చదువులో చాలా చురుకుగా ఉన్నట్లు గుర్తు. కాని మా నాన్న మరియు నా విధి నాతో ఒక ఆట ఆడుకుంది. నా కంటే పెద్దదైన మా ఆక్క లక్ష్మి కోవెలకుంట్ల హైస్కూల్‌లో ఏడవ తరగతి చదువుతూ ఉండేది. ఆ రోజు మా అక్క స్కూలు నుంచి ఒక వార్త తెచ్చింది. అదేమిటంటే హైస్కూల్‌లో ఆరవ తరగతిలో ఇంకొక సెక్షన్ ప్రారంభించినారని అందులో అర్హులందరిని చేర్చుకొనుచున్నారనీనూ. అది వింటూనే మా నాన్న బుర్రలో ఏదో

ఆలోచన మెదిలింది. వెంటనే ఆయన నన్ను ఆరవ తరగతిలో చేర్పించుటకు నిర్ణయించుకొన్నారు. అప్పుడు నా వయస్సు ఎనిమిది సంవత్సరములు మాత్రమే. కాని ఆరవ తరగతిలో చేర్చుకొనుటకు కనీసం పది సంవత్సరములైన నిండి ఉండవలెను. కాని, మానాన్న నా వయస్సు పది సంవత్సరములు నిండినట్లు తప్పుడు ధృవపత్రం సంపాదించి నన్ను స్కూల్ నందు చేర్పించారు.

కోవెలకుంట్ల మా ఊరి నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. మా ఊరి విద్యార్థులంతా స్కూలుకు నడిచే వెళ్ళవలెను. అంత చిన్న వయసులో రోజు 16 కిలోమీటర్లు నడవాలంటే చాలా కష్టంగా ఉండేది. అప్పటికే మూడు నెలల పాఠాలు అయిపోయినవి. కొత్త విద్యార్థులను పాత విద్యార్థులతో కలిపి ఒకే క్లాసులో పాఠాలు చెప్పేవారు. నాకు పాఠాలు కొంచెము కూడా అర్థమయ్యేవి కావు. లెక్కలు, తెలుగు ఫర్వాలేదు గాని ఇంగ్లీషు, హిందీ ఒక అక్షరం కూడా అర్థమయ్యేది కాదు. అటు స్కూల్లో గాని ఇటు ఇంట్లో గాని ప్రత్యేకమైన శ్రద్ధ ఏదీ తీసుకొనలేదు. దానితో మూడు నెలల పరీక్షలలో ఇంగ్లీషులో నూటికి కేవలం రెండు మార్కులు, లెక్కల్లో మాత్రం నూటికి ముప్పై మార్కులు వచ్చినవి. దీంతో మా నాన్నకు తాను చేసిన తప్పు ఏంటో తెలిసి రానప్పటికీ, నాకు ప్రత్యేకంగా చదువు చెప్పుటకు ఒక టీచరును కుదిర్చినాడు. ఎట్టైతేనేమి, తరువాత నా చదువు కొంత మెరుగై తరువాతి క్లాసుకు అర్హత సంపాదించినాను.

ఆరవ తరగతిలో నాకు రామమోహన్ రావు అనే బాలునితో స్నేహం ఏర్పడింది. అందరూ అతన్ని 'రాము' అని ముద్దుగా పిలిచేవారు. మాకు కోవెలకుంట్లలో రెండు ఇళ్ళు ఉండేవి. ఒక ఇంట్లో రాము వాళ్ళు బాడుగకు ఉండేవారు. ఆ ప్రక్క ఇంట్లో మాకు దగ్గరి బంధువులు ఉండేవారు. నేను మా బంధువులతో కలసి ఉండేవాడిని. ఇప్పుడు నాకు మంచి కాలక్షేపము. రాను రాను, రాము నాకు ముఖ్యమైన స్నేహితుడు అయిపోయాడు. రాము చాలా తెలివైనవాడు. చదువులో అన్ని పరీక్షల్లో మొదటి మార్కులు సంపాదించేవాడు. రాము వాళ్ళ నాన్న అక్కడ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. వాళ్ళ ఇంట్లో అంతా బాగా చదువుకొన్నారు. చిన్నప్పటి నుంచే రాము మంచి వ్యక్తిత్వం కలవాడు. అతని నడవడిక నాకు జీవితాంతము స్ఫూర్తి దాయకమయ్యింది. ఒక రోజు రాము నేను ఇతర పిల్లలతో కలసి ఇంటి బయట ఆడుకుంటూ ఉన్నాము. అప్పుడు ఉన్నట్లుండి రాము జోబులో నుండి అతని పెన్ను జారి పడింది. నేను తప్ప ఇంకెవ్వరూ అది గమనించలేదు. వెంటనే నేను ఆ పెన్ను తీసుకొని నా జోబులో దాచుకొన్నాను. అప్పుడు నేను కేవలం రాముతో ఒక ఆట ఆడుకొవాలనే దాన్ని దాచి ఉంచాను. కాని, తర్వాత దాన్ని నా దగ్గరనే ఉంచుకోవాలనే ఆలోచన వచ్చింది. మరుసటి రోజు ప్రొద్దున్నే రాము ఇంటి బయట వెతుకుతూ కన్పించాడు. నేను ఏమీ తెలియని అమాయకుడివలె "రాము! దేని కోసం అంతగా వెతుకుతున్నావు," అని అడిగాను. అప్పుడు రాము,

"నిన్న బయట ఆడుకొనేటప్పుడు నా పెన్ను పొగొట్టుకున్నాను. అది చాలా మంచి పెన్ను, బాగా రాస్తుంది, నీకేమైన కన్పించిందా!" అని అడిగాడు. "లేదు," అని నేనూ వెతుకుతున్నట్లు నటించి, తర్వాత,

"రాము అది ఏవరైనా ఇప్పటికే తీసుకొని ఉంటారు. వెతకడం వృథా!" అని చెప్పినాను. రాము ఇంకొంచెం సేపు వెతికి ఇంటిలోనికి వెళ్ళాడు.

తరువాత ఇతరుల నుండి మంచి పెన్నులను దొంగిలించవలననే కోర్కె నాలో కలిగింది. తర్వాత స్నేహితుల నుండి బంధువుల నుండి, దాదాపు 10 పెన్నుల వరకు దొంగిలించాను. దొంగతనం చేసే నైపుణ్యం నాకు ఎలా అలవడిందో నాకే ఆశ్చర్యమేసింది. వారాంతపు సెలవు రోజున ఆ పెన్నులన్ని తీసుకొని

మా పల్లెకు పోయినాను. అక్కడ ఈ పెన్నులన్ని నా పుస్తకాల అరలో దాచి ఉంచాను. ఆ రోజు సాయంత్రం ఈ పెన్నులన్నింటిని ఏవరైనా చూస్తారేమో అన్న అనుమానం వచ్చి వెంటనే వాటిని ఎవరూ కనిపెట్టలేని రహస్య ప్రదేశములో దాచి సంతోషంగా ఉన్నాను. మా పెద్ద అక్క శిరీష అప్పుడు వైద్య విద్య అభ్యసిస్తూ ఉన్నది. ఆమె సెలవు పై ఇంటికి వచ్చియున్నది. ఆ రోజు రాత్రి ఆమె ఎవరికో ఉత్తరం వ్రాయుటకు పెన్ను కావలసి వచ్చింది. అప్పుడు ఎవరి వద్దా పెన్ను అందుబాటులో లేదు. అప్పుడు,

“నేను ఉదయము ఆ పుస్తకాల ఆరలో మంచి పెన్నులు చాలా చూశాను. ఒకటి తెచ్చి ఇవ్వండి” అని చెప్పింది.

అప్పుడు ఇంకొక అక్క లక్ష్మీ, అక్కడ వెతికి “ఇక్కడ ఏ పెన్నూ లేదు,” అని చెప్పింది. అప్పుడు మా అక్క “ఆ పుస్తకాల అర ఎవరిది?” అని అడిగింది.

అప్పుడు నేను “అది నాదే,” అని భయం భయంగా చెప్పినాను. అప్పడామె,

“ఆ పెన్నులు ఎవరివి? ఇప్పుడు ఎక్కడ పెట్టినావు? అవి చూసేదానికి ఖరీదైన పెన్నులవలె ఉన్నాయి, నిజం చెప్పు, ఇప్పుడు ఎక్కడ పెట్టినావు?” అని గట్టిగా అడిగింది. అప్పుడు నేను,

“నాకు తెలియదు, నాకున్నది ఒకే ఒక పెన్ను. అది కూడా సరిగా వ్రాయదు. దాని నిబ్ పాడయింది.” అని వణుకుతూ చెప్పాను.

అప్పుడు జీవితంలో మొట్టమొదటి సారి అపరాధ భావంతో తల దించుకొన్నాను. కాని నాకు ఏమీ తెలియదు అని చెప్పి, నా నేరాన్ని అంగీకరించలేదు. అంతవరకు మౌనంగా ఉన్న మా అమ్మ,

“సూర్యా! నీవు ఆ పెన్నులను ఎక్కడైనా దొంగిలించి తెచ్చివుంటే వెంటనే వాటిని ఎక్కడివక్కడ చేర్చు, ఇక మీదట ఎప్పుడు ఇటు వంటి తప్పు చేయవద్దు.”

అని మా ఆమ్మ, మా అక్క, మంచి వారికి ఈ సంఘంలో ఎటువంటి గౌరవ మర్యాదలు లభిస్తాయో, అలాగే చెడ్డవారిని ఎంత అసహ్యించుకొంటారో చెప్పి, మంచి నడవడిక అలవాటు చేసుకోమని హితబోధ చేసి, ఆ సంఘటన గురించి తర్వాత ప్రస్తావించలేదు. నా మనసు పశ్చాత్తాపముతో నిండిపోయింది. మరుసటిరోజు ఆ పెన్నులన్నిటిని తీసుకొనిపోయి ఎవరి పెన్ను, వారి, వారి, పుస్తకాల అరలోనో లేదా బ్యాగుల్లోనో వేసి నా మనసు తేలిక పరచుకొని అపరాధ భావన నుంచి బయటపడినాను. ఆ తరువాత ఇంతవరకు ఇతరుల నుండి ఎంత విలువైన వస్తువైనా దొంగిలించలేదు. రాము మరుసటి రోజు ఉదయాన్నే సంతోషంగా ఎదురువచ్చి,

“సూర్యా! నా పెన్ను నా పుస్తకాల ఆరలో దొరికింది!! అది నేను ఇంటి బయట పోగొట్టుకుంటే పుస్తకాల అరలోకి ఎలా వెళ్ళిందో ఆశ్చర్యంగా ఉంది!!!” అని చెప్పగా, నేను,

“ఎలాగైతేనేం నీపెన్ను మళ్ళీ దొరికింది! అది మంచిదేకదా!! అందులోనూ అది నీకు చాలా ఇష్టమైన పెన్ను!!!” అని చెప్పినాను. దానికి రాము నావైపు చూసి సాలోచనాత్మకంగా నవ్వి వెళ్ళి పోయాడు.

1960వ, సంవత్సరం మా కుటుంబం రెండుగా విడిపోయింది. ఆ సంఘటనతో మా నాన్న మనసు గాయపడింది. తాను అంతకు ముందుకంటే కఠినంగా, దురుసుగా తయారైనాడు. ఇంకా ఎక్కువగా శ్రమించి అన్ని విధాల తన ఆదాయాన్ని పెంచుకొని బాగా ధనవంతుడయ్యాడు. కాని, దానితో పాటు ఊరిలో చాలా మందిని శత్రువులుగా తయారు చేసుకొన్నాడు. కాని మా నాన్న మొండితనం, తెంపరితనం చూసి

ఎవరూ ఇతని జోలికి వచ్చేవారు కాదు. కాని ఊరిలోని వారంతా నేనంటే చాలా సదభిప్రాయం కలిగి ఉండేవారు. కాని కుటుంబంలోని ఈ సంఘటనల వలన నేను ఇంకా బిడియస్తున్ని, భయస్తున్ని అయిపోయాను. ఆత్మన్యూనతా భావము లోనికి నెట్టివేయబడ్డాను. ఊరిలో ఎవరితోనూ ధైర్యంగా మాట్లాడేవాడిని కాను. ముఖ్యంగా ఆడపిల్లలతో ఎవరితో కూడా మాట్లాడటానికి సాహసించేవాడిని కాను. (మా అక్కా చెల్లెలు తప్ప) కాని నా తోటిబాలురతోచాలా బాగా కలసి పోయేవాన్ని వారితో ఆటలకైనా పాటలకైనా ముందుండేవాన్ని ఇంకా వారితో ధైర్యంగా పోరాడేదానికి ఇష్టపడేవాన్ని. ఒక రోజు రాము, నేను, ఇతర పిల్లలతో కలసి ఇంటి బయట ఆడుకుంటూ ఉన్నాము. అప్పుడు అక్బర్ అనే బాలుడు, "నాతో మెడపట్లు పట్టగలవా?" అని సవాలు విసిరాడు. నేను వెంటనే, దానికి ముందు, వెనక ఆలోచించకుండా ఆ సవాలును అంగీకరించాను. ఆ బాలుడు నాకంటే కొంచెం బలంగా ఉన్నాడు, కాని నేను దాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. అప్పుడు రాము,

"సూర్యా! అక్బర్ భారతదేశపు చక్రవర్తిగా ఉన్నారు! అతను చాలా సాహసవంతుడు, బలవంతుడు!! కనుక ఈ అక్బర్‌తో జాగ్రత్త!!!" అని హెచ్చరించినాడు. దానికి నేను,

"అక్బర్ ఎవరో నాకు తెలియదు! నేను ఎప్పుడు ఆ పేరు కూడా వినలేదు!! అయినా ఈ అక్బర్ గురించి నేను భయపడను!!!" అని బదులిచ్చాను.

బహుశా, నేను 4,5 తరగతులు చదవకుండా ఆరవ తరగతి చేరినాను కనుక, నాకు అక్బర్ చక్రవర్తి గురించి తెలియలేదు. తరువాత నేనూ, అక్బర్ మల్లయోధుల వలె పోరాడినాము. ఒక పది నిమిషములు మెడపట్లు పట్టి పోరాడిన తర్వాత ఇద్దరమూ సరి సమానమైన వారమని మిగతా బాలురందరు నిర్ణయించినారు. రాము చాలా సంతోషించి నన్ను పోగడ్తలతో ముంచెత్తినాడు.

నేను 8 వ, తరగతి చదువుచున్నప్పుడు రాము వాళ్ళ నాన్న పదోన్నతి పై వేరే ఊరికి బదిలీ అయినాడు, కనుక రాము నాకు దూరమైపోయాడు. అప్పుడప్పుడు రాము గురించిన సమాచారం దొరికినప్పటికి తర్వాత రామును కలవలేదు. కాని అతడి గురించిన జ్ఞాపకాలు ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. అతనే నాకు ఆదర్శమైన వ్యక్తి. అతని వ్యక్తిత్వం నా జీవితంపై ఎంతో ప్రభావం చూపింది. రాను రాను నేను చదువులో చాలా వెనుకబడిపోయాను, ఇది గమనించిన మానాన్న మంచి ఉపాధ్యాయుని వద్ద ప్రత్యేకంగా చదువు నేర్చుకొనుటకు వదలినాడు. అతనే రసూల్ సార్! అతను చాలా మంచి మనిషి, బలవతంగా చదివించుటకు, శిక్షించుటకు, అతను వ్యతిరేకి. మంచిగా విద్యార్థిని మంచి మాటలతో ఉత్తేజపరచి ఇష్టంగా చదువుకొనేటట్లు చేయుటయే అతని నేర్పరితనము. దీని వలన నేను చాలా లాభపడినాను. నేనప్పటినుండి చదువులో కొంచెం బాగుపడినా, నా స్కూలు జీవితం అంతా సగటు విద్యార్థిగానే గడిచిపోయింది.

నా పదవ ఏట నేను 8 వ, తరగతి చదువుచున్నప్పుడు, నేను నా క్లాసులోని ఒక అమ్మాయి పట్ల ఆకర్షితుడనైనాను. ఆమె నా స్కూలు జీవితం అంతా నా తోటి విద్యార్థిగానే ఉన్నది. ఆమె చాలా అందమైనది మరియు చాలా సంస్కారవంతురాలు. కాని, నేనెప్పుడు ఆమెతో మాట్లాడుటకు కూడా ప్రయత్నించలేదు. అంత ధైర్యం నాకు లేదు, కనీసము ఆమె పట్ల ఆకర్షితుడనైనానని కూడా ఎవరికీ చెప్పలేదు. నేను స్కూలులో ఆటలు ఆడునప్పుడు ఏ జట్టులోనూ ఉండే వాడినికాను. ఎందుకంటే ఏ క్లాసు చదివేటప్పుడైనా ఆ క్లాసులో ఇతర పిల్లలతో పోలిస్తే నేను చాలా చిన్నవాడిని, కనుక ఎవరూ నన్ను తమ జట్టులో చేరనిచ్చేవారు కాదు. కాని నేను స్కూలులోని అందరు విద్యార్థులకు బాగా తెలుసు. అందుకు కారణం బహుశా నేను, క్లాసు లో అందరికంటే

చిన్నవాడినయినందువల్ల కావచ్చు, లేదా మెత్తని స్వభావం కలిగి నందు వలన కావచ్చు, ఇంకా మా నాన్న ఆ ప్రాంతంలో చాలా పేరున్న వ్యక్తి అయినదాని వల్లనైనా కావచ్చు. ఎందుకంటే మా నాన్న ఒక మంచి రైతు, ఒక పెద్ద వడ్డీ వ్యాపారి, ఆ ప్రాంతంలోని ధనవంతుల్లో ఒకరు. అంతకంటే ముందు అతను అప్పుడప్పుడు గుర్రం మీద స్వారీ చేస్తూ అన్ని ఊర్లకు తిరిగేవాడు, ముఖ్యముగా పొలాలను తనీఖీ చేయుటకు, తను ఇచ్చిన అప్పులు వసూలు చేసుకొనుటకు ఈ గుర్రము బాగా ఉపయోగపడేది. నన్ను అప్పుడప్పుడు గుర్రం మీద పొలాలకు తీసుకొని వెళ్ళేవాడు నేను కూడా గుర్రం మీద స్వారీ చేయుటకు ఇష్టపడేవాన్ని ఒక రోజు నేను, మా అమ్మా నాన్నలతో, “నేను గుర్రం మీద స్కూలుకు పోతాను!” అని మొండి చేసినాను. అందుకు మా అమ్మా నాన్న, “నీవు ఇప్పుడు ఇంకా చిన్న పిల్లవాడివే, కనుక గుర్రం నీ మాట వినదు, నీవు దాన్ని అదుపు చేయలేవు. నీవు గుర్రపు స్వారీ నేర్చుకున్నతర్వాత నీవు ఒక్కడివే దాని పై ఎక్కడికైనా వెళ్ళవచ్చు, అంత వరకు వేచిఉండు” అని చెప్పి బుజ్జగించినారు.

ఆ వేసవి సెలవుల్లో నేను ఈత మరియు గుర్రపు స్వారీ నేర్చుకొనవలెనని నిర్ణయించుకొన్నాను. ఒక రోజు మా నాన్న, నన్ను మొదట తోటలోని బావిలో ఈత నేర్పుటకు తీసుకొని పోయాడు. అప్పటికే చాలా మంది పిల్లలు అక్కడ ఈత కొడుతున్నారు. కొందరు బావి పై నుండి లోనికి దూకుతున్నారు. కొందరు నీటిలో ఆటలు ఆడుతున్నారు. కొందరు క్రొత్తగా ఈత నేర్చుకొంటున్నారు. మా నాన్నను చూడగానే పిల్లలందరు అల్లరి మాని బుద్ధిగా మసలసాగారు. మూడు బాగా కట్ట కట్టిన మునగబెండ్లను నా నడుముకు కట్టి, మా నాన్న నన్ను తక్కువ ఎత్తులో ఉన్న ఒక రాతి మీద నుండి బావిలోనికి వేసినాడు. మొదటిసారి నీటిలో పడగానే, నేనంతకు ముందు ఊహించని విధంగా భయాందోళనకు గురియైనాను. నేను నీటిలో మునుగుతూ, తేలుతూ, సహాయము కొరకు అరచుచూ, చేతులు, కాళ్ళు బాగా కదిపినాను. నడుముకు మునగబెండ్లు ఉండుట వల్ల, నేను నీటిలో మునిగి పోకుండా, కాళ్ళు చేతులు ఆడించుటవల్ల ఈదుచూ మెల్లగా ముందుకు సాగాను. తర్వాత కొద్దిసేపటికి నీటిలో మునిగిపోతాననే భయం పోయి, మునగబెండ్ల సహాయంతో బాగా ఈదేది అలవాటు చేసుకున్నాను. అలా కొన్ని వారాలలో పూర్తిగా ఈదేది నేర్చుకొన్నాను.

తరువాత మా నాన్నను గుర్రపు స్వారీ నేర్పించమని అడిగాను. కాని ఆయన పనుల వత్తిడి వలన తీరిక లేక తన అనుచరుడు కొండన్న అనే అతనికి, నాకు గుర్రపు స్వారీ నేర్పే భాధ్యత అప్పగించినాడు. కొండన్న గుర్రాన్ని, నన్ను ఊరి బయటకు తీసుకొనిపోయి, నన్ను గుర్రం పై ఎక్కి జీను మీద కూర్చోమని చెప్పి, ఆంకెనలో కాళ్ళు పెట్టి, కాళ్ళను గుర్రము కడుపు ప్రాంతంలో గట్టిగా అదిమి పెట్టమని చెప్పి, కళ్లెముకున్న పగ్గాలు నన్ను బాగా పట్టుకోమని చెప్పాడు. తర్వాత, గుర్రం పై ఎలాకూర్చోవాలో, గుర్రాన్ని ఎలా అదిలించాలో, అది అదుపు తప్పకుండా ఎలా అదుపు చేయాలో చెప్పి, గుర్రం వెనుక కొరడాతో ఒక దెబ్బ గట్టిగా వేసినాడు. గుర్రము ఒక్క దూకు దూకి బాగా దవుడు తీసింది. నాకు ఎక్కడ పడిపోతానో అని భయం వేసి సహాయం కొరకు గట్టిగా అరచుచూ, దాని కళ్ళెం గట్టిగా బిగించి పట్టుకొన్నాను. గుర్రం అలాగే కొద్ది దూరం పరిగెత్తి ఒక చోట ఉన్నట్లుండి ప్రక్కకు తిరిగి వెంటనే నిలబడింది. నన్ను నేను అదుపు చేసుకోనలేక దాని ముందరి కాళ్ళ ముందు పడిపోయినాను, కొన్ని చిన్న గాయాలైనాయి. అప్పుడు అక్కడ పశువులను మేపు పిల్లలు కొందరు నన్ను చూసి ఎగతాళిగా నవ్వసాగారు. నాకు బాగా సిగ్గు అనిపించింది. కొండన్న ఎక్కడో దూరంగా వస్తున్నాడు. పిల్లలు నవ్వారనే షౌరుషంతో ఒక్క సారిగా గుర్రము పైకి ఎగిరి కూర్చోని, దాని కళ్లెం అదిమి పట్టుకొని మళ్లీ

దాన్ని అదిలించినాను. ఆశ్చర్యంగా అది వెంటనే నా అదుపు లోనికి వచ్చి సాఫీగా పరుగెత్తసాగింది. తరువాత అప్పుడప్పుడు మా నాన్న గుర్రం మీద స్వారీ చేసేవాడిని. కాని అది చాలా చిన్న గుర్రం, నాకు మంచి మేలు జాతి గుర్రం మీద స్వారీ చేయవలెనని ఉండేది. అటువంటి గుర్రం నా కొరకు కొనమని మా నాన్నను చాలా సార్లు అడిగినాను, కాని ఆయన నా మాటలు పట్టించుకొనలేదు. అయినప్పటికి, ఈ రోజుకూ గుర్రం అంటే మోజు తగ్గలేదు. ఇప్పుడు కూడా సినిమాల్లో మరియు మ్యాగజైన్స్‌లో మంచి గుర్రాలను చూసి ఆనందిస్తూ ఉంటాను.

1966వ, సంవత్సరము నేను, మా అక్క లక్ష్మీ, స్కూల్ ఫైనల్ పాస్ అయినాము. కాని ఇద్దరికి ఆవరేజ్ మార్కులే వచ్చాయి, మంచి మార్కులు రాలేదు. కాని ఇద్దరికీ ప్రి యూనివర్సిటీ కోర్సులో సీటు లభించింది. నేను కర్నూలులోని ప్రభుత్వ పురుషుల కాలేజిలో చేరినాను. అక్కడ కాలేజీ భవనం చాలా పెద్దది, బాగా కట్టబడివుంది. అంత మంచి భవనంలో చాలా మంది పిల్లల మధ్య చదువుట నాకు చాలా సంతోషం అయింది. కాలేజిలో అడ్మిషన్ కొరకు వెళ్ళినపుడు కాలేజి ప్రిన్సిపల్,

“ బాబు ! నువ్వు ఎంత చిన్నగా ఉన్నావూ!! నీ అసలు వయస్సు చెప్పు!!!”అని అన్నాడు. కాని నేను నా రిజిస్టర్ నందలి వయస్సు మాత్రమే చెప్పినాను. అప్పుడు నాకు కేవలం 14 సంవత్సరాల వయస్సు మాత్రమే. కాని రిజిష్టరులో 16 సంవత్సరాలని చూపబడివుంది.

అడ్మిషన్ రోజే నేను కాలేజి హాస్టల్‌లో చేరినాను. హాస్టల్ కొంచెం చిన్నదైనా చాలా అందంగా ఉంది. హాస్టల్ మధ్యలో మరియు హాస్టల్ చుట్టూ చిన్న గార్డెన్ ఉంది. హాస్టల్ నాకు బాగా నచ్చింది. మొదటి రోజే చాలా మంది పరిచయమైనారు. చాలా మంది వారికి వారే, “ నీ పేరేమిటి బాబు! చాలా చిన్నగా ఉన్నావే!!” అని పరిచయం చేసుకొన్నారు. వారిలో ‘ మీరా’ అనే బాలునితో, నాకు మొదటి రోజే మంచి స్నేహం ఏర్పడింది. అతను కూడా నా వలెనే చాలా చిన్నగా కన్పిస్తున్నాడు. కాని అతని వయస్సు నా కంటే ఎక్కువే. నన్ను ఇష్టపడ్డ మరో విద్యార్థి “రంగారావు”, ఇతను చాలా పరిపక్వత చెందిన వ్యక్తి, వయస్సు కూడా ఉండవలసిన దానికంటే ఒకటి రెండు సంవత్సరములు ఎక్కువే. ఇతనికి మంచి లోకజ్ఞానం, ఇంగ్లీషు భాష యందు మంచి పాండిత్యం కలవు. చిన్నప్పటి నుండే ఇతనికి మంచి నాయకత్వపు లక్షణాలు ఉండేవి. కాలేజిలో చేరిన కొద్ది రోజులకే ఇతను కాలేజిలో అందరికి పరిచయం అయినాడు. ప్రిన్సిపాల్‌తో సహా అందరు అధ్యాపకులకు ఇష్టుడైనాడు. ఇతను కొద్ది రోజులలోనే నాకు మంచి స్నేహితుడు అయిపోయాడు. ప్రతిరోజూ నన్ను కలసి నా బాగోగులు అడిగేవాడు. నాకు ఎన్నో తెలియని విషయాల గురించి చెప్పేవాడు. బాగా చదవమని ప్రోత్సహించేవాడు. కాని హైస్కూల్ నందు నా విద్య అంతా మాతృభాష తెలుగులోనే సాగింది. కనుక ఇప్పుడు ఇక్కడ ఇంగ్లీషు మీడియం నందు ఏమాత్రమూ అర్థము చేసుకోలేక పోయేవాన్ని. అందరివలె కనీసం ఇంగ్లీషులో చదువుటకు అవసరమైన ప్రత్యేక శ్రద్ధ కూడా తీసుకొనలేదు. కనుక చదువులో బాగా వెనుకబడిపోయాను.

హాస్టల్ జీవితము చాలా సంతోషంగా గడిచిపోవుచున్నది. హాస్టల్‌లో ‘ సుబ్బారెడ్డి ’ అనే అధ్యాపకుడు మా అందరితో పాటే ఉండేవారు. ప్రతిరోజు ఆయన మాతో ఇష్టంగా మాట్లడేవాడు. హాస్టల్ నుంచి ఊరి లోనికి వెళ్ళుటకు నా సైకిల్ ఉపయోగించేవాడు. ఈయనతో ఈ నాటికి మంచి సంబంధాలు ఉన్నాయి. నేను కాలేజిలో చేరిన మూడు నెలల తర్వాత సెలవులకు మా పల్లెకు వెళ్లినాను. ఆ మూడు నెలల లోనే బాగా ఎత్తు, బరువు పెరిగాను. నాలో యవ్వనపు ఛాయాలు కన్పించుచున్నవి. యవ్వనపు ప్రారంభ దశ

చాలా ఉత్సాహభరితంగా ఉంటుంది. బాగా ఎదుగుచున్న నన్ను చూసి మా అమ్మ, నాన్న, చాలా సంతోషించినారు. మా నాన్న నన్ను ఎంతగానో అభినందించి, నా చదువు గురించి వాకబు చేసినాడు. నేనేమో దిగులు చెందకుండా బాగా చదువుచున్నానని బొంకినాను. నేను పుట్టినప్పటి నుండి మా నాన్నకు నన్ను పెద్ద డాక్టర్‌ను చేయాలని తద్వారా బాగా డబ్బు సంపాదించాలని, సంఘంలో మంచి పలుకుబడి సంపాదించాలని కోర్కె ఉండేది. ప్రస్తుతం నన్ను చూసి తన ఆశయం తొందరలోనే సిద్ధిస్తుందని నమ్మి సంతోషించసాగాడు. సెలవుల తర్వాత సంతోషంగా కాలేజికి వెళ్ళాను.

మా అమ్మ మంచి, మంచి పిండివంటలు చేసి నాతో పంపింది. వాటన్నింటిని మా స్నేహితులతో కలసి ఒక్క రోజు లోనే ఖాళీ చేసేశాము. కాలేజిలో ఎన్.సి.సి లో చేరాను. దాని వలన మంచి వ్యాయామము, మంచి నడవడిక, ఇతరుల పట్ల స్నేహ భావము పెంపొందినవి. చదువులో మాత్రము మునుపటి వలెనే ఏ పాఠ్యాంశంలోనూ సరియైన నేర్పు సాధించలేక పోయాను. మా నాన్న, మా అక్క శిరీష ఉత్తరాలు రాస్తుండేవారు. వారు నన్ను బాగా చదవమని, దాని వలన నా భవిష్యత్తు ఎంత బాగుంటుందో వివరించేవారు. కాని ఎందుకో నేను చదువు గురించి శ్రద్ధ అస్సలు తీసుకోలేక పోయాను. మా నాన్న మాత్రం నేను తప్పక ఫస్ట్ క్లాసులో పాసై మెడికల్ కాలేజిలో సీటు సంపాందించెదనని నమ్మకంగా ఉండేవాడు. కాని అయన ఆలోచనలు ఫలప్రదం కావాలంటే ఏమేమి చర్యలు తీసుకొనవలెనో ఆయనకు తెలియలేదు. నాకు ఆయన ఆశలను నేరవేర్చవలెనన్న శ్రద్ధగాని, అందుకు నేను చేయవలసిన కృషి గురించి గాని ఏమాత్రమూ అవగాహన ఉండేదికాదు. అసలు నన్ను చిన్న వయస్సు లోనే 3 వ, తరగతి నుండి 6 వ, తరగతి చేర్చినపుడే అసలు తప్పంతా జరిగింది. ఇప్పుడు దానిని సరిదిద్దుట చాలా కష్టం. కాని సరి దిద్దవలెనన్న ప్రయత్నం ఏమాత్రము చేయలేదు. ఎక్కడ, ఎప్పుడు పొరపాటు జరిగింది అని మా నాన్న ఆలోచించలేదు. మరి కొద్ది రోజులకు నా ప్రి యూనివర్సిటీ పబ్లిక్ పరీక్షలు జరిగినవి. ఆ వారం రోజులు తెల్లవార్లు మేలుకొని చదివినాను. కాని ఏ విషయము నా తలకెక్కలేదు. ఏ పరీక్షా సరిగా వ్రాయలేదు. కనీసం పాసైతాననే నమ్మకం కూడా కలగలేదు. కాని నేను థర్డ్ క్లాసులోనైన పాసైతానని ఆశపడ్డాను. పరీక్షలు అయిపోయిన వెంటనే ఊరికి పోయాను.

నెల రోజులు వేసవి సెలవులు ఆనందంగా గడిచాయి. అప్పుడప్పుడు పరీక్షల ఫలితాలు ఎలా ఉంటాయోనని భయపడేవాడిని. అప్పుడు నా తల్లిదండ్రులకు నా ముఖం ఎలా చూపించాలోనని బాధపడేవాన్ని. ఆ రోజు రానే వచ్చింది. నేను అన్ని సబ్జెక్ట్స్‌లో తప్పినాననే చేదు నిజం నాకైతే ఊహించినదే అయినా మా నాన్న మాత్రం ఆ నిజాన్ని అంత సులభంగా జీర్ణించుకోలేకపోయాడు. కాని ఆయన నన్ను ఎంత మాత్రం దూషించలేదు, కనీసం తప్పుకూడా పట్టలేదు. కుటుంబ సభ్యులంతా బాధపడినారు. కాని అందరి కంటే ముందు మా నాన్నే తేరుకున్నాడు. వెంటనే ఆయన మా బంధువులలో ఒకరైన సూర్యనారాయణరెడ్డి గారితో సంప్రదించి నన్ను తిరుపతి పట్టణంలో ఒక మంచి కాలేజిలో తిరిగి పి.యు.సి.లో చేర్చినారు.

తిరుపతి ఒక పెద్ద పట్టణం. అది ఒక పెద్ద పుణ్యక్షేత్రం కూడా. అప్పటికే అక్కడ కొన్ని యూనివర్సిటీలు, చాలా కాలేజీలు నెలకొల్పబడి ఉన్నాయి. అది ఒక పెద్ద విద్యా కేంద్రము, ఒక పెద్ద యాత్రాస్థలము మరియు ఒక పెద్ద వ్యాపార కేంద్రము అయినందున అది వేగంగా అభివృద్ధి చెందుచూ, ప్రతిరోజు ఎంతో మంది ఆ నగరానికి వచ్చి పోతూ ఉండేవారు. తిరుపతిలో నేను హాస్టల్‌లో చేరలేదు. నేను 'ఖాజా మొహిద్దీన్' అనే ఇంకొక విద్యార్థితో కలిసి ఒక రూము బాడుగకు తీసుకొని అందులో చేరినాను. 'ఖాజామొహిద్దీన్' అప్పుడే

పి.యు.సి. ఫస్ట్ క్లాసులో పాసై డిగ్రీ కోర్సులో చేరినాడు. ఖాజా చాలా తెలివైన విద్యార్థి, అతను స్కూల్ ఫైనల్ లో కర్నూలు జిల్లా మొత్తం అంతటికి మొదటి మార్కులు సంపాదించియున్నాడు.అతను కూడా వైద్య విద్యను అభ్యసించాలని భావించి ఉండేవాడు. కాని దురదృష్టవశాత్తు అతనికి ఆ కోర్సులో చేరుటకు సరిపడా మార్కులు రాలేదు. కనుక వేరొక డిగ్రీ కోర్సులో చేరినాడు. కొద్ది రోజుల్లోనే ఖాజా, నేను మంచి స్నేహితులమయిపోయాము. ఖాజా నన్ను,

"సూర్యా! నీవు మొదటి నుండి కష్టపడి చదువు, ఏదైనా అర్థం కాకపోతే నన్ను అడుగు నేను సహాయం చేస్తాను. ఇప్పటి నుండి ప్రతి రోజూ శ్రద్ధతో చదివిన యెడల, ఫస్ట్ క్లాసులో పాసవడం కష్టం కాదు. అలాగే, వైద్య విద్యకు అవసరమయ్యే మార్కులు సాధించడమూ అంత కష్టం కాదు" అని ప్రోత్సహించేవాడు.

నేను ఖాజాతో కలసి చదువుచుండేవాన్ని. మెల్లగా అన్ని పాఠ్యాంశములు అర్థం చేసుకొంటున్నాను. అసలు ఇంగ్లీషు మీడియంలో చదువుటకు ఇంగ్లీషులో మంచి ప్రావీణ్యం అవసరం అని గ్రహించి, మెల్లగా ఇంగ్లీషు అలవాటు చేసుకుంటున్నాను. కొద్ది రోజుల అతని సహచర్యం వలన, నా మీద నాకు నమ్మకం కుదిరింది. దాంతో పట్టుదలా పెరిగింది. ఎలాగైనా మెడిసిన్‌లో సీటు సంపాందించి, మా నాన్న కోర్కె నేరవేర్చాలను కొన్నాను. అయితే మధ్యలో నాకు జబ్బు చేసింది. నేను టైఫాయిడ్ జ్వరంతో బాధపడుచున్నానని డాక్టర్లు చెప్పారు. అప్పట్లో ఆ జ్వరానికి అంత మంచి మందులు ఉండేవి కావు. దాదాపు మూడు వారాలకి కాని జ్వరం తగ్గలేదు. తర్వాత కోలుకొనుటకు మరొక రెండు వారాలు పట్టింది. దీంతో చాలా బలహీనంగా తయారైనాను. చదువు చాలా కుంటు పడింది. అయితే తొందరలోనే చదువులో మళ్ళీ గాడిలో పడినాను. ఇంతలోనే పబ్లిక్ పరీక్షలు వచ్చినవి. ఎంతో బాగా వ్రాయగలనని అనుకొన్న పరీక్షలు అంత బాగా వ్రాయలేక పోయాను. అయితే తప్పక ఫస్ట్ క్లాసు వస్తుందని నమ్మినాను. ఖాజాకు గుడ్‌బయ్ చెప్పి ఇంటికి బయలు దేరినాను. మా నాన్న సంతోషంగా కన్పించినాడు. నేను మాత్రం ముభావంగానే ఉన్నాను. అప్పుడే మెడిసిన్ కంప్లీట్ చేసుకొని ఇంటికి వచ్చిన మా అక్క శిరీష, నేనప్పుడే మెడిసన్‌కు ఎంపికైనట్లు నాతో సంతోషంగా మాట్లాడింది. కొద్ది రోజుల తర్వాత ఫలితాలు తెలిసినవి. నేను గ్రూపు సబ్జెక్టులో 58 శాతం మార్కులు మాత్రమే సాధించాను. మెడిసన్ చేరవలెనంటే కనీసం 75 శాతం అయినా మార్కులు ఉండవలెను. నేను చాలా దిగులుగా నీరు కారిపోయాను. కాని ఆశ్చర్యంగా మా నాన్న మాత్రం నా మార్కులు చూసి సంతోషించి,

"సూర్యా! వెంటనే తయారుగా ఉండు, నీకు డొనేషన్ కట్టి మెడికల్ కాలేజిలో చేర్పిస్తాను!!" అని చెప్పినాడు.

ఎందుకంటే, అప్పట్లో మెడిసిన్ డొనేషన్ కట్టి చేరుటకు 50 శాతం మార్కులు వస్తే చాలు. కాని నాకు డొనేషన్ కట్టి చేరుటకు సిగ్గనిపించింది. అది నేను అవమానకరంగా భావించి మొండిగా నేను డొనేషన్ కట్టి చేరనేచేరను", అని చెప్పినాను. మా నాన్న నన్ను ఇంక బలవంతం చేయలేదు. నేను మరలా కర్నూలు కాలేజిలో డిగ్రీలో చేరుటకు ప్రయత్నించినాను. కాని కొన్ని సాంకేతిక కారణాల వల్ల నా అప్లికేషన్ తిరస్కరించినారు. ఇంక నేను వేరే కాలేజిల్లో అప్లై చేసుకోలేదు. అప్పటికే అడ్మిషన్స్‌కు టైం అయిపోయింది. కనుక నాకు ఎక్కడా సీటు రాలేదు. అప్పుడు మా నాన్న చాలా కోపంగా నన్ను తిట్టి,

"సూర్యా ! వెంటనే హైదరాబాదుకు పో, అక్కడ చాలా కాలేజీలు ఉన్నాయి, ఏదో ఒక కాలేజిలో సీటు దొరకకపోదు. వెంటనే పోయి అక్కడ ఏదో ఒక డిగ్రీ కోర్సులో చేరు, తద్వారా నీకు ఒక సంవత్సరం వృధా

కాకుండా ఉంటుంది", అని చెప్పినాడు. వెంటనే నేను సరిపడినంత డబ్బు తీసుకొని హైదరాబాద్ ప్రయాణమై పోయాను. హైదరాబాద్ లాంటి పెద్ద నగరాన్ని చూడడం అదే మొదటి సారి. అక్కడ అన్ని నాకు ఆశ్చర్యంగానే కనిపించాయి. అది 1968 వ సంవత్సరం, అప్పటికి ఇంకా ఉర్దూనే ఎక్కువ మాట్లాడేవారు. తెలుగు అక్కడక్కడ మాట్లాడేవారు. నేను కాచిగూడ అనే ప్రాంతంలో, టూరిస్ట్ హోటల్‌లో రూము తీసుకొని దిగినాను. ఒంటిరిగా హోటల్‌లో దిగడం అదే మొదటిసారి. అందులోనూ అంత పెద్ద పట్టణంలో ఎవ్వరూ తెలియదు, నాకు అన్ని కొత్తే. భయం, భయం గానే, అక్కడ కొన్ని కాలేజీలకు పోయి డిగ్రీలో ఆడ్మిషన్ కొరకు అడిగినాను. చాలా మంది నీవు ముల్కివా?కాదా? అని అడిగినారు. నాకు ఆ పదము వినుట అదే మొదటిసారి. ముల్కి అంటే ఆ ప్రాంతం వాడు అనే అర్థం వస్తుంది. అంటే తెలంగాణా వాడివా, కాదా, అనే అర్థం వస్తుంది. కొందరు నీది రాయలసీమా? అని అడిగినారు. నేను మాది కర్నూలు జిల్లా అని సమాధానం చెప్పినాను. ఆంధ్రప్రదేశ్, ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమ అనే మూడు ప్రాంతాలుగా ఉన్నట్లు నాకు అప్పటికీ తెలియనందుకు నా మీద నాకే జాలి వేసింది. కొందరు నా అమాయకత్వము చూసి జాలిపడినారు. మా నాన్న, నాకు ఒక దూరపు బంధువు అడ్రస్ ఇచ్చియున్నాడు. అతను నేను దిగిన హోటల్ దగ్గరే 'కోఠి' అనే ప్రాంతములో ఉన్నాడు. అతి కష్టము మీద అతని అడ్రస్ కనుక్కొని అతని ఇంటికి పోయాను. అతను ఇంత దూరము చదువుకొనుటకు వచ్చినందుకు నన్నూ, మా నాన్ననూ, నిందించి తరువాతి రోజు ప్రొద్దున్నే మరలా రమ్మని చెప్పి "రిక్షాబాడుగకు మాట్లాడు కొనునప్పుడు ' ఆఠణా' మాత్రమే ఇస్తానని చెప్పి, అర్ధ రూపాయి ఇవ్వు, అంతకంటే ఎక్కువ ఇవ్వవద్దు" అని చెప్పి పంపినాడు.

మరుసటి రోజు ప్రొద్దున్నే లేచి తయారై హోటల్ నుండి బయటికి వచ్చి, "కితనా దేనా కోఠి జానేకా"? అని వచ్చీ రాని ఉర్దూలో రిక్షా అతనిని అడిగినాను. అందుకతను 'చాలీస్ పైసా దేవో' అని చెప్పినాడు. నేను అందుకు అంగీకరించక, 'నహీ, ఆఠాణా దేవుంగా' అని చెప్పినాను అందుకతను చిరునవ్వు నవ్వి వెంటనే ఎక్కించుకొని 'కోఠి' చేర్చినాడు. తరువాత చాలీస్ పైసా అంటే నలభై పైసలే అని తెలుసుకున్నాను. మా బంధువు నన్ను కూర్చోన పెట్టుకొని పెద్ద పట్టణములో ఉండే సమస్యలన్నీ వివరించి ఇంత దూరము వచ్చి చదువ వలసినపని ఏమి? ఇక్కడ ఖర్చు కూడా చాలా ఎక్కువ, చదువు కూడా సరిగ్గా సాగదు. కనుక నీవు వచ్చిన దారినే వెనక్కు వెళ్ళి, అక్కడనే ఎక్కడో ఒక చోట సీటు సంపాదించుకొని చదువుకొమ్మని చెప్పినాడు. హైదరాబాదులో ఏ కాలేజీ లోనూ సీటు దొరికే సూచనలు కన్పించలేదు. నేను ఎక్కడా డిగ్రీ కోర్సులో చేరకుండా ఇంటికి వెళితే మా నాన్న తిడతాడని భయపడి నేరుగా తిరుపతికి వెళ్ళాను. అక్కడ ఒక స్నేహితుని రూములో బసచేసి, తిరుపతి చుట్టు ప్రక్కల ఉన్న కాలేజీలన్నింటికి వెళ్ళి ఏదైనా కాలేజీలో సీటు దొరుకుతుందేమోనని ప్రయత్నించ సాగాను. అప్పుడు కర్నూలులో నాకు బాగా పరిచయస్థుడైన అధ్యాపకుడు సుబ్బారెడ్డిగారు తటస్థపడి,

"తిరుపతికి యాభై కిలోమీటర్ల దూరములో వెంకటగిరి అనే ఊరిలో ఈ సంవత్సరమే ఒక కొత్త కాలేజీ తెరిచినారు. కనుక అక్కడ ప్రయత్నించు," అని చెప్పినాడు.

నేను వెంటనే వెంకటగిరి వెళ్ళి అక్కడ బి.కాం., డిగ్రీ కోర్సు నందు చేరినాను. వెంకటగిరి అటు పల్లె ఇటు పట్టణము కానట్టి చిన్న బస్తీ. ఆ ఊరిలోనికి ప్రవేశించిన వెంటనే నాకు ముందుగా ఒక జమిందారీ వంశమునకు చెందిన పెద్ద పెద్ద భవంతులు కన్పించాయి. ఆ ఊరిలో దుకాణాలు కూడా కొంచెము ప్రత్యేకంగానే కన్పించినవి. మిగిలిన ప్రజల ఇల్లు కూడా చాలా మటుకు పెంకుటిల్లే. నాకు ఆ ఊరు, అక్కడ

నివసించే ప్రజలు అందరు బాగా నచ్చారు. ఆఖరుకు నేను సరియైన చోటికే వచ్చాననుకొని సంతృప్తి పడ్డాను. చాలా మంది విద్యార్థులు, ఇంకా బయటివారు కూడా తమంతకు తామే పరిచయము చేసుకొని స్నేహితులైనారు. వారిలో ఎ.బి. ఆచార్య, పి.ఆర్.వి. ప్రసాద్, వెంకయ్య నాయుడు, సుబ్బారావు మొదలైనవారు ముఖ్యులు. వీరితో నేటికీ నాకు స్నేహము కొనసాగుచున్నది. ఈ ఊరిని నేను చాలా ఇష్టపడినాను. నేటికీ ఆ ఊరిలోని అన్ని వీధులు, ప్రదేశములు బాగా గుర్తున్నాయి. వెంకటగిరి జరీ చీరలు దేశములోనే చాలా ప్రసిద్ధిగాంచినవి. ఇక్కడే వీటిని నేస్తారు. నా ప్రియమైన స్నేహితుడు ఏ.బి.ఆచార్య చేనేత కుటుంబము నుండే వచ్చినాడు. ఒక రోజు వెంకటగిరి లోని అన్ని వర్గాల వారు ఒక పండుగ జరుపుకొంటారు. ఆ రోజు వారు చాలా మంది అతిథులను పిలిచి వారికి ఆతిథ్యమిస్తారు. నన్ను చాలా మంది వారి ఇళ్లకు భోజనానికి పిలిచారు. ఏ.బి.ఆచార్య కూడా పిలిచాడు. నాకు ఆచార్య చాలా ముఖ్యమైన మిత్రుడు కనుక వాళ్ళ ఇంటికే భోజనానికి వెళ్ళాను. అక్కడ వారి స్థితిగతులను తెలిసికొని, నేత కార్మికుల సమస్యల గురించి వాకబు చేసినాను. అప్పుడు వారు, ధనవంతులైన వ్యాపారులు వీరితో అందమైన మరియు నాణ్యమైన జరీ చీరలు నేయించి, వాటిని బజారులో ఎక్కువ ధరకు అమ్ముచూ, కార్మికులకు మాత్రము చాలా తక్కువ రుసుము చెల్లిస్తారని వివరించారు. కాని వెంకటగిరి జరీ చీరలు నేటికి కూడా అందంగా, నాణ్యంగా నేస్తున్నారు. చీరలు ధరించే అలవాటున్న ఆడవారికి చాలా మందికి, వీటి నాణ్యత గురించి, వీటి అందము గురించి బాగా తెలియును.

కాలేజీలోని అధ్యాపక బృందము వారి, వారి విభాగములలో నిష్ణాతులై ఉన్నారు. ఈ అధ్యాపకులను నేను నా జీవితాంతము మరువలేను. వారు శేషగిరిరావు గారు, సుబ్రమణ్యం గారు, శ్రీనివాసరావు గారు, మీరారెడ్డి గారు, అనంతరామశర్మ గారు మరియు ప్రిన్సిపాల్ చలపతిరావు గారు మొదలైనవారు. నాకు జీవితంలో మొదటిసారి అప్పుడే చదువంటే ఇష్టము ఏర్పడింది. దొరికిన ఈ అవకాశమును సరిగ్గా ఉపయోగించుకుంటున్నాను. కానీ, నా స్నేహితులలో కొందరు నా చదువుకు ఆటంకము కల్గించుచున్నారనే అనుమానము వచ్చినది. వెంటనే నేను రూము మార్చి, ఈ స్నేహితులకు దూరంగా చదువుకు ఏ ఆటంకము కలుగకుండా జాగ్రత్త పడవలెనని భావించినాను. కానీ విధి చాలా బలీయమైనది. ఈ లోపలే వెంకటగిరిలో ఒక రాత్రి పెద్ద జాతర జరగబోతున్నదని తెలిసింది. అక్కడి ప్రజలు, ఆ జాతరను చాలా ఇష్టంగా, ఆర్భాటంగా జరుపుకుంటారని విన్నాను. వారు తమ బంధువులను దూర ప్రాంతాల నుండి కూడా పిలిపించుకుంటారు. నాతో స్నేహంగా ఉన్న చాలా మంది విద్యార్థులు ఆ జాతరలో తామూ పాల్గొని ఆనందించాలని తయారైపోయారు. ఎందుకో నాకు అందులో పాల్గొనడం ఇష్టములేక ఆరోజు రాత్రి రూము లోనే కూర్చొని చదువుకుంటూ ఉన్నాను. దాదాపు 11 గంటల వరకు చదివి నిద్రకుపక్రమించాను. నా రూమ్మేట్ కూడా ఆ రోజు ఎందుకో స్నేహితులతో బయటికి పోకుండా అప్పటికే నిద్రపోయి వున్నాడు.

నేను పడుకున్న 15 నిమిషములకు చాలా మంది హాస్టల్ నుండి మరియు బయటి రూముల నుండి విద్యార్థులు కలివిడిగా మా రూముకు వచ్చి మా రూమ్మేట్‌ను నిద్రలేపారు. వారిలో కొందరు ముందుకు వచ్చి ఇక్కడి ఊరిలోని వారు బయటి నుండి చదువుకొనుటకు వచ్చిన విద్యార్థులను బయట తిరుగకుండా కొట్టి అవమానిస్తున్నారని, ఇప్పుడు వారికి సరియైన సమాధానము చెప్పని యెడల వారు తరువాతి రోజు నుండి మనలను హీనంగా చూచెదరని, కనుక మన మందరము కలసి వెంటనే బస్తీ అంతా తిరిగి రావలెనని, అందుకు నా రూమ్మేట్‌ను తమకు నాయకుడిగా ఉండాలని బలవంతము చేసినారు. వెంటనే

అతనందులకు అంగీకరించి వారితో బయటకు వెళ్ళుటకు సిద్దమయ్యాడు. ఈ లోపల వారిలో ఒకరు, "సూర్యా ఏమీ పలకకుండా పడుకున్నాడే" అని, నన్ను లేపి వారి వెంట రమ్మని పిలిచారు. అప్పటికి నాకు ఇంకా నిద్రపట్టలేదు, నిద్ర నటిస్తూ అంతా గమనిస్తూ ఉన్నాను. వారు పిలిచిన వెంటనే జరుగపోవు పరిణామాలు సరిగ్గా అంచనా వేయక తొందరపడి వారి వెంట బయలుదేరినాను.

మేమంతా కలసి ఊరంతా తిరిగినాము. గంగమ్మను దర్శించుకొని నమస్కరించుకున్నాము. ఆ రోజు రాత్రి ఊరంతా విద్యుత్ దీపాలతో వెలిగి పోవుచున్నది. చాలా మంది క్రొత్త వారు కనిపించినారు. వారంతా ఊరిలోని వారి బంధువులు, అతిథులు. చాలా మంది స్త్రీలు అందంగా అలకరించుకొని కన్పించినారు. మేము మౌనంగానే ఊరిలో తిరుగుచున్నాము. మాకు మనసు లోపల కీడు శంకిస్తూ ఉన్నా బయటికి బింకంగానే ఉన్నాము. ఎక్కడా ఎటువంటి అవాంతరము ఎదురు కాలేదు. అంతా తిరిగి రూముకు చేరువలోకి వచ్చాము. అంతలో, ఉన్నట్లుండి ఒక స్థానికుల గుంపు వేగంగా మా వైపు వచ్చి, మా గుంపులోని నాయకుడైన నా రూమ్మేట్ ను పక్కకు లాగి, ఇష్టము వచ్చినట్లు కొట్టుట ప్రారంభించినారు. మిగిలిన విద్యార్థులంతా వెంటనే పారిపోయినారు. నేను తప్ప ఒక్కరు కూడా నిలువలేదు. నా రూమ్మేట్‌ను కింద పడవేసి చాలామంది బాదుతూ ఉంటే నేను చూడలేక పోయాను. అలాగే పారిపోవుటకు నా మనసు అంగీకరించలేదు. వెంటనే గుంపు మధ్యలోకి దూకి ఇద్దరు, ముగ్గురిపై చేయిచేసుకొన్నాను. వెంటనే వారు నన్ను గుర్తించి నాపై పిడి గుద్దులు గుద్దసాగారు. వారంతా చాలామంది ఉన్నారు. నేనేమో ఒక్కడిని, అందరు నా కంటే బలంగా ఉన్నారు. నా మెదడు మొద్దు బారింది. ఆ క్షణంలోనే నాకు తెలిసిన ఆ ఊరిలోని ముఖ్యులలో ఒకరు", 'సూర్యా' చాలా మంచి వ్యక్తి, అతనిని కొట్టవద్దు" అని నన్ను పొదివి పట్టుకొని గుంపునుండి బయటికి లాగి,

"సూర్యా ! నీవెందుకు వీరితో చేరినావు, నీవు వెంటనే ఇక్కడి నుండి వెళ్ళిపో," అని నన్ను కొద్ది దూరము పక్కకు తోడుకొని వెళ్ళి వదిలినాడు. ఆ సమయంలో నేనేమి మాట్లాడలేక పోయాను. నాకు నా రూమ్మేట్ ను రక్షించవలెనన్న తలంపు తప్ప ఇంకేదీ మనసులో లేదు. వెంటనే దగ్గరలోనే ఉన్న పోలీస్ స్టేషన్‌కు పరుగుపెట్టినాను. స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్ మాత్రమే ఉన్నాడు. అతను విషయమంతా విని, "నేను స్టేషన్‌కు కాపలాగా ఉన్నాను. మిగిలిన వారంతా జాతరలో డ్యూటీ చేస్తున్నారు, రేపు వచ్చి ఫిర్యాదు చేయి," అని చెప్పినాడు. ఇంకేమి చేసేది లేక కాళ్ళు ఈడ్చుకుంటూ రూము చేరినాను. కొద్ది సేపటికి నా రూమ్మేట్ ఎఱ్ఱబడిన కళ్లతో, వాచిన మొహంతో, విపరీతమైన అవమానభారంతో, ఎట్లయినా వారిపై పగ తీర్చుకొనవలెననే నిశ్చయంతో, కోపంగా రూముకు తిరిగివచ్చినాడు. తరువాత కొద్ది సేపటికి, పారిపోయిన మిగతా విద్యార్థులంతా రూము చేరుకున్నారు. వారు చేసిన తప్పుకు, వారు మాకు మోహం చూపించలేక పోయారు. అప్పుడు నేనే చొరవ తీసుకొని "అవును మనం తప్పక పగ సాదిద్దాం! అందుకు ముందుగా ఈ ఊరు వదిలి తిరుపతి కాలేజీలో చేరుదాం, తరువాత పగ తీర్చుకునే మార్గం అలోచిద్దాం!!" అని వెంటనే ముఖ్యమైన కొందరు స్నేహితులతో రాత్రి ఒంటిగంట ప్రాంతంలో వెంకటగిరి వదలి మరుసటి రోజు మధ్యాహ్నమునకు కర్నూలు చేరుకున్నాము. వెంటనే ప్రతీకారము తీర్చుకొనవలెనని ప్రయత్నించినాము, కానీ కుదరలేదు. సరే, కొద్దిరోజులు సమయము కొరకు వేచి ఉందాము, అని మరల వెంకటగిరికి ప్రయాణమై పోయాము. పోయిన వెంటనే, ఇన్నాళ్ళు చదివిన ఆ కాలేజిలో టి.సి. తీసుకున్నాము. మధ్యలో ప్రిన్సిపాల్ మమ్ములను సముదాయించి అక్కడే నిలువరించేటందుకు ప్రయత్నించాడు. కాని, మేమందులకు అంగీకరించక తిరుపతి పోవుటకు

సంసిద్ధులమైనాము. అప్పుడు నాకు మాత్రమే ముఖ్యమైన స్థానికులైన స్నేహితులు, నన్ను వారి ఇళ్లకు పిలిచి నన్ను అక్కడే ఉండిపోమ్మని లేనిచో నేను తిరుపతిలో చేరకుండా ఇంకొక ఊరికి పోయి, నేను ఒక్కడిని వేరే కాలేజిలో చేరి, మిగిలిన చదువు సక్రమంగా కొనసాగించమని చెప్పినారు. నేను ఈ విషయమై తీవ్రంగా ఆలోచించి, వారి మాటల్లోని సత్యాన్ని గ్రహించి తిరుపతిలో చేరకుండా మదనపల్లి అనే ఊరికి వెళ్ళి అక్కడ బి.కాం., ఆఖరి సంవత్సరంలో చేరినాను. కానీ, వెంకటగిరిలో నేను గడిపిన జ్ఞాపకాలు నా మనుసులో స్థిరంగా ఉండి పోయాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే మదనపల్లి చల్లగా ఉంటుంది. వెంకటగిరి, మరియు మా సొంత ఊరి వలె కాక, ఇక్కడ అక్కడక్కడ చిన్న, చిన్న కొండలు, లోయలు ఉండి చల్లనివాతావరణంతో, పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ ప్రాంతము నాకు చాలా బాగా నచ్చింది కాలేజిలో చాలా మంది స్నేహితులు ఏర్పడినారు. నేను ఒక్కడినే ఒక రూములో చేరి, ఇక స్నేహితులతో జాగ్రత్తగా ఉండవలెనని నిర్ణయించుకున్నాను. కానీ, ఇక్కడి వాతావరణం నన్ను కుదురుగా ఉండనివ్వలేదు. మదనపల్లెకు దగ్గరలోనే హర్సిలీ హిల్స్ అనే వేసవి విడిది ఉంది. అక్కడి ప్రకృతి చాలా చల్లగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉత్సాహవంతుడనైన నన్ను కొందరు స్నేహితులు, కాలేజి విద్యార్థుల రాజకీయాల్లోకి లాగినారు. జాగ్రత్తగా ఉండాలనుకుంటూనే అందులో కూరుకొనిపోయాను. మెల్లమెల్లగా సిగరెట్ త్రాగడం అలవాటు చేసుకొన్నాను. చదువును అశ్రద్ధ చేస్తూ స్నేహితులతో కలసి తిరగడం నేర్చుకొన్నాను. మదనపల్లెకు 20 కిలోమీటర్ల దూరంలోనే వాయల్‌పాడు అనే ఊరు ఉంది. అక్కడ కూడా ప్రకృతి చాలా చల్లగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. అక్కడ నాకు కొందరు ముఖ్యమైన బంధువులు ఉన్నారు. వారు అంతా నాగరీకులు, పలుకుబడి కలిగిన వారూనూ. క్రమక్రమంగా వారంతా పరిచయమై, నేను వారంతపు సెలవు రోజున అక్కడకు వెళ్ళి, వారితో గడపసాగాను. ఈ విధంగా చదువును ప్రక్కకు నెట్టి మిగతా వాటికి ప్రాధాన్యం ఇస్తూ తిరగ సాగాను. ఇంతలోనే పబ్లిక్ పరీక్షలు దగ్గరపడ్డాయి. అప్పుడు, ముందు జరిగిన సంఘటనలన్ని గుర్తు చేసుకొని తప్పు దిద్దుకోవాలని ప్రయత్నించి, ఆఖరు నిమిషంలో వేగంగా పుస్తకాలను తిప్పినాను, కాని అప్పటికే ఆలస్యం అయింది. కనుక పరీక్షల్లో కొన్నిట్లో తప్పినాను. దానితో బి.కామ్., డిగ్రీ తీసుకొనుటకు ఇంకొక సంవత్సరం పాటు వేచి ఉండక తప్పలేదు. తప్పినందుకు నన్ను ఎవరూ ఏమీ అనలేదు కాని, మా నాన్న మొహంలో చాలా అసంతృప్తి చూసి చలించి పోయాను. డిగ్రీ పట్టా తీసుకొన్న తర్వాత, మా నాన్న, నన్ను తర్వాత ఏమి చేస్తావని, మామూలుగానే, అడిగాడు. అందుకు నేను బెంగళూరులో 'లా' కోర్సు చేస్తానని చెప్పినాను. అందుకు ఆయన సంతోషంగానే అంగీకరించినాడు. ఎందుకంటే, న్యాయవాద వృత్తి పై కూడా ఆయనకు చాలా ఇష్టం ఉండేది. 'లా' కాలేజిలో అడ్మిషన్ సమయానికి బెంగళూరు బయలుదేరి వెళ్ళినాను.

## రెండవ భాగము.

1973 వ, సంవత్సరము బెంగళూరు నగరంలోని బి.యం.ఎస్. ‘ లా’ కాలేజిలో, ‘లా’ కోర్సు నందు చేరాను. బి.యం.ఎస్. ‘లా’ కాలేజి నగరం నడిబోడ్డున ఉంది. కాలేజి మంచి భవనంనందు నెలకొల్పబడి ఉంది. బెంగళూరు నగరం చాలా అందమైనది. ఇది భారతదేశపు ఉద్యానవన నగరంగా కూడా ప్రసిద్ధి గాంచినది. ఇక్కడ అన్ని కోవలకు చెందిన ప్రజలు నివసిస్తూ ఉన్నారు. వివిధ భాషల వారు, వివిధ ప్రాంతాల వారు, వివిధ మతస్థులు, అందరూ ఎంతో ఐకమత్యంగా నివసిస్తూ ఉన్నారు. ఇక్కడి ప్రజలు చాలా సంస్కారవంతులు, చదువుకున్న వారు, సున్నితమైన వారు. ఇక్కడ కన్నడ భాష ముఖ్యమైన భాష, చాలా మందికి తెలుగు కూడా వచ్చు. నేను ఇక్కడనే నా ఇంగ్లీషు భాషను కొంచెం అభివృద్ధి చేసుకొన్నాను.

బెంగళూరు నగరము భారతదేశంలోనే మంచి వాతావరణమున్న ప్రదేశము. ఇక్కడ వేసవిలో చల్లగా, శీతాకాలంలో మరీ చలిగా లేకుండా ఆహ్లాదకరంగా ఉండుట, వర్షాలు బాగా కురియుట వలన ఇక్కడ ప్రతిచోట ఒక ఉద్యానవనము కన్పించును. ఇక్కడి వాతావరణమునకు ఎల్లప్పుడూ రంగు రంగుల పూలు బాగా పూస్తాయి. ఇక్కడ పండ్లు, కాయగూరలు కూడా బాగా పండుతాయి. నేను ఒక స్నేహితుని రూములో దిగి, కాలజీలో చేరిన వెంటనే రాజాజి నగర్ అనే ప్రాంతంలో ఒక పాలిటెక్నిక్ కాలేజి హాస్టలులో చేరినాను. ఆ హాస్టల్ కాలేజీకి చాలా దూరంలో ఉన్నప్పటికి చాలా సౌకర్యవంతంగా ఉన్నది. అక్కడ చేరిన వెంటనే చాలా మంది స్నేహితులయినారు. స్నేహితులలో కన్నడిగులు, తెలుగువారు మరియు తమిళులు అందరూ ఉన్నారు. మేమంతా చాలా మటుకు ఇంగ్లీషులోనే మాట్లాడుకొనేవారము. నా జీవితంలో మునుపు జరిగిన సంఘటనలన్ని నెమరువేసుకొని ఇక మీదట అటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా ఉంటూ బాధ్యతాయుతంగా చదవసాగాను. న్యాయ శాస్త్రము చదువుటకు చాలా ఆసక్తికరంగా ఉంటుంది. హాస్టల్ దూరమైనా కూడా ప్రతిరోజు క్లాసులకు హాజరువుతూ అన్ని సబ్జెక్సు ఏ రోజుకు ఆ రోజు చదువుకుంటూ ఉన్నాను. మా కాలేజిలో చాలా మంచి ప్రొఫెసర్స్ ఉన్నారు. వారంతా వారి వారి విభాగములలో నిష్ణాతులుగా ఉన్నారు. కాలేజిలో మంచి గ్రంధాలయం కూడా ఉండేది. నా కోర్సుకు సంబంధించి చాలా పుస్తకాలు అందుబాటులో ఉండేవి. ఎప్పటికప్పుడూ అన్ని సబ్జెక్సలోనూ తయారుగా ఉంటూ, ఎలాగైనా ‘లా’ పరీక్షలన్ని మంచి మార్కులతో పాసై, మా నాన్న ఆశయము కొంతవరకైన నెరవేర్చవలెనని ఆలోచిస్తూ ఉండేవాడిని. కాని విధి అన్నిటికన్నా బలీయమైనది. మనం నమ్మినా, నమ్మకపోయినా, మనమంతా విధి ఆడే ఆటలో పావులము మాత్రమే. మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ఇంక పదహైదు రోజులు మాత్రమే ఉన్నాయి. నేను పరీక్షలకు బాగా సిద్దమవుచున్నాను. అప్పుడు ఉన్నట్లుండి మా బావగారైన డాక్టరు రాజారెడ్డిగారు తన మిత్రుని పెళ్ళికి హాజరవుటకు బెంగళూరు వచ్చి ఒక హొటల్‌లో దిగి, సాయంత్రం నన్ను చూచుటకు మా హాస్టల్‌కు వచ్చినాడు.

మా బావ రాకతో నాకు సంతోషం కలిగింది. ఆయన నన్ను తన వెంట మంచి హొటల్‌కు పిలుచుకొని వెళ్ళి, భోజనం చేసిన తర్వాత తన రూముకు పిలుచుకొని పోయినాడు. ఇరువురము చాలా సేపు చాలా విషయములను చర్చించుకొని, ఆ తర్వాత పల్లెలో ఉండే మా తల్లిదండ్రుల గురించి వాకబు చేసినాను. అప్పుడు ఆయన కొంచెం ఇబ్బందిగా కదిలి, మీ తమ్ముడు, మీ నాన్న, ఆస్తి విషయమై చాలా తీవ్రంగా కలహించుకున్నారు” అని చెప్పినాడు. ఒక్కక్షణం నా చెవులను నేనే నమ్మలేక “బావా! ఏమిటి నీవు చెప్పుచున్నది? మా నాన్నకు ఏమి జరిగింది? అసలు ఏమి జరిగిందో సరిగా చెప్పు,” అని గట్టిగా అరచినాను. అందుకు మా

బావ, " సూర్యా! శాంతించు, అక్కడ నీవనుకున్నట్లు ఏ నష్టము జరగలేదు, అసలు మీ అమ్మ, మీ నాన్న, ఈ విషయాలేవి నీవద్ద ప్రస్తావించవద్దని, నీ పరీక్షలు దగ్గరలో ఉన్నాయనిచెప్పినారు. నేను ఉండబట్టలేక అసలు విషయం నీతో చెప్పినాను. మీ నాన్న, మీ తమ్ముని మీద క్రిమినల్ కేసు వేసినాడు, కనుక, నీవు ఇంక ఏమాత్రమూ చింతించక బాగా చదువు," అని చెప్పినాడు.

కాని, నన్ను నేను సముదాయించు కొనలేకపోయాను. ఏ మనిషైతే ఎవ్వరికీ భయపడక, ఊరంతా కలసి వ్యతిరేకించినను పోరాడినాడో, అటువంటి వ్యక్తి ఈ రోజు ఈ విధంగా అవమానించబడుట నేను సహించలేకపోయాను. విపరీతమైన ఆలోచనలతో నా శరీరంలోని రక్తనాళాలు ఉబ్బినాయి, తలలో విపరీతమైన నొప్పి వచ్చింది. అప్పుడు టైం రాత్రి పది గంటల ముప్ఫై నిమిషాలు అయినది. దగ్గరలో ఎక్కడా మందుల షాపు తెరిచి ఉండలేదు. మా బావ ఒక టవల్ తెచ్చి, దాన్ని నా తలకు బిగించి కట్టి, ఇక పడుకో కొద్దిగా బాగుంటుంది అని చెప్పి, తర్వాత  కొద్దిసేపటికి అతను నిద్రపోయినాడు. నా ఆలోచనలు పరిపరి విధముల పోవుచున్నవి. నా ఆలోచనల మీద నాకు ఆదుపు లేకుండా పోయింది. నాకే ఇట్లుంటే, ఊరిలో నా తల్లిదండ్రులు ఎలా ఉన్నారో? అని దిగులు చెందాను. నాకు విపరీతమైన ఆలోచనలతో నిద్రరాలేదు. బెడ్‌పై పడుకోలేక హొటల్లో బయట వరండాలో అక్కడికి, ఇక్కడికి పచార్లు చేస్తూ జేబులోని సిగరేట్లన్ని కాల్చివేసినాను. నా ఆలోచనలు ఒక  కొలిక్కి రాలేదు. కొద్దిసేపు మా తమ్ముని మనసులో ఏముంటుందని ఆలోచించినాను. అతని వైపు నుండి కూడా ఆలోచిస్తూ నాలో నేనే తర్కించుకున్నాను. బహుశా, మా తమ్ముడు, మా  నాన్న, తనకూ, మా పెద్దతల్లి గారికి అన్యాయం చేసి, వారిని అనేకమైన కష్టములకు గురిచేసినాడని భావించి ఉండవచ్చు. అందుకే తనలో ఇంతటి ప్రతీకార జ్వాల రగులుతూ ఉండవచ్చు. ఇందులో కొంచెము నిజము ఉన్నా, నాకు మా నాన్నపై ఉన్న గౌరవము వలన నన్ను నేను సముదాయించుకొనలేక పోయినాను. ఇలా విపరీతమైన మానసిక ఆందోళనతో తెల్లవార్లూ మేలుకొని ఉన్నాను. క్రమంగా తెల్లవారింది, హొటల్ లోని రెస్టారెంట్‌లో కాఫీ తయారయింది. ఒక కప్పు కాఫీ త్రాగినాను. కొంచెము మనస్సు కుదుట పడినట్లు అనిపించింది.

మరుసటిరోజు మా బావ బెంగళూరు నుండి ఊరికి వెళ్ళిపోయాడు. నేను మాత్రము అన్యమనస్కంగా, విపరీతమయిన ఆలోచనలు చేయుచూ, నా చదువుపై మనసు లగ్నము చేయలేక, మానసిక క్షోభను అనుభవించినాను. జరిగిన ఈ సంఘటనల నుండి మనసు మరల్చు కోలేకపోయాను. సంవత్సరమంతా చదువు పై నేను చేసిన శ్రమంతా వృధా అయిపోయింది. మిగతా15 రోజుల్లో నా బాధా పెరిగిందే కాని తగ్గలేదు. పర్యవసానంగా నేను కనీసం పరీక్షలు రాసే ప్రయత్నం కూడా చేయలేదు. కానీ, పరీక్షలు జరిగినన్ని రోజులు అక్కడే ఉండి తరువాత ఊరికి బయలుదేరి వెళ్ళాను. నేను మా ఊరు వెళ్ళే సరికి కొంతమంది ముఖ్యమైన బంధువులు, మా నాన్న, మా తమ్ముని మధ్య రాజీ ప్రయత్నాలు మొదలు పెట్టారు. నేను కూడా రాజీకి అంగీకరించాను. కానీ నేను జరిగిన విషయాల గూర్చి మనసులో విపరీతంగా అలోచిస్తూ మదనపడసాగాను. అయినా అపుడు రాజీ కుదిరియుండిన యెడల, నా మనసు ప్రశాంతత పొంది ఉండేదేమొ కానీ, మా నాన్న మరియు మా తమ్ముడు వారి, వారి పట్టింపులకు పోయి రాజీ కుదరలేదు. బంధువులంతా ఎంత ప్రయత్నము చేసిననూ, మా నాన్న, మా తమ్ముని కోర్కెలు ఒప్పుకొనలేదు. కనుక, చేసేది లేక వారంతా వారి వారి ఊర్లకు వెళ్ళి పోయారు. నేను నా మనోవేదనను భరించలేక చాలా విపరీతంగా ఆలోచిస్తూ ఎప్పుడూ దిగులుగా ఉండేవాడిని.

దాదాపు అప్పటికి ఒక సంవత్సరము క్రిందటి నుండి నేను మా తమ్ముని  చూసి యుండలేదు. ఈ సమయం లోనే అతనిని దూరం నుండి చూచుట తటస్థించినది. అతను చాలా ధృడంగా కనిపించినాడు. నాకైతే అతనితో పోల్చుకొని నేను అతనికంటే బలహీనంగా ఉన్నానేమొ అన్న అనుమానం కలిగింది. తరువాత, నేను చదువు కొనసాగించుటకు బెంగళూరు బయలుదేరి  వెళ్ళాను. నేను మొదటి సం॥ 'లా' పరీక్షలు వ్రాయకుండా ఎగురకొట్టినాననే విషయము ఎవరికీ చెప్పలేదు. అయితే అక్కడి యూనివర్సిటీ నిబంధనల ప్రకారము నేను పరీక్షలు వ్రాయకున్నా,  రెండవ సం॥ చదువుటకు అర్హత సంపాదించినాను. ఈ సం॥ నేను హాస్టల్ మార్చి అక్కడి యూనివర్సిటీ  హాస్టల్‌లో చేరినాను. ఈ హాస్టల్ చాలా పెద్దది. కొన్ని వందల మంది విద్యార్థులు ఇక్కడ ఉంటున్నారు. కానీ, నాకు ఒక ఐదారు మందితో తప్ప ఇంకెవరితో పరిచయము కాని, స్నేహము కానీ ఏర్పడలేదు.  ఇప్పుడు కాలేజికి ఈ హాస్టల్ చాలా దగ్గర, ఒక సిటి బస్సులోనే కాలేజి చేరుకొనవచ్చును. మెస్సులో భోజనం కూడా బాగుండేది. అన్ని సౌకర్యవంతంగానే ఉన్నాయి. కానీ నేను నా ఆలోచనలతో చదువు మీద దృష్టిపెట్టలేక పోవుచున్నాను. ఈ సమయంలోనే మా తమ్ముడు, బెంగళూరు లోనే ఇంకొక లా కాలేజిలో 'లా' చేరినాడని తెలియ వచ్చింది. ఈ విషయము నన్ను అనవసరమయిన ఆందోళనకు గురిచేసింది. వెంటనే నేను, అతని వలె నా శరీరమును కూడా ధృడముగా తయారు చేసికొన వలెనని భావించినాను.

హాస్టల్‌కు 3 కిమీ దూరంలో ఉండే ఒక వ్యాయామశాలలో ఆ మరునాడే చేరినాను. వ్యాయామశాల నిర్వాహకుడు 50 సంవత్సరాలు పై పడ్డ వ్యక్తి, కానీ అతడు చాలా ధృడంగా ఉన్నాడు. అతని మాటలలో, అతని చేతలలో, ఆత్మవిశ్వాసము నిండుగా కనిపిస్తూ ఉండేది. నేను ప్రతి రోజు ఉదయం వ్యాయామశాలకు నడుచుకుంటూ వెళ్ళేవాడిని. హాస్టల్ నుండి అక్కడికి  పోవు  రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు  ఉండేవి. అది తెల్లవారే సమయం కావున, కాకులు ఎక్కువగా అరచుకుంటూ, అటూ ఇటూ ఎగురుచూ  ఉండేవి. విపరీతమైన మానసిక ఆందోళనలతో నాలో అదుపు తప్పిన ఆలోచనలు మొదలైనవి. ఉన్నట్టుండి ఒక కాకి నా తలపై నుండి ఎగిరి పోయినది, మరలా ఇంకొక కాకి,  నా తలపై నుండే వేరొక వైపు ఎగిరిపోయినది. నాకు ఈ కాకులు ఏదో సందేశమిస్తున్నాయి, అవి నన్ను ఈ మానసిక వేదన నుండి మరియు ఈ సమస్యల నుండి కాపాడుటకు ప్రయత్నించుచున్నాయనే ఆలోచన వచ్చింది. వెంటనే నేను అవి నామీద నుండి ఏ వైపు ఎగిరిపోయినవో ఆవైపుకు నడువసాగాను.

ఈ ఆలోచనల గురించి ఎవరికీ చెప్పలేదు. బయటికి నేను మాములుగానే కన్పిస్తూ, నా పనులన్నీ సరిగ్గానే చేసుకుంటున్నాను. కానీ నా ఈ విపరీతమైన ఆలోచనల వలన, విపరీతమైన ప్రవర్తన మొదలైంది. అయినప్పటికి, ఈ ఆలోచనలన్నీ పూర్తిగా నిజమని ఇంకా నమ్మలేదు కానీ, వాటికి ప్రభావితుడనవుచున్నాను. రాను, రానూ,  నేను మానసికంగా, శారీరకంగా బలహీన పడుచున్నానే కానీ, ధృఢంగా కాలేక పోవుచున్నాను. వ్యాయమశాల నిర్యాహకుడు నాతో " అసలు నీ సమస్య ఏమిటి? ఎందుకు దినదినానికి  బలహీనపడుచున్నావు? నీవు ఏ ఆహారము తీసికొనుచున్నావు?" అని విచారించినాడు. నేను అతనికి అసలు విషయమేమి చెప్పలేదు. ఇలా కొద్ది రోజులు జరిగిన తరువాత, వెంటనే బయలుదేరి ఇంటికి రమ్మని, మా నాన్న ఉత్తరం వ్రాసినాడు. అందులో మా చెల్లెలి పెళ్ళి నిశ్చయమయిందని, ఉన్న ఫలాన ఇంటికి రమ్మని వ్రాసినాడు. నేను వెంటనే బయలుదేరి ఊరికి పోయినాను. కుటుంబ సభ్యులెవ్వరు సంతోషంగా లేరు. కానీ,   మా నాన్న ఈ మానసిక క్షోభలన్నింటికి అతీతుడేమొ అనిపించింది. తను ఏ దాని గురించీ ఎక్కువగా

ఆలోచించదు. నడిరేయి నిద్రలో కూడా అప్రమత్తంగా ఉంటాడు. కనుకనే, ఈ సమస్యలన్నింటినీ ఒక్కడే ఎదుర్కొంటున్నాడు. కాని ఆయనకు లౌక్యము తక్కువ, పట్టు విడువులు పాటించదు, మొండిగా వ్యవహరిస్తాడు. ఈ సమస్యల మధ్య నా చెల్లి పెళ్ళి ఏర్పాట్లు జరిగిపోవుచున్నాయి. నాకు అదుపు తప్పిన ఆలోచనలు ఎక్కువై, మానసిక వేదన ననుభవిస్తూ వున్నాను.

మా నాన్న మొండితనము వల్ల, సమస్య మరింత జటిలమై అది చివరకు గ్రామ కక్షలుగా రూపు దిద్దుకుంది. కానీ, మా నాన్నకు గ్రామ కక్షల మీద పూర్తి వ్యతిరేకతవుంది. ఆయన ఎన్నటికీ గ్రామకక్షలను సమర్థించదు. ఎందుకంటే, రాయలసీమ జిల్లాల్లో, ఈ గ్రామ కక్షల వల్లే అభివృద్ధి కుంటుపడి, అనేక సమస్యలకు, అ శాంతికి మూల కారణమని చాలా మంది భావన. ఈ గ్రామాల్లో ప్రశాంతత అనేది వుండదు. మనుషుల ప్రాణాలకు ఎటువంటి రక్షణ వుండదు. శతృవును చంపుటే వారి లక్ష్యము. ఈ సంఘటనలన్ని సినిమాల్లో చూచుటకు, చాలా ఉద్వేగభరితంగా వుంటాయి. కాని, నిజ జీవితంలో, వీటి బారిన పడిన ప్రజలకు, నరకమంటే ఏమిటో ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఊరిలో ఒకరు హత్యగావింపబడినచో, వారి కుటుంబ సభ్యులు, వారి బందువులు తీవ్రమైన మానసిక క్షోభకు గురై అవమాన భారంతో కృంగిపోతారు. దానితో, బాధితులలో ప్రతీకారేచ్ఛ రగులుతుంది. ఇరువర్గాలు కోర్టుల చుట్టూ తిరుగుచూ, కష్టపడి సంపాదించిన డబ్బంతా మంచినీళ్లలా ఖర్చుచేస్తారు. ఈ ప్రాంతములో పనిచేసే పోలీసులు వీరిని నిర్దాక్షిణ్యంగా అణచివేస్తారు. గ్రామ కక్షలంటే సినిమాల్లో చూపినట్లు ఉద్వేగభరితంగా వుండవు. అది ఒక చావు బ్రతుకుల పైశాచిక క్రీడ . మా నాన్నకు ఇవన్ని బాగా తెలుసు. అందుకే, ఆయన గ్రామ కక్షలను ప్రోత్సహించలేదు. కాని, ఇతను తన ఇంటిలోని సమస్యను తొందరగా పరిష్కరించక నాన్చి పెట్టినాడు. అందుకు ఫలితం నేను అనుభవించవలసివచ్చింది.

నా చెల్లి పెళ్ళి ఎటువంటి సంతోషము లేకుండా జరిగి పోయింది. తర్వాత, కుటుంబ కలహాల పర్యవసానంగా నా తమ్ముడు, మా నాన్న నేనూ, తనపై హత్యాప్రయత్నము చేసినట్లు కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేసినాడు. ఆ సమయంలో నేను మా అక్క డా॥ శిరీష ఇంట్లో వున్నాను. ఈ వార్త నాకు చేరవేసిన వారు, నన్ను వెంటనే ఇల్లు వదిలి ఏదైన రహస్య ప్రదేశానికి పోయి దాగుకొని వుండమని, లేనిచో పోలీసులు ఆరెస్టు చేసి వేధించెదరని చెప్పారు. అంత వరకు అదుపులోనే వున్నట్లు కనిపించిన నా విపరీతమై ఆలోచనలు ఒక్క సారి అదుపు తప్పి, అవాస్తవమైన ఆలోచనలన్ని నిజమని పూర్తిగా నమ్మినాను. నా ఆలోచనలన్ని ఇతరులు చదవగలుగుచున్నారని, అందువలన నేను మంచి ఆలోచనలే చేయుటకు ప్రయత్నించుచూ నా ఆలోచనలను నియంత్రించుకొను ప్రయత్నములో, విపరీతమైన మానసిక వేదనకు గురైనాను.

## మూడవ భాగము

ఇంతవరకు నాకు 'స్కిజోఫ్రీనియా' అనే తీవ్రమైన మానసిక వ్యాధి యొక్క లక్షణములు మాత్రమే కన్పించినవి. నాకు డెల్యుసన్స్ ప్రారంభమైనవి. డెల్యుసన్స్ అంటే విపరీతమైన, అవాస్తవమైన ఆలోచనలు చేస్తూ అవి నిజమని నమ్ముట. ఇంతవరకు విపరీతమైన ఆలోచనలు చేయుచుంటినే కాని, అవి నిజమని పూర్తిగా నమ్మలేదు. కాని, ఇప్పుడవి నిజమని పూర్తిగా నమ్ముచున్నాను. అంటే, ఇప్పుడు నేను పూర్తిగా స్కిజోఫ్రినియా అనే వ్యాధి బారిన పడ్డాను. హత్యా ప్రయత్నమనే నేరము నా మీద మోపి నందున, పోలీసుల నుండి తప్పించుకొనుటకు ఒక రహస్య ప్రదేశమునకు బయలుదేరినాను. నేను బస్సు ప్రయాణం చేసి కలకడ అనే ఊరిలో దిగి తర్వాత అక్కడకు 7 కిలోమీటర్ల దూరంలో ఉండే ఎర్రకోటపల్లె అనే చిన్న గ్రామమునకు చేరుకున్నాను. అక్కడ మంచి పలుకుబడి కలిగి, మంచి ఆస్తిపరులు అయిన దూరపు బంధువు ఒకరు నివసిస్తున్నారు. నాకు వారితో పరిచయం తక్కువే అయినప్పటికి, వారు నన్ను సగౌరవంగా ఆహ్వానించి క్షేమ సమాచారమును అడిగినారు. నేను విపరీతమైన ఆలోచనల గురించి తప్ప మిగిలిన వివరాలన్ని తెల్పినాను. నా మీద అన్యాయంగా కేసు  పెట్టినారని, పోలీసుల నుండి తప్పించుకొనుటకు కొంత కాలం అక్కడ రహస్యంగా ఉండుటకు వచ్చి నానని వారికి తెల్పినాను. వారు, వారి ఇంటి యందు కొంతకాలం రక్షణ తీసుకొనుటకు సంతోషంగా అంగీకరించినారు. వారి ఇళ్ళు బాగా కట్టబడి ఉంది. ఇంటిలో కారు, ఫ్రిజ్, టెలిఫోన్, గ్యాస్‌స్టవ్ మంచి రేడియో, మంచి టేప్‌రికార్డర్ మొదలగు అనేక సదుపాయములు ఉన్నవి.  పశువుల కొరకు ప్రత్యేకముగా పశు వుల శాల ఉన్నది. చాలా మంది నౌకర్లు , సేద్యము చేయుటకు ట్రాక్టరు ఉన్నవి. ఇప్పటికి 40 సంవత్సరముల పూర్వము గ్రామాలలో సాధారణంగా ఇన్ని  వసతులున్న కుటుంబములు చాలా అరుదుగా కన్పించేవి. దీనిని బట్టి వీరు బాగా ధనవంతులనియు మంచి నాగరికత తెలిసిన వారనియు ఇట్లే తెలియుచున్నది.

నా ఆలోచనల గురించి ఇంతవరకు ఎవరికి ఏమి చెప్పలేదు. కాని, నా మీద క్రిమినల్ కేసు నన్ను దూరంగా ఉన్న ఈ ఊరికి పంపుట. అన్ని ఒక ప్లాన్ ప్రకారమే జరుగుచున్నాయని,  ప్రపంచంలోని శాస్త్రవేత్తలంతా నా మీద ప్రయోగములు  మొదలు పెట్టినారని,  నా ఆలోచలన్ని వారు గ్రహిస్తున్నారని, నేను మనసులో ఏం మాట్లాడినా ఆ మాటలు ప్రపంచ వ్యాప్తంగా రేడియోల్లో ప్రసారం అవుచున్నాయని, నేను ఏ దృశ్యము అయినను మనసులో ఊహించిన యెడల, అది టి.వి.ల ద్వారా అందరికి కనుపడచున్నదని నమ్మి, నా ఆలోచనలు నియంత్రించుకొను ప్రయత్నములో విపరీతమైన మానసిక వేదనకు గురి అవుచున్నాను. ఒక క్షణం కూడా ప్రశాంతంగా ఉండలేక పోవుచున్నాను. మరుక్షణమే నేను ప్రపంచం అందరిలో ముఖ్యమైన వ్యక్తిగా అందరూ నన్ను గురించే మాట్లాడు కొంటున్నట్లు భావించి, ఊహాతీతమైన ఆనందాన్ని పొందేవాన్ని. వెంటనే నా మాటలు, నా దృశ్యపు ఆలోచనలు నీచంగా ఉండుట వలన, అందరూ నన్ను తిడుతున్నట్లు భావించి, విపరీతమైన మానసిక వేదనను అనుభవించుచూ, ఈ సమస్య నుండి ఎలా బయట పడవలెనో తెలియక, ఎప్పుడూ దైవ  ధ్యానం చేయుచూ ఒక్క క్షణము కూడా  ప్రశాంతత లేక బాధపడుచుంటిని. ఇంతలో సాయంత్రం అయినది. నేను మా బంధువులతో కలసి చల్లగాలి కొరకు మేడ పైకి చేరుకున్నాను. మేడపై వరండాలో కుర్చీలు వేసుకొని అందరము కూర్చొన్నాము. అటు ప్రక్కన ఏపుగా పెరిగిన చింత చెట్టు ఒకటి ఉన్నది. సాయంత్రమైనందున కాకులన్ని చెట్టును చేరుకొని, చెట్టు చుట్టూ విపరీతమైన గోల చేయుచున్నవి. మా బంధువులు ఎవ్వరూ ఈ విషయం పట్టించుకొనలేదు. నేనేమో ఈ కాకులన్ని నాకు ఏదో సందేశం

ఇస్తున్నాయి, అవి నన్ను ఈ భయంకర పరిస్థితుల నుండి బయట పడవేయుటకు ప్రయత్నిస్తున్నాయని నమ్మి ప్రహరీ గోడ దగ్గరగా వెళ్ళి కాకులనే గమనిస్తున్నాను. ఇంతలో మా బంధువులలో ఒకరు.

"సూర్యా! ఏమిటి దిగులుగా ఉన్నావు? రా, ఇక్కడ కూర్చో," అని పిలిచినారు. అప్పుడు నేను నా ఆలోచనలన్ని వారికి చెప్పే ప్రయత్నం చేసినాను. కాని వారు నేను మా ఊరిలో నిజంగానే నేరముచేసి, దానిని కప్పి పుచ్చుటకు ఇలా ప్రవర్తిస్తున్నానేమో అని అనుకొన్నారు. ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. మరుసటి దినము కూడా నా ఈ విపరీతమైన ఆలోచనల వల్ల వేదనతో అక్కడ అన్ని సౌకర్యములు ఉన్నా తిండి కూడా సహించక బాధపడినాను. మా బంధువులు చాలా మంచివారు. నా ఈ విపరీతమైన ప్రవర్తనకు, వారు, పిన్న వయుస్కుడు, కాని అప్పుడే కక్షలు, కేసులు అన్ని వచ్చినవి, అందువలన కొంత ఆందోళనగా ఉన్నాడు, అని మాత్రమే భావించి నారు. అంతే కాని, నేనొక భయంకరమైన మానసిక వ్యాధితో బాధపడుచున్నానని గ్రహించలేకపోయినారు. నన్ను హుషారుగా ఉంచుటకు వారు తోటల దగ్గరికి, పొలం వద్దకు తోడుకొని వెళ్ళారు. అక్కడ పనిచేయుచున్న కొందరు గ్రామస్తులు, ఒకరినొకరు మొరటు భాషలో తిట్టుకొనుట చూసి, వారు నన్నే తిట్టుచున్నారని భ్రాంతి చెందేవాన్ని. నేను మా ఊరిలోని మా కుటుంబ సమస్యలు, కేసులు అన్ని మరచిపోయి నరకము కన్నా భయంకరమైన వేరొక లోకము లోనికి పోయినాను. క్రమంగా తిండి తినుట, స్నానము చేయుట, శుభ్రముగా ఉండుట, తలదువ్వుకొనుట అన్ని గాడి తప్పినవి. రోజు చేయు కాలకృత్యములు కూడా సరిగా నిర్వహించక, బట్టలు కూడా సరిగా శుభ్రముగా వేసుకొనక ఎప్పుడూ విపరీతమైన ఆలోచనలు చేయుచూ, తీవ్రమైన మానసిక వేదనతో బాధపడుచూ ఉంటిని.

నేను అప్పుడు స్కిజోఫ్రినియా అనే తీవ్రమైన మానసిక వ్యాధిగ్రస్తున్ని అయిపోయాను. ప్రపంచ జనాభాలో ఒక శాతం మంది ఈ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. నేడు భారతదేశంలో దాదాపు ఒక కోటి మంది ఈ వ్యాధితో దుర్భరమైన జీవితం గడుపుచున్నారు. ఆందులో 90 శాతం మందికి సరైన వైద్యము దొరుకుటలేదు. ముఖ్యముగా ఈ వ్యాధిపై సరిఅయిన అవగాహన లేకపోవుట,పేదరికము, నిరక్షరాస్యత, ప్రభుత్వ సహాయం కొరవడుట, వీటి వలన చాలా మంది ఏ వైద్యము లేక, నరకముకంటే హేయమైన జీవితమును గడిపి తనువు చాలిస్తున్నారు. భారత దేశమునకు అంతటికి నేడు మానసిక వ్యాధికి చికిత్స చేయు ప్రభుత్వ వైద్యశాలలు 50 కంటే తక్కువే ఉన్నాయి. కేవలం ఐదు వేల మంది కంటే తక్కువ మానసిక వ్యాధి నిపుణులున్నారు. దేశంలోని కోటి మంది వ్యాధిగ్రస్తులకు చికిత్స చేయవలెనన్న ఈ ఆసుపత్రులు, మానసిక వ్యాధి నిపుణుల సంఖ్య గణనీయంగా పెరగవలెను. మేధావులైన విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, డాక్టర్లు, లాయర్లు, పోలీసులు, వీరిపట్ల సానుకూలంగా స్పందించి, సానుభూతితో వారికి వైద్యము, కూడు, గుడ్డ, ఆశ్రయము కల్పించి, వారిని రక్షించుటకు కృషి చేయవలెను.

కొంత కాలము నేను ఎర్రకోటపల్లె లోనే గడిపి, ఆ తర్వాత నా పుస్తకములు, బట్టలు, ఇతర వస్తువులు అక్కడే వదలి మా బంధువు లెవ్వరికి చెప్పకుండా అక్కడి నుండి బయలుదేరి వాయల్పాడుకు చేరుకున్నాను. అక్కడ బాబూరెడ్డి అను ముఖ్యమైన బందువు ఇంట్లో ఉన్నాను. ఊపిరి తీసికొనుట మాని ఎలా వుండలేమో, అలాగే మెలకువగా ఉన్నపుడు ఆలోచించకుండా ఉండలేము కాదా! అందువలన, క్షణక్షణము విపరీతమైన ఆలోచనతో మంచి దృశ్యములు ఊహించుటకు బలవంతముగా ప్రయత్నించుచున్నాను. ఎప్పుడయితే మంచి ఆలోచనలే చేయవలెనని, మంచి మాటలే మాట్లాడవలెనని, మంచి దృశ్యములే ఊహించవలెనని

ప్రయత్నము చేయుదమో అప్పుడు మనకు తెలియకుండానే మన మనసు ఎదురు తిరిగి, చెడు ఆలోచనలు చేయుటకు, చెడు మాటలు మాట్లాడుటకు, చెడు దృశ్యములు ఊహించుటకు మానసికంగా ప్రేరేపితులమవుతాము. కనుక మంచి చెడులతో కూడిన ఈ సంఘర్షణ చాలా భయంకరంగా ఉంటుంది. అదియే నరకమనవచ్చును. ఈ విధంగా ఆలోచించి ఆలోచించి నా మెదుడు మొద్దుబారింది. ఏ దేవుడైనా ప్రత్యక్షమై నన్ను ఈ వేదననుండి బయట పడవేస్తాడేమోనని, నా మనోఫలకముపై దేవతలనే ఊహించుటకు ప్రయత్నించుచుంటిని.

ఒక రోజు రాత్రి, నేనూ బాబూ ఒక రూములో నిద్రకు ఉపక్రమించితిమి. బాబూ కొంతసేపటికే నిద్రలోకి జారుకున్నాడు. నాకు నిద్ర ఎలా పడుతుందీ? ఎప్పటిలాగే విపరీతమయిన ఆలోచనలతో మేలుకొనే వుంటిని. అప్పుడు సమయము మధ్య రాత్రి ఒంటి గంట అయినది. నాకు ఈ విషమపరిస్థితుల నుండి బయట పడుటకు చావు తప్ప వేరే మార్గము కనిపించలేదు. కానీ, వెంటనే ఆత్మహత్య చేసుకొనే ప్రయత్నము ఏదీ చేయలేదు, అయితే ఆత్మహత్య చేసుకొనవలెననే ఆలోచన వచ్చింది. నేను వెంటనే బాబూరెడ్డిని నిద్ర లేపి విపరీతముగా ఏడ్చి,

"నాకు చనిపోవాలని వున్నది, ప్రపంచమంతా నన్ను ద్వేషిస్తుంటే నేనింకెందుకు బ్రతకాలి," అని ఆక్రోశించాను.

నా ఈ విపరీత మైన ప్రవర్తన చూసి బాబు కలవరపడ్డాడు. నన్ను సముదాయించుటకు ప్రయత్నించాడు. తరువాత, నాకు స్వాంతన చేకూర్చుటకు అనుభవగ్నురాలైన తన అక్కగారింటికి తీసుకొని వెళ్ళాడు. ప్రక్క వీధిలోనే ఉన్న వారింటి వద్దకు వెళ్ళి తలుపు తట్టినాము. వారందరూ గాఢనిద్రలో ఉన్నందున బదులు పలుక లేదు. నేనేమో, వారు కూడా నన్ను ద్వేషించుచున్నందు వలన, నన్ను చూచుటకు ఇష్టపడక తలుపు తీయలేదని భావించి కృంగిపోయాను. తరువాత, బాబూ తన పెదనాన్న కొడుకైన రఘు ఇంటికి పిలుచుకొనిపోయాడు. ఆ రోజు రఘు ఇంటిలో లేడు. రఘు తమ్ముడు మేఘ ఇంటిలో మేడపైన నిద్రించుచూ వుండినాడు. మా పిలుపు విని క్రిందికి దిగి వచ్చి, మమ్ములను తన రూము లోనికి ఆహ్వానించాడు. మేఘ, నేను మదనపల్లెలో చదువుచున్నపుడు నా సహ విద్యార్థి. బాబూరెడ్డి, మేఘతో నా సమస్యలను గురించి క్లుప్తముగా చెప్పి, ఇప్పుడు ఏమి చేయవలెనని అతని సలహా అడిగాడు. మేఘ ఇంకేమి మాట్లడకుండా అలమరా తెరచి, ఆందులో నుండి ఒక రూపాయి నాణెమంతటి రాగి నాణెము బయటకు తీసినాడు. దానిపై కొన్ని అక్షరములు రాసి, కొన్ని గీతలు గీసి వున్నాయి. మేఘ, దానిని నా నుదిటి మీద తన కుడి చేతి బోటన వ్రేలితో అదిమి పట్టి, ఒక మంత్రము మనకు సరిగ్గా వినపడకుండా గొనిగినాడు. తరువాత దానిని తన చేతిలోనికి తీసికొని,

"సూర్యా! నిన్ను ఆవహించిన దుష్టశక్తి ఈ నాణెము లోనికి వచ్చినది. నేను దీనిని బంధించినాను. ఇంక నీకేమి భయము లేదు, పడుకొని బాగా నిద్రపో," అని చెప్పి నాకు బెడ్ సరిచేసినాడు. బాబూ మా వద్ద సెలవు తీసికొని ఇంటికి వెళ్ళి పోయాడు. చాలా రోజుల తరువాత ఆ మిగిలిన రాత్రి గాఢంగా నిద్రపోయాను.

తిరిగి సూర్యోదయమయిన తరువాత నిదురలేచాను. నాకు వెంటనే మేఘ ఒక కప్పు కాఫీ ఇచ్చాడు. కాఫీ త్రాగి నిజంగానే నేను ఈ బాధల నుండి బయట పడినానా? లేదా? అను అనుమానము వచ్చింది. మళ్ళీ మునుపటి పరిస్థితులే వస్తాయేమోనని భయము కలిగింది. వెంటనే మేడపైన ఉండే వరండాలోనికి వెళ్ళాను. స్థానికంగా ఉండే బస్టాండు మేఘ ఇంటి ముందే ఉంది. అక్కడ కొన్ని చిల్లర అంగళ్ళు ఉన్నాయి. ఒకటి రెండు బస్సులు నిలిచి ఉన్నాయి. కొంత మంది గుంపులు, గుంపులుగా చేరి గట్టిగా మాట్లాడుకుంటున్నారు.

వారంతా నన్ను గమనిస్తున్నట్లు భావించి, వారి మాటలు వినుటకు ప్రయత్నించాను. కానీ వారి మాటలు సరిగ్గా వినిపించలేదు. కొన్ని పదాలు మాత్రమే వినిపిస్తున్నాయి. వీరిలో కొందరు, ఒకరినొకరు పరుష పదజాలముతో తిట్టుకొనుచున్నారు. నేను వారంతా నన్నే తిట్టుచున్నారని పూర్తిగా నమ్మి, నా పరిస్థితి ఏమీ మారనట్లు గ్రహించాను. ఇంతలో, కొన్ని కాకులు నాపై ఎగురుతూ కనిపించాయి. ఊరిలోని వారంతా నన్ను ద్వేషిస్తూ, నన్ను వెంటనే వారి ఊరు విడిచిపొమ్మని తిట్టుచున్నారని భావించాను. కాకులు నాకు సహాయము చేయటుకు ప్రయత్నిస్తున్నాయని నమ్మి, వెంటనే మేడపై నుండి క్రిందికి వచ్చి, అక్కడ నిలచియున్న ఒక బస్సు ఎక్కి కుర్చున్నాను. అది వెంటనే బయలుదేరింది. కండక్టరుతో, ఈ బస్సు ఎక్కడికి వెళుతుందని అడిగాను. అతను, రాయచోటికి వెళుతుందని చెప్పగా, అక్కడికి ఒక టికెట్ తీసుకున్నాను. నేను బాబురెడ్డి దగ్గర కొంత డబ్బు తీసుకున్నందున నా ఖర్చులకు డబ్బు ఇబ్బంది రాలేదు. ఆ ప్రయాణంలో నా మనోవేదన ఎలా ఉందో నాకు ఇప్పుడు కొంచెము కూడా జ్ఞాపకము లేదు.

రాయచోటిలో దిగిన వెంటనే, నాకు దగ్గరి బంధువు, వరుసకు అక్క అయిన ఒక డాక్టరు గారింటికి వెళ్ళాను. అక్కడ ఆమె ప్రభుత్వ డాక్టరుగా పనిచేస్తూ ఉండేది. ఆమె నన్ను సాదరంగా లోనికి ఆహ్వానించి, “ఏమి సూర్యా! కొంచెము దిగులుగా ఉన్నట్లున్నావే,” అని అడిగింది. అప్పుడు నేను ఆమె వద్ద ఏడ్చి, నేను అనుభవిస్తున్న మనోవేదన గురించి చెప్పినాను. ఆమెకు నా పరిస్థితి అర్థమయింది, కాని, ఆమె అప్పటికప్పుడు నాకు ఏ సహాయము చేయలేక పోయింది. అయితే ఆమె,

“సూర్యా! నీవు ఈ రూములో పడుకొని విశ్రాంతి తీసికో, తరువాత ఆయా భోజనము వడ్డిస్తుంది. నేను హాస్పిటల్‌లో డ్యూటీ అయిపోయిన తరువాత, త్వరగానే వస్తాను. నీకు ఈ ఇంట్లో ఏ భయము లేదు, కనుక ఇక్కడే ఉండు” అని,

ఆయాకు నన్ను జాగ్రత్తగా చూసుకొమ్మని చెప్పి వెళ్ళిపోయింది. ఎందుకో ఆమె నాతో మాట్లాడిన పద్ధతి నాకు నచ్చక, ఈమె కూడా నన్ను ద్వేషిస్తున్నదని తలచి, ఆమె బయటకు వెళ్ళిన కొద్ది సేపటికే అక్కడి నుండి బయలుదేరి వచ్చాను. ఆయా నన్ను వెళ్ళిపోకుండా నిలువరించవలెనని ప్రయత్నించినది కాని, నేను అందుకు ఇష్టపడలేదు. అంతా కలసి నా మీద ప్రయోగములు చేయుచున్నారని భావించాను. నేరుగా బస్టాండుకు వెళ్ళి అక్కడ వెంటనే బయలుదేరుచున్న ఒక బస్సు ఎక్కి కిటికీ వద్ద ఉన్న సీటులో కుర్చున్నాను. ఆ బస్సు రైల్వేకోడురు పోవుచున్నది. రైల్వేకోడూరు అక్కడికి దాదాపు 100 కి.మీ దూరంలో ఉన్నది. కొద్ది దూరము ప్రయాణించిన తరువాత, బస్సు వెంట కొన్ని కాకులు ఎగురుచూ కనిపించాయి. బహుశా, అవి నేను సరియైన మార్గములోనే ప్రయాణిస్తున్నానని సందేశమిస్తున్నాయని అనుకున్నాను. అవి కొద్ది దూరము బస్సు వెంట అలాగే ప్రయాణము చేసి తరువాత కనపడకుండా వెళ్ళిపోయాయి.

ఎప్పటి వలెనే నా విపరీతమయిన ఆలోచనలతో స్థిమితంగా ఉండలేక మానసిక వేదనను అనుభవిస్తూ వున్నాను. ఉన్నట్టుండి ఒక పసిపాప పెద్దగా ఏడ్వడం మొదలు పెట్టింది. ఆ పాప తల్లి, ఆ బిడ్డను సముదాయించుటకు అన్ని విధాలా ప్రయత్నిస్తూ ఉన్నది. కానీ ఆ పాప కొంచెము కూడా ఏడుపు తగ్గించలేదు. ఏడ్చి ఏడ్చి, ఆ బిడ్డ అలసి పోవుచున్నది. నాకేమో, ఆపాప నేను చేయు ఆలోచనల వలన ఏడ్చుచున్నదని భావించి, ఆ పాప నా ఆలోచనలన్నీ గ్రహించి, నేను అందరి గురించి చెడుగా మాట్లాడుట వలన, అశ్లీలమైన దృశ్యములు ఊహించుటవలన, అలా ఏడ్చుచున్నదని నమ్మి, అన్ని మంచి మాటలే మాట్లాడవలెనని, అన్నీ

మంచి దృశ్యములేఊహించవలెనని నా మనసును అదుపు చేసికొనుటకు ప్రయత్నించాను. కానీ నేను మంచి మాటలు మాట్లాడటకు ప్రయత్నించిన కొలది, నా మనసులోనికి చెడు మాటలే వచ్చుచున్నవి. మంచి దృశ్యములు ఊహించవలెనన్న కొలది, చెడు దృశ్యములే నా మనోఫలకము పై కదలాడుచున్నవి. ఏ ఆలోచనలైతే నేను చేయకూడదను కున్నానో ఆ ఆలోచనలే చేయునట్లు నా మనసు పురికొల్పబడుచున్నది. ఈ మంచి చెడుల సంఘర్షణలో నేను భయంకరమైన మనోవేదనను ఆనుభవించినాను. నాకైతే ఈ బాధను వర్ణించుటకు మాటలు దొరుకకున్నవి. శత్రువుకు కూడా ఇటువంటి వేదన వద్దని భావించాను. దూరముగా కూర్చున్న కొందరు ప్రయాణికులు, గట్టిగా పరుషమైన పదజాలముతో ఏదో ఎవరి గురించో మాట్లడుకొనుచున్నారు. నాకు వారి మాటలు సరిగ్గా వినిపించలేదు. కొన్ని వినపడి కొన్ని వినపడకున్నవి. వారు నన్నే పరుషపదజాలములో ద్వేషించుచున్నారని భావించి, ఈ విషవలయము నుండి ఎలా బయట పడవలెనని ఆలోచిస్తూ, భయంకరమైన మానసిక వేదనను ఆనుభవించితిని.

ఎలాగయితే నేమి, నేను రైల్వే కోడూరు చేరుకున్నాను. అక్కడ వరుసకు మామయైన దగ్గరి బంధువు ఒకరు ఉండేవారు. ఆయన పేరు వెంకటరెడ్డి, గనుల యజమాని, ఆ వూరులో మంచి పేరున్న వ్యక్తి కనుక, అతని ఇల్లు సులభముగానే కనుగొన్నాను. నేను ఆ సాయంత్రము చీకటి పడుచుండగా వారిళ్ళు చేరాను. నేను వెళ్ళేసరికి మా మామగారు ఇంట్లోనే ఉన్నారు. అతనికి మా ఊరిలో జరిగిన అన్ని విషయములు తెలుసును కనుక మా అమ్మ గురించి, మా నాన్న గురించి, వాకబు చేసినాడు. నేను వాటన్నిటికీ సరియైన సమాధానములు చెప్పకుండా బాగా ఏడ్చి, “నన్ను కాకులు వెంట పడుచున్నాయి, అవి నేనెక్కడికి పోతే అక్కడికి వస్తున్నాయి, ఆందరూ నన్ను ద్వేషిస్తున్నారు, నన్నేట్లయినా ఈ వేదననుండి కాపాడు” అని వేడుకున్నాను. ఆయన వెంటనే ఆసలు విషయము గ్రహించాడు. నేను మానసిక వ్యాధికి గురైనానని, ఆందుకు చికిత్స తప్ప మాటలతో బాగుపడదని గ్రహించి, ఆందుకు తగిన ఏర్పాట్లు చేయాలనుకున్నాడు. కానీ ఆయన ఆ రాత్రే తన వ్యాపార పనులు నిమిత్తం చెనై బయలుదేరి వెళ్ళాడు. పోయే ముందు తన వద్ద పనిచేయు వారందరికీ నన్ను జాగ్రత్తగా చూసుకొమ్మని, ఒకటి రెండు రోజులలో తాను తిరిగి వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. దురదృష్టవశాత్తు ఈ వ్యాధి గురించి అప్పటికి నాకెటువంటి అవగాహన లేదు.

బాధను అనుభవిస్తున్నా అందంతా నిజమేననే భ్రమలో ఉన్నాను. ఆంతేకాని, అది **స్కిజోఫ్రీనియా’** అనే మానసిక జబ్బు అని కానీ, దాని నుండి బయటపడుటకు చికిత్సే మార్గమనీ తెలియదు. ఇది ఒక తీవ్రమైన మానసిక వ్యాధి, చాలా కాలము దీనికి సరియైన చికిత్స లేదు. 60,70 సంవత్సరముల నుండి, దీనికి చికిత్స చేయుచున్నారు. అప్పట్లో ఈ వ్యాధికి అనుభవగ్నుడైన మానసిక వైద్యునిచే షాక్ ట్రీట్‌మెంట్ ఒక్కటే బాగా పనిచేస్తూ ఉండేది. కానీ ఈనాడు శాస్త్రజ్ఞులు ఈ వ్యాధికి చాలా మంచి మందులు తయారు చేస్తున్నారు. వీటి వలన ఎటువంటి దుష్పరిణామాలు ఉండవు. కానీ చికిత్సచేయడము ఆలస్యమయినచో చాలా మందికి ఈ మందులు జీవితాంతం వాడవలసి ఉండును. డాక్టరు సలహా లేకుండా మందులు వాడుట మానివేసినచో వెంటనే జబ్బు తిరుగబెట్టును. కనుక ఈ వ్యాధిగ్రస్తులెవరూ డాక్టరు సలహా లేకుండా ఒక్కరోజు కూడా మందులు వాడకుండా ఉండకూడదు. జబ్బు లక్షణములు తెలిసిన వెంటనే చికిత్స చేసిన యెడల, జీవితాంతం మందులు వాడవలసిన అవసరము లేకుండా ఉండవచ్చును. ఆందువలన వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే మానసిక వైద్యుని సంప్రదించవలెను. ఈ విషయములో ఎటువంటి మూఢ నమ్మకములకు

తావివ్వ కూడదు, ఇదోక మానసిక సమస్య, దీనికి నూటికి నూరుపాళ్ళు చికిత్స ఉన్నది. చికిత్స తీసుకున్న యెడల దాదాపు 90 శాతము ఆరోగ్యము కుదుట పడును.

అసలు, స్కిజోఫ్రీనియా అనే ఈ జబ్బు ఎలా వస్తుంది? ఎవరికి వస్తుంది? అనేది ఖచ్చితంగా చెప్పలేము. కానీ, ఈ ప్రపంచములోని ప్రజలందరికీ ఒక శాతము వచ్చుటకు ఆవకాశము ఉన్నది. వంశపారంపర్యంగా ఈ వ్యాధి ఉన్నవారందరికి 8 శాతము వచ్చుటకు ఆవకాశము ఉన్నది. కొన్ని పరిశోధనలు, ఈ వ్యాధి ముఖ్యముగా 18 స॥ లనుండి, 45 సం॥ మధ్య వయసు వారికే ఎక్కువ వస్తున్నట్లు తెలుపు చున్నవి. అలాగే పుట్టుకతోనే మెదడు నిర్మాణము సరిగ్గాలేని వారికి. కొన్ని మానసిక సంఘర్షణల వలన మెదడు లోని రసాయనములు సమతుల్యము కోల్పోవుట వలన కాని, కుటుంబ కలహములు, కుటుంబమునకు సంబంధించిన ఇతర బాధల వలన కానీ ఈ జబ్బు రావచ్చును. రక్త సంబంధీకులతో పెళ్ళిళ్ళు చేసికొనుట వలన కాని, కొన్ని రకములైన సుఖవ్యాధులకు లోనై, అందుకు సరియైన చికిత్స చేయించుకొనక పోయిననూ ఈ వ్యాధి రావచ్చును. ఈ విషయములపై నేను జబ్బుపడిన మొదట్లో నా కెటువంటి ఆవగాహన లేదు. అది కూడా నా వ్యాధి ముదిరిపోవుటకు ఒక కారణము.

మరుసటి రోజు తెల్లవారిన వెంటనే అందరూ తమ తమ పనులలో నిమగ్నమయి ఉన్నారు. నేను ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయట పడి, గమ్యము లేకుండా రోడ్డు వెంట నడచుకొంటూ పోవుచున్నాను. అప్పుడు నా మదిలో, ' ఇక్కడికి తిరుమల కేవలము 70 కి.మీ మాత్రమే కదా! నేను నేరుగా తిరుమలకు వెళ్ళి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే నా బాధలు తగ్గుతాయనే' భావన మెదలింది. వెంటనే వెంకటేశ్వర స్వామి నా మనోఫలకంపై సాక్షాత్కరించినాడు, ఆయన నన్ను తనకొండకు రమ్మని పిలిచినట్లు ఊహించుకున్నాను. ఇంకేమి ఆలోచించలేదు, వెంటనే అక్కడ బస్టాండుకు వెళ్ళకుండా రైల్వేస్టేషన్‌కు వెళ్ళాను. అక్కడ ఆ సమయంలో తిరుపతి వెళ్ళుటకు ఏదైనా రైలు ఉందేమోనని విచారించినాను. కాని, అక్కడున్న వారు, ఆ సమయంలో తిరుపతికి పోవుటకు రైలు ఏదీ లేదని చెప్పినారు. బహుశా, ప్రజలందరూ నన్ను తిరుపతికి నడిచిపోవలెనని కోరుచున్నారెమోనని భావించి, వెంటనే స్టేషన్ నుండి తిరుపతి వైపు వెళ్ళు రైలు పట్టాల ప్రక్కన ఉన్న కాలి దారిలో నడుచుకుంటూ బయలు దేరాను. కొద్ది దూరం పోయిన తర్వాత అక్కడ ఒక వాగు పై రైల్వే బ్రిడ్జ్ ఉంది. రైలు మార్గమునకు ఇరువైపుల ఏపుగా పెరిగిన మామిడి తోటలు ఉన్నాయి. దూరంగా పచ్చని కొండలు, కొండల చుట్టూ దట్టమైన అడవి కన్పిస్తున్నాయి.

కొన్ని కాకులు, నేను వెలుతున్న మార్గంలో నాపై ఎగురుతూ కన్పించాయి. అవి నా వద్దకు వచ్చిన తర్వాత, రైలు మార్గానికి కుడివైపున వాగువెంట గట్టిగా అరుచుకుంటూ వెళ్ళాయి. నాకు వెంటనే దూరంగా కన్పించే ఆ అడవి, ఆ కొండలూ దాటితే, తిరుమల కొండలు చేరుకొనవచ్చునని అనిపించింది. బహుశా, ఈ కాకులు నాకు తిరుమల వెళ్ళుటకు దగ్గర దారి చూపిస్తున్నాయేమోనని వెంటనే నా దారి మళ్ళించుకొని అవి ఎగురుతూ వెళుతున్న వైపు వాగు వెంట బయలు దేరాను. అవి కొద్ది దూరం అలానే వెళ్ళి, వాగు గట్టున ఉన్న మామిడి తోటలోకి ప్రవేశించి, అందులోని చెట్ల మీద వాలాయి. నేను కూడా తోటలోనికి వెళ్ళి, ఒక చెట్టు క్రింద వున్న నీడలో విశ్రమించాను. అప్పుడు, ఒక రామచిలుక నా దగ్గరగా ఉన్న చెట్టుపై మెల్లిగా అరచుకుటూ వెళ్ళి వాలింది. దానిని చూచిన వెంటనే, భగవంతుడు ఒక రామచిలుకతో నాకు సందేశం పంపినాడని బావించి, మోకాళ్ళపై మోకరిల్లి దానికి నమస్కారం చేసినాను. అది వెంటనే దానికి

అందుబాటులోనున్న ఒక చిగురుటాకును దాని ముక్కుతో త్రుంచి, క్రింద పడవేసింది. నేను దాని ప్రవర్తనను చూసి తన్మయుడనైపోయాను. భగవంతునికి ఇప్పటికి నాపై దయకలిగింది, అందుకే చిలుకతో నాకు ఒక చిగురుటాకు ప్రసాదించినాడని తలచి, ఆ ఆకును చేతి లోనికి తీసుకొని నమిలి మ్రింగినాను. నాకు వెంటనే నేను అనుభవించే ఈ బాధలన్నింటి నుంచి విముక్తి కలిగినదని భావించి, అక్కడే పడుకొని భక్తితో భగవంతుని ప్రార్థించినాను.

ఆ తోటలో కొద్దిదూరంలో కొంతమంది పనిచేసుకుంటున్నారు. అక్కడ కొన్ని చిన్న, చిన్న గుడిసెలు కూడా ఉన్నవి. నేను దేవుని గురించి ప్రార్థించునపుడు, చెట్లపైన ఉండే కాకులన్ని ఎగిరి వెళ్ళి, ఆ పని చేయుచున్న వారి మీద ఎగురుచూ విపరీతమైన గోల చేస్తున్నాయి. అప్పుడు వారు,

"ఎందుకు, ఈ కాకులు ఇలా అరుస్తున్నాయి? బహుశా, ఊరిలో ఎవరో ఒకరు ఈ రోజు తప్పక చస్తారు!!" అని గట్టిగా అరిచినారు. కొద్దిసేపటి తర్వాత వారిలో కొందరు నన్ను గమనించి, అక్కడ చెట్టు కింద ఎవరో కొత్త మనిషి ఉన్నాడు, అతనేవరో తెలుసుకొని రమ్మని, ఒక లావుగా ఉన్న వ్యక్తికి పురమాయించినారు. అతను వేగంగా నా వద్దకు వచ్చి " నీవెవరు? ఇక్కడ నీకు ఏంపని చెప్పు?"అని గద్దించినాడు. అతనికి నేను, " నేను తిరుమల కొండకు పోవుచున్నాను, ఈ కాకులు నన్ను ఇక్కడకు తోడ్కొని వచ్చినవి. అవి నాకు దగ్గరలో కన్పించే అడవి నుండి తిరుమల కొండకు దగ్గరి దారి చూపిస్తున్నాయి," అని చెప్పినాను. అతను వెంటనే నా పరిస్థితి గ్రహించి, "ఆ అడవి నుండి తిరుమలకు ఏ దారి లేదు, అక్కడ చిరుత పులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు ఇంకా అనేకమైన క్రూర జంతువులు ఉన్నాయి. ఆ వైపుకు వెళితే నీవు ప్రాణాలతో బయట పడలేవు" అని చెప్పి, తిరిగి కోడూరుకు వెనక్కి వెళ్ళి అక్కడ నుండి బస్సులో వెళ్ళమని చెప్పినాడు. నేను అందుకు తల ఊపి, "నేను అనేక కష్టములలో ఉన్నాను. ఒక రామ చిలుక ఈ చెట్టుపై నుండి ఒక చిగురుటాకును ప్రసాదించింది, అది తిన్న తర్వాత నా కష్టాలన్ని తొలగిపోయినవి" అని చెప్పాను. అప్పుడు అతను, "కావాలంటే ఈ చెట్టు ఆకులు ఇంకా కొన్ని కోసుకొనిపో, కాని ఇక్కడ నుండి వెంటనే వెళ్ళిపో," అని, ఆజ్ఞాపించినట్లు చెప్పినాడు. నేనందుకు 'సరే' అని చెప్పి, మరలా రైలు పట్టాల వద్దకు వచ్చి, తిరిగి వెనక్కు కోడూరు వెళ్ళుట ఇష్టం లేక, తిరుపతి వైపు పోవు రైలు మార్గం వెంట నడుచుకుంటూ పోయాను. బాగా ప్రొద్దెక్కింది, బాగా ఎండగా కూడా ఉంది, ఎక్కడా నీరు కూడా త్రాగలేదు, గొంతెండి పోవుచున్నది. కాని, నా మానసిక వేదన ముందు ఈ శారీరక సమస్యలు అంత కష్టంగా అనిపించలేదు.

అలా ఎంత దూరం నడిచానో తెలియదు కాని, రెండు గంటలు నడిచిన తర్వాత, "శెట్టిగుంట" అనే పేరు గల చిన్న రైల్వే స్టేషన్ కు చేరుకున్నాను. అక్కడ ఊరేది లేదు, బహుశా, స్టేషన్‌కు దగ్గరగా ఉన్న ఊరి పేరు పెట్టినట్లున్నారు. స్టేషన్‌లో స్టేషన్ మాస్టరు, కొందరు ఇతర పనులు చేయువారు తప్పఎక్కువగా జనసంచారం లేదు. చుట్టుప్రక్కల పచ్చటి చెట్లతో అడవి మధ్యలో ఉంది ఈ స్టేషను. నేను నేరుగా స్టేషన్ మాస్టరు వద్దకు వెళ్ళి,

"సార్! నేను కష్టములలో ఉన్నాను, రేణిగుంట వైపు వెళ్ళు రైలు ఇక్కడ నిలిపి, అందులో నన్ను రేణిగుంట వరకు పంపించండి" అని ప్రాధేయపడ్డాను. అందులకతను నన్ను జాలిగా చూసి, 'నీవు నిజమే మాట్లాడుచున్నావని అనిపిస్తూవుంది. నేను అటూగా వెళ్ళే గూడ్స్ రైలును నిలిపి, గార్డు వెంట అందులో

రేణిగుంట వరకు పంపుటకు ప్రయత్నిస్తాను. అంతవరకు నీవు స్టేషన్ ప్రక్కనే ఉన్న నా క్వార్టర్స్‌లో విశ్రాంతి తీసుకో," అని చెప్పి దాని తాళాలు ఇచ్చి పంపినాడు.

అతని ఇల్లు చాలా పరిశుభ్రంగా ఉంది. కొన్ని విలువైన వస్తువులు పొందికగా అమర్చి ఉన్నాయి. అతని ఇంటిని చూస్తే అతను మంచి అభిరుచి కలవాడని తెలుస్తుంది. కొద్దిసేపు అక్కడ ఉన్న బెడ్‌పై పడుకొని విశ్రాంతి తీసుకొనుటకు ప్రయత్నించినాను. కాని, నేను నా మానసిక వేదన నుండి బయట పడలేకపోతున్నాను. నేను కుదురుగా ఒక చోట ఉండలేక ఉన్నాను. కొద్దిసేపు శాస్త్రవేత్తలు అంతా నా మీద ప్రయోగం చేయుచున్నారు కదా! దాని గురించిన సమాచారం ఏదైన రేడియోలో చెప్పెదరేమోనని రేడియో ఆన్ చేసినాను. కొద్దిసేపటికే ఇంటి బయట ఎవరో దుర్భాషలాడుట వినిపించినది. నేను వెంటనే రేడియో ఆఫ్ చేసి, నేను రేడియో వినకూడదేమో అని అనుకున్నాను. ఇంక ఏ మాత్రమూ అక్కడ ఉండలేక పోయాను. వెంటనే ఇంటికి తాళం వేసి, స్టేషన్‌లోనికి వెళ్ళి, స్టేషన్ మాస్టరు ఉన్న రూమ్‌లోకి పోయాను. అక్కడ చాలా టెలిఫోన్‌లు మ్రోగుతూ ఉన్నాయి. బహుశా, అవి రైళ్ళ రాక పోకల గురించిన సమాచారం తెలుపుటకై ఉండవచ్చును. కాని నేను, ప్రభుత్వ అధికారులు నా గురించిన వివరములు, సేకరించుచున్నారనియు, నా పట్ల తీసుకొనవలసిన జాగ్రత్తలు స్టేషన్‌మాస్టర్‌కు తెలుపుచున్నారని భావించి కొంత కుదుట పడ్డాను. స్టేషన్ మాస్టర్ ఆ ఫోన్ సంభాషణలు అంతా అయిన తర్వాత,

"ఏమిటి? అంత తొందరగా ఇంటినుండి వచ్చినావు? " అని అడిగి మరలా అతనే,

"ఫరవాలేదు, ఇక్కడ నా తోటే కూర్చోని ఉండు," అని చెప్పినాడు. అప్పుడు నాకు బాగా ఆకలిగా ఉన్నట్లు గ్రహించినాను. వెంటనే నేను ఆయనతో,

"నాకు చాలా ఆకలిగా ఉన్నది," అని చెప్పినాను. అతను వెంటనే ప్రక్కనే వున్న అటెండర్‌తో, నీవు వెంటనేవెళ్ళి ఏదైనా ఆహారం తెమ్మని పురమాయించినాడు. నేను డబ్బులు ఇచ్చుటకు ప్రయత్నించగా, అతను వారించినాడు. తర్వాత కొద్దిసేపటికి ఆ అటెండర్ ఒక ప్లేటు ఇడ్లీలు, ఒక ప్లేటు దోశ తీసుకొని వచ్చినాడు. నేను ఇడ్లి ఒకటి, రెండు ముక్కలు తిన్నానో లేదో, బయట ఎవరో దూషిస్తున్నట్లు కేకలు వినిపించినాయి. నేను వెంటనే ఆ ఆహారం అంతా అలాగే వదిలిపెట్టి ఇంకేది ముట్టుకొలేదు. నేను ఆహారం తీసుకొనుట ఎవరికీ ఇష్టంలేదేమొ అని బాధపడినాను. అప్పుడు స్టేషన్ మాస్టర్,

"ఏమి? ఎందుకు ఆహారం తీసుకొనలేదు? అసలు నీ సమస్య ఏమిటి? ఎందులకు అంతగా బాధపడుచున్నావు?" అని అడిగినాడు. అందులకునేను,

" నీకు తెలియదా! నా సమస్య ఏమిటో!! ప్రపంచంలోని శాస్త్రవేత్తలంతా నామీద ప్రయోగములు చేస్తున్నారు!! నన్ను ఒక్క క్షణం కూడా ప్రశాంతంగా లేకుండా చేస్తున్నారు!!! అని ఏడ్చినాను. అతనికి నా అసలు సమస్య ఏమిటో అర్థమైనను అంత కంటే ఏమీ సహాయం చేయలేక, నన్ను శాంత పరచుటకు ప్రయత్నం చేసినాడు.

అలా కొన్ని గంటలు ఆ రైల్వేస్టేషన్‌లో గడిపిన తర్వాత ఒక గూడ్స్ రైలు వచ్చి అక్కడ ఆగింది. అప్పుడు స్టేషన్ మాస్టరు, ఒక అటెండర్‌ను తోడు ఇచ్చి రైలు వెనక భాగాన ఉండు గార్డ్ వద్దకు నన్ను పంపినాడు. నేను ఆయనకు చాలా కృతజ్ఞతలు తెలిపి, అక్కడ నుండి బయలు దేరాను. బాధలలో ఉండు తోటి పౌరుల పట్ల అతని బాధ్యత, అతని సేవాతత్పరత నా హృదయానికి హత్తుకొనిపోయినవి. ఇది జరిగి ఇప్పటికి

దాదాపు 40 సంవత్సరములు అయినా కూడా, నేటికీ అతను నా కళ్ళ ముందు కదలాడుచూనే ఉన్నాడు. రైలు రేణిగుంట చేరిన వెంటనే సిగ్నల్ వద్దనే బండి నిలిపి, గార్డ్ నన్ను క్రిందకు దించి వెళ్ళిపోయాడు. రేణిగుంట నుండి తిరుపతి 12 కిలోమీటర్లు మాత్రమే, బస్సు ఎక్కుట ఇష్టం లేక, అక్కడ నుండి తిరుపతికి రైలు పోవు మార్గం వెంటే, నడుచుకుంటూ బయలుదేరాను. రైలు మార్గం ప్రక్కనే, సమాంతరంగా బస్సులు వెళ్ళు రోడ్డు కూడా ఉన్నది. రోడ్డు మార్గం ప్రక్కన తిరుపతి నుండి రేణిగుంట వరకు అక్కడక్కడ కొన్ని పరిశ్రమలు, కొన్ని వ్యాపార సముదాయములు కలవు. నేను 3,4 కిలో మీటర్లు వెళ్ళిన తర్వాత రోడ్డు మార్గం, రైలు మార్గం చాలా దగ్గరగా ఇరుకుగా ఉంది. అక్కడ అప్పుడు ఒక మోపెడ్స్ ఫ్యాక్టరీ ఉండేది.

సమయం అప్పుడప్పుడే 5 గంటలు దాటినది. కొద్దిసేపటి క్రిందటనే మోపెడ్స్ ఫ్యాక్టరీలో సైరన్ మ్రోగుట వలన అందులో పనిచేయు ఉద్యోగులు అంతా చాలా మంది గేటు దాటి రోడ్డు మీదకు వచ్చినారు. ఇంతలో, ఆ గుంపు నుంచి ఎవరో నన్ను పిలిచిట్లు అనిపించి అటుగా చూసి నాను. నన్ను ఎవరూ పిలువలేదు,కాని వారిలో నారాయణరెడ్డి అనే స్నేహితుడిని గుర్తుపట్టినాను. వెంటనే అతన్ని పేరు పెట్టి గట్టిగా మూడు, నాలుగు సార్లు పిలిచినాను. అతను నన్ను చూసిన వెంటనే గుర్తించలేదు. నేను అప్పుడు గడ్డం పెంచి, మాసిన దుస్తులతో, తల కూడా దువ్వకొనక చాలా దీనంగా ఉన్నాను. కాని కొంతసేపటి తర్వాత నన్ను గుర్తించి, నా వైపు వచ్చి, నా పరిస్థితి చూసి ఆశ్చర్యపోయి అనేక ప్రశ్నలు వేసినాడు. కాని నేను వాటన్నింటికి జవాబు చెప్పక బాగా ఏడ్చినాను. అతను నన్ను ఓదార్చే ప్రయత్నం అయితే చేసినాడు కాని, నా పరిస్థితి ఎంటో అతనికి వెంటనే అర్థం కాలేదు. తర్వాత, తను ఈ ఫ్యాక్టరీలోనే ఉద్యోగం చేయుచున్నానని, ప్రక్కనే ఉన్న క్వార్టర్స్ లో నివసిస్తున్నానని చెప్పి తన ఇంటికి ఆహ్వానించాడు. కాని నేను ఇదంత ఒక పథకం ప్రకారమే జరుగుచున్నదని భావించి, అతని ఇంటికి వెళ్ళుటకు తిరస్కరించినాను. నేను వెంటనే తిరుమల కొండపైకి పోవలెనని చెప్పినాను. అందులకు అతను,

"నేను నిన్ను చక్రవర్తి వద్దకు పిలుచు కొని పోయి విడిచి పెట్టెదను," అని చెప్పినాడు. చక్రవర్తి నాకు చాలా ముఖ్యమైన మిత్రుడు కనుక, నేను వెంటనే అందులకు అంగీకరించినాను. చక్రవర్తి మోపెడ్స్ ఫ్యాక్టరీ ప్రక్కనే వున్న ఫ్లోర్ మిల్ యజమాని అని నారాయణరెడ్డి చెప్పినాడు. వీరు ఇరువురు నేను వెంకటగిరిలో చదువుతున్నపుడు నా సహాధ్యాయులు. ఇద్దరితో మంచి స్నేహమే ఉన్నది.అనుకోకుండా వీళ్ళిద్దరు తటస్థపడుట యాదృచ్ఛికమే అయినా, ఇది నా మీద జరుపు ప్రయోగములలో ఒక భాగమే అని నమ్మినాను. చక్రవర్తి నన్ను చూసి ఆనందంగా ఆహ్వానించి,

" ఏమిటి సూర్యా! నీవు అదోలా ఉన్నావే? ఏమిటి చెప్పు నీ సమస్య?" అని అడిగాడు. దానికి నేను నవ్వి "ఇందులో మీకు తెలియనిది ఏమున్నది, అందరూ నా మీద ప్రయోగాలు జరుపుచున్నారు," అని చెప్పి ఇంకేమి మాట్లాడకుండా కుర్చొన్నాను. నారాయణరెడ్డి నా వద్ద సెలవు తీసుకొని, చక్రవర్తితో ప్రక్కన ఏదో మాట్లాడి తన నివాసమునకు వెళ్ళిపోయాడు. నేను అడగకుండానే ఒక అటెండర్ నాకు బిస్కట్లు, కొంత మంచి ఆహారం తెచ్చి ఇచ్చినాడు. తర్వాత ఒక కప్పు కాఫీ కూడా ఇచ్చాడు. ఆరోజు అంత వరకు రెండు ముక్కలు ఇడ్లీ తప్ప ఇంకే ఆహారం తీసుకొనలేదు. కనుక నేను చాలా ఆకలితో బాగా బలహీనంగా ఉన్నాను. మారు మాట్లడకుండా వారిచ్చిన ఆహారం అంతా తిన్నాను.

చక్రవర్తి ఆఫీసు పనిముగించుకొని,

"రా, సూర్యా! నీకు ఫ్లోర్ మిల్ అంతా చూపిస్తాను," అని మిల్లు లోనికి పిలుచు కొని పోయాడు. అందులో చాలా పెద్ద యంత్రాలు ఉన్నాయి. చక్రవర్తి అవి ఎలా పని చేస్తాయో, గోధుమలను ఏ ఏ పదార్థాలుగా తయారు చేస్తారో, అన్ని చెప్పుచున్నాడు. అప్పుడు మిల్లు ఇంకా పనిచేస్తూనే ఉన్నది. చాలా మంది కార్మికులు వారి, వారి పనులలో నిమగ్నులై ఉన్నారు. ఉన్నట్లుండి విద్యుత్ పోవుట వలన, ఒక్కసారిగా యంత్రాలన్ని ఆగిపోయినవి. అంతవరకు యంత్రాల వల్లవచ్చు పెద్ద శబ్దము వినపడుచూ ఉన్నది. ఇప్పుడు ఆ శబ్దం వెంటనే ఆగింది. కనుక, అక్కడి కార్మికులు ఒకరితో ఒకరు మాట్లాడు శబ్దములు, మళ్ళీ నా ఆలోచనలను ప్రేరిపించసాగాయి, వారంతా నన్ను వెంటనే తిరుమలలో గుడికి వెళ్ళి అక్కడ దేవుని దర్శనం చేసుకొనవలెనని కోరుచున్నట్లు భావించి, ప్రక్కనే ఉన్న చక్రవర్తితో,

"నన్ను వెంటనే నీ కారులో తిరుమల తీసుకొని వెళ్ళు" అని ఆజ్ఞాపించినట్లుగా అడిగాను. అందుకు చక్రవర్తి,

"సూర్యా! కారు నా సొంత పనులకు ఉపయోగించకూడదు. అందుకు నా భాగస్తులు అనుమతించరు. నేను కేవలం ఆఫీసు పనులకు మాత్రమే ఈ కారును ఉపయోగిస్తాను," అని చెప్పాడు. అప్పుడు నేను,

"సరే వెంటనే నన్ను దగ్గరలో ఉన్న బస్‌స్టేషన్ వద్ద విడిచిపెట్టు, నేను బస్సులో కొండపైకి వెళ్తాను," అని చెప్పాను. దానికి చక్రవర్తి,

"ఇలా ఎలా వెళ్తావు! మొదట ఇంటికి పోయి స్నానం చేసి తర్వాత గుడికి వెళ్ళు," అని చెప్పాడు. అప్పుడు ఇరువురము మొదట ఒక షాపుకు వెళ్ళి తక్కువ ధరలో ఒక షర్ట్, ఒక ఫ్యాంట్ కొని తర్వాత చక్రవర్తి ఇంటికి పోయాము. వెంటనే స్నానము చేసి తరువాత కొండపైకి వెళ్ళుటకు సిద్ధమయ్యాను. అప్పుడు చక్రవర్తి,

"ఇప్పుడు చీకటి పడింది. ఈ రోజు ఇక్కడే ఉండి రేపు ఉదయము కొండ పైకి వెళ్ళు," అని బలవంతంచేసాడు. నేను అందుకు అంగీకరించక " వెంటనే వెళ్తాను," అని చెప్పినాను. "అలాగయితే సరే," అని చక్రవర్తి వెంటనే కొద్దిసేపు ఫోన్లో ఎవరితోనో మాట్లాడి, తరువాత,

"డ్రైవర్‌నిన్నుకొండపై కారులో దించి తిరిగి వస్తాడు. నీవు దేవుని దర్శనము చేసుకొనిన పిదప, టాక్సిలో కానీ బస్సులో కానీ ఇంటికి తిరిగి రా" అని చెప్పి డ్రైవరును పిలిచి,

"సూర్యాను కొండపై దించి నీవు వెంటనే తిరిగిరా."

అని నాకు కొంత డబ్బు ఇచ్చి, ఆ మొత్తమును తన పుస్తకములో నోట్ చేసికొని " సూర్యా! నేను ఈ డబ్బు నీతో తిరిగి తీసికొనుట మరచిపోనులే," అని చెప్పి, కొండపైకి పంపాడు.

కొండపైకి పోవుటకు, పూర్వము నుండి కాలి దారి కలదు. ఇది 14 కి.మీ. దూరము కలదు. కొంత మంది భక్తులు తమ మ్రొక్కు చెల్లించు కొనుటకు ఆ దారి వెంట నడుచుకుంటూ వెళ్తారు. రోడ్డు మార్గము కొండ కనుమల నుండి వేసినారు. ఇది 20 కి.మీ. దూరము వుంది. నేను కారులో ప్రయాణము చేయుచున్నప్పుడు మనసులో ఏ చెడు మాటలు మాట్లాడకుండా, చెడు దృశ్యములు ఊహించుకుండా, నన్ను నేను నియంత్రించు కొనుటకు దైవ ధ్యానము చేయుచు, ఆతని రూపమే నా మనోఫలకముపై నిలుపుకొని అతి కష్టము మీద కొండపైకి చేరినాను. డ్రైవర్ నన్ను కొండపైన దించి వెంటనే క్రిందకు వెళ్ళిపోయాడు.

నేను మొదట తల వెంట్రుకలు యిచ్చుటకు ' కల్యాణకట్ట' వద్దకు వెళ్ళాను. కానీ అప్పటికే బాగా చీకటి పడి నందున అది మూసియున్నది. కాని, దేవస్థానము వారు, నన్ను తల వెంట్రుకలుయివ్వకుండా నిలువరించుట కొరకే ' కల్యాణకట్ట' మూసి వేసినారని భావించినాను. అంతలో, ఒక అగంతకుడు నన్ను ప్రక్కకు పిలిచి "గుడి దగ్గరలోనే ఒక చోట తల వెంట్రుకలు తీయించి, అందులో నుండి కొన్ని వెంట్రుకలు తీసి, ఒక కవరులో పెట్టి, దేవుని హుండిలో వేసిన సరిపోతుంది. అవి కూడా దేవునికి సమర్పించినట్లే," అని చెప్పినాడు. నేనందులకు వెంటనే అంగీకరించి, ఇది కూడా నాకు పెట్టు పరీక్షలో ఒక భాగమే! అని తలచి, అతని వెంట వెళ్ళాను. గుడి ముందే ఒక షాపులో నా వెంట్రుకలు తీసి, అందులో నుండి కొన్ని వెంట్రుకలు ఒక చిన్న కవరులో పెట్టి నా చేతికిచ్చారు. ఈ పని చేసినదానికి వారు ఎక్కువ మొత్తమే తీసుకున్నారు. కాని, ఇందంతా నా మీద చేయు ప్రయోగములలో ఒక భాగమే అని నమ్మినాను.

ఈ విధంగా దేవుని దగ్గర కూడా ప్రశాంతత లేక బాధపడుచూ, మధ్య మధ్యలో అందరు నన్ను, నా మంచి తనానికి కీర్తిస్తున్నట్లు భావించి, అపూర్వమైన ఆనందాన్ని కూడా అనుభవించుచూ, దేవుని సేవించుట వలన కష్టాలన్ని తొలగిపోయి మాములు మనిషినైపోతాననే ఆశతో, అక్కడి సామూహిక స్నానశాలలో స్నానము చేసి, దైవ దర్శనము కొరకు క్యూలో నిలబడుటకు వెళ్ళాను. అక్కడ పనిచేయు దేవస్థానము ఉద్యోగులు " ఈ రోజు దర్శనమునకు సమయము మించిపోయినది. తిరిగి రేపు ఉదయముననే అందుకు అనుమతిస్తాము" అని చెప్పారు. వీరు కేవలము నన్ను గుడిలోనికి ప్రవేశించకుండా చేయుటకే ఇట్లు చేస్తున్నారని భావించి చాలా మదనపడ్డాను. వెంటనే నేను దైవ దర్శనము కూడా చేసికొన కుండా, గుడికి దూరంగా వెళ్ళాను. కొండపైన పవిత్ర ప్రదేశమైనా, అక్కడక్కడ నాకు చెడు తిట్లు వినిపించినవి. అవి కేవలము నన్ను ఉద్దేశించినవిగా భావించి చాలా బాధపడ్డాను. అప్పటికి రాత్రి చాలా ప్రొద్దుపోయింది కాబట్టి బస్ సర్వీసెస్ నిలిపి వేసినందువల్ల, ఒక ట్యాక్సి మాట్లాడుకొని అందులో క్రింది తిరుపతికి చేరుకున్నాను. క్రిందికి ప్రయాణము చేయునపుడు బాగా నిద్రపట్టింది. ఆర్ధరాత్రి దాటిన తర్వాత చక్రవర్తి ఇంటికి చేరుకున్నాను.

మరుసటి రోజు తెల్లవారగనే చక్రవర్తి తన ఫ్లోర్‌మిల్‌కు వెళ్ళి పోయాడు. నేను, చక్రవర్తి చిన్నాన్న, మాత్రమే ఇంటిలో ఉన్నాము. నేను నా ఆలోచనలతో సతమతం అవుతుండగా, ఆయన సిగరేట్ త్రాగుతూ కనిపించాడు. నేను చాలా కాలం నుండి సిగరేట్ త్రాగలేదు. నాకు, అతను నన్ను సిగరేట్ త్రాగమని ఏదో సందేశం ఇస్తున్నట్లు భావించి, అతని వయసును కూడా గమనించక, వెంటనే అతన్ని ఒక సిగరేట్ ఇమ్మని అడిగాను. అందుకు అతను చాలా సీరియస్‌గా నా వైపు చూసి, ఎందుకో ఎమో, ఏమి తిట్టకుండా సిగరేట్ ఇచ్చాడు. అది వెలిగించుకొని కాలుస్తూ, చాలా రోజుల తర్వాత మరల సిగరేట్ త్రాగుచున్నాను కాబట్టి, కొద్దిసేపు ఉత్తేజంగా అనిపించి, కొంచెం నాబాధల నుండి ఉపశమనం కలిగినట్టు భావించాను. సాయంత్రం చక్రవర్తి ఇంటికి వచ్చిన తర్వాత, చక్రవర్తికి, తనచిన్నాన్న నా గురించి ఎదో చెప్పినాడు. తర్వాత చక్రవర్తి నా వద్దకు వచ్చి, నీవు ఇలా గమ్యం లేకుండా తిరుగుట మాని, మీ ఊరికి పోయి, నీ ఆరోగ్యం గురించి ఒక మంచి డాక్టర్‌కు చూపించుకో, అనిచెప్పినాడు. బహుశా, చక్రవర్తికి నా అసలు సమస్య ఎమిటో తెలిసి ఉండకపోయి ఉండవచ్చు.

మరుసటిరోజు తెల్లవారక ముందే లేచి, అక్కడ ఉండుట చక్రవర్తికి ఇష్టంలేదేమో అని భావించి, ఎవరికీ చెప్ప కుండా అక్కడ నుండి బయలుదేరి బస్‌స్టేషన్‌కు చేరుకున్నాను. చాలా బస్సులు అక్కడ

నిలిచి ఉన్నాయి. చక్రవర్తితో మాటల సందర్భంలో, నెల్లూరికి దగ్గరగా వుండే 'బుచ్చిరెడ్డిపాలెం' అనే ఊరులో, వెంకటగిరిలో నా రూమ్‌మెట్ గా ఉన్న కృష్ణారెడ్డి, ఒక వైన్ షాప్ నడుపుచున్నాడని వినియున్నాను. కనుక, ఇంక వేరొక ఆలోచన లేకుండా నెల్లూరికి పోయే బస్సు ఎక్కి కూర్చున్నాను. బస్సు ప్రయాణం ఎలా జరిగిందో, ఏమో, నాకు ఏమీ గుర్తులేదు. నాకు గుర్తు ఉన్నదల్లా వైన్ షాపు లో కృష్ణారెడ్డిని కలసి నా ఆలోచనల గురించి క్లుప్తముగా చెప్పి, అలాగే నా పై ఉన్న కేసు గురించి, పోలీసులు నన్ను వెతుకుతున్నారని కూడా చెప్పాను. కృష్ణారెడ్డి, నేను నిజంగానే ఊరిలో నేరం చేసి తప్పించుకు తిరుగుతున్నానని, నేను చెప్పే మాటలు, నా చేష్టలు అంతా ఒక నాటకమని భావించినాడు. అయినా కూడా, కొంతకాలం నన్ను తనతో ఉండమని చెప్పాడు. వైన్ షాపు వెనుకే ఒక రూమ్ ఉన్నది, అందులో నన్ను ఉండమని కోరాడు. కృష్ణారెడ్డితో, క్యాష్‌కౌంటర్‌లో నేను కూర్చొంటానని చెప్పి అక్కడ కూర్చొని నా ఆలోచనలు నియంత్రించుకొనుటకు, గ్లాస్ సెల్ఫ్‌లలో అమర్చిన బాటిల్స్‌ను లెక్కిస్తూ ఆ తర్వాత క్యాష్ బాక్స్‌లో డబ్బు లెక్కిస్తూ గడప సాగాను. కాని, నేను డబ్బు వసూలు చేయడంలో ఏ పొరపాటు చేయలేదు. ఒకటి, రెండు రోజుల తర్వాత కృష్ణారెడ్డికి ఎందుకో నా ప్రవర్తన మీద అనుమానం వచ్చినది. నాకు నిజంగానే బాగాలేదేమో అని అనుకున్నట్లున్నాడు, కాని నన్ను అతను ఏమి ప్రశ్నించక, నన్ను లోపల మద్యం సేవించు చోట కూర్చొని తాగే వారిని గమనించమని చెప్పి, ఆ రూము లోపలికి పొమ్మన్నాడు.

నేను అంతకు మునుపెన్నడు మద్యము త్రాగియుండలేదు. ప్రజలందరూ నన్ను మద్యము సేవించమని సలహా ఇస్తున్నారని, ఒక వేళ నేను అందుకు అంగీకరించని యెడల ఈ ప్రపంచానికి విపరీతమైన నష్టము సంభవించునేమో అని, విపరీతమైన ఆలోచనలు చేసి, అవన్ని నిజమని నమ్మినాను. అప్పటికే నా ప్రక్కన ఒక బలిష్టుడైన వ్యక్తి కూర్చొని ఒక బాటిల్ మూత తెరిచి అందులోని మద్యం కొంత గ్లాసులో పోసుకొని, అందులో కొంత సోడా కలిపి, వేయించిన వేరుశెనగ పప్పులు నములుచున్నాడు. బహుశా, అతను ఈ గ్లాసులోని మద్యము నా కోసమే రెడీ చేసి పెట్టియున్నాడని భావించి, వెంటనే గ్లాసు తీసుకొని రెండు, మూడు గుటకల్లో అంతా మ్రింగివేసినాను. వెంటనే నా ప్రక్కన కూర్చోన్న వ్యక్తి దిగ్భ్రాంతి చెంది,

"ఎవరు నీవు? నా తో ఆటలు ఆడుచున్నావు. నేను అసలే మంచివాడను కాను," అని గట్టిగా అరిచినాడు. నేను మునుపెన్నడు మద్యం ఇంత రుచి లేకుండా, చేదుగా, ఘాటుగా ఉంటుందని, ఊహించి ఉండలేదు. అందుచేత, నేను అతని అరుపులు పట్టించుకొనలేదు. నేను అసలు ఆ చెడ్డ రుచి నుండి వెంటనే తేరుకొనలేక పోయాను. కృష్ణారెడ్డి వెంటనేలోనికి పరుగెత్తుకొని వచ్చి, జరిగినది తెలుసుకొని అతనితో,

"ఇతను నా మిత్రుడు, ఆరోగ్యం సరిగా లేదు, మరేమి అనుకోవద్దు నీకు ఇంకొక బాటిల్ ఇస్తాను,"

అని చెప్పి అతనిని శాంత పరిచాడు. తర్వాత జరిగిన విషయములు ఏవి నాకు గుర్తులేవు. తర్వాత అక్కడ నుండి బయలుదేరి అనంతపురం జిల్లాలోని కొన్ని ఊర్లలో ఉండే స్నేహితుల వద్దకు వెళ్ళి, తర్వాత ఒక స్నేహితుని సలహా మేరకు, ముంబాయిలో ఉన్న ఒక ముఖ్యమైన స్నేహితుడు శివారెడ్డి అనే అతని వద్దకు బయలుదేరి వెళ్లా ను. అతను, అక్కడ ఒకబ్యాంకులో పనిచేస్తున్నాడని మాత్రమే నాకు తెలుసు. మిగతా ఇంకేమి వివరాలు తెలియవు. అయినా అతన్ని కలుసుకొనుటకు వెళ్ళినాను.

నేనుండే ప్రాంతం నుండి ముంబాయి వెయ్యి కిలోమీటర్ల దూరం కంటే ఎక్కువ దూరమే ఉంది. నేను అంత దూరం ఎలా ప్రయాణం చేశానో, అందుకు కావలసిన డబ్బు నా చేతికి ఎలా వచ్చిందో నాకేమి గుర్తులేదు. నేను దాదర్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగుట బాగా గుర్తుంది. దిగిన వెంటనే స్టేషన్ బయటకు వచ్చి, ఒక షాపు వద్దకు వెళ్ళి ముంబాయి టెలిఫోన్ డైరెక్టరి అడిగాను. అందులో వెతికితే, నా స్నేహితుడు పనిచేయుచున్న బ్యాంక్ ప్రక్క వీధిలోనే ఉన్నట్లు గ్రహించాను. ఆ బ్యాంక్ చాలా దగ్గరలోనే ఉన్నా కూడా, రోడ్డుపై నిలిచి ఉన్న ట్యాక్సి తీసుకొని బ్యాంక్ ముందు దిగాను. బ్యాంక్ లోనికి వెళ్ళి చూడగానే, స్నేహితుడు శివారెడ్డి వెంటనే కనిపించాడు. అతను నన్ను చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు. అతను ముందు నన్ను పోల్చుకోలేకపోయాడు. తిరుమలలో వెంట్రుకలు దేవునికి ఇచ్చినందున, అప్పటికి  కొద్దిగా మొలచిన జుట్టు, దాదాపు కొన్ని  వారాలుగా తీయని గడ్డము, మాసి దుమ్ము కొట్టుకొని పోయిన బట్టలు, దుర్గంధ భూయిష్టంగా ఉన్న నా 'షూ' చూసి,  అతనికి అసలు విషయం అర్థంకాక, వెంటనే తన మేనేజర్‌తో ఒక గంట పాటు బయటకుపోయి వచ్చుటకు అనుమతి తీసుకొని, దగ్గరలోనే ఉన్న రూమ్‌కు వచ్చాము. రూమంటే అది రూము కాదు, అది ఆంధ్ర అసోషియేషన్‌కు సంబంధించిన ఒక కేంద్రం, అప్పుడు అక్కడ చాలా మంది తెలుగు వారు ఉన్నారు. కాని వారితో అప్పుడు నేను ఎలా వ్యవహరించింది గుర్తులేదు. నా స్నేహితుడు నన్ను సంతోషంగా ఉంచుటకు చాలా తాపత్రయపడేవాడని గుర్తుంది.

అతను,  నేను ఒక తీవ్రమైన మానసిక వ్యాధితో బాధపడుచున్నానని గ్రహించలేకపోయాడు. ముంబాయిలో నాకు కొన్ని విషయాలు మాత్రమే గుర్తు ఉన్నాయి.  అక్కడ నేను  ఎట్లు బాధపడినానో సరిగా గుర్తు లేదు. కాని, మానసికంగా తీవ్రమైన క్షోభ అనుభవించినానని  నాకు తెలుసు. ఒక రోజు నేను సముద్రపు ఒడ్డున ఉన్న బీచ్‌కు వెళ్ళాను. అక్కడ ఎక్కువ మంది ప్రజలు లేరు. అది మధ్యాహ్నం కావడం మూలంగా ఎండ ఎక్కువగా ఉంది. కొంతమంది అక్కడ సముద్రంలో ఈత కొడుతున్నారు. నేనెందుకో ఏమో, వారికి దగ్గరగా వెళ్ళాను. వారు హిందీలో  ఏదో కటువుగా మాట్లాడారు. నాకు సరిగా అర్థము కాలేదు. వెంటనే నేను వారికి దూరంగా వచ్చాను. అక్కడ ఒక అతను కూల్ డ్రింక్స్ బండి మీద పెట్టుకొని అమ్ముతున్నాడు. నేను ఒక కూల్‌డ్రింక్ తీసుకొని త్రాగుచున్నాను. ఇంతలో, అతను పక్కనున్న ఒక స్త్రీని ఏదో దుర్భాషలాడినాడు. నేను వెంటనే కూల్‌డ్రింక్ త్రాగుట ఆపి,  సీసా అక్కడ పెట్టి దూరంగా వచ్చినాను. అక్కడక్కడ ఒకరిద్దరు  మనుషులు తిరుగుతున్నారు. అక్కడ సముద్రతీరానికి దగ్గరగా, కొద్దిగా ఎతైన ప్రదేశంలో,  కొన్ని అందమైన భవంతులు ఉన్నాయి. నేను దగ్గరగా వెళ్ళి అటుగా చూస్తూ ఉన్నాను. ఒక ఇంటిలోని బాల్కని నుంచి ఒక అందమైన అమ్మాయి నా వైపే చూస్తూ ఉన్నది. కొద్దిసేపటి తర్వాత, ఆమె లోనికి వెళ్ళి కొంచెం పెద్దదైయిన ఇంకొక స్త్రీని పిలుచుకొని వచ్చి, నా కేసి వేలు పెట్టి చూపించింది. నా కెందుకో, వారికి నేను అక్కడ తిరగడం ఇష్టంలేదేమో అని భావించి, వెంటనే అక్కడ   నుండి బయలు దేరి వచ్చాను. ఈ విధంగా, అంత పెద్ద నగరంలో నేను గమ్యం లేకుండా, నా స్నేహితుని, అతని రూమ్‌ను తప్పి పోకుండా ఎలా తిరిగానో నాకు ఇప్పటికి ఆశ్చర్యంగానే ఉంది.

ఒక రోజు, నేనూ నా స్నేహితుడు కలసి రోడ్డు వెంట నడిచి వెళ్తున్నాము. ఒక చోట 'కోర్టు రోడ్' అనే బోర్డు రాసి ఉంది. నేను నా స్నేహితునితో ఆ వీధిలో వెళ్ళ వద్దని వెంటనే వెనక్కి వెళ్దా మని చెప్పాను. కాని నా స్నేహితుడు అక్కడ నా శత్రువులెవ్వరూ లేరని నన్ను సముదాయించుటకు ప్రయత్నించినాడు. ఇంకొక

రోజు, నేను ఒక్కడినే ఒక రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్నాను. అప్పుడు అక్కడ పోవుచున్న సిటీ బస్సులోని ప్రయాణికులు అంతా చేతులు ఊపుచూ నన్ను వెంటనే మా స్వగ్రామమునకు వెనక్కు వెళ్ళమని గట్టిగా కోరినట్లు వినిపించింది. ఒక రోజు ఉదయాన్నే టిఫిన్ చేయుటకు, నేను ఒక్కడినే ప్రక్కనే ఉన్న హోటల్‌కు పోవుచున్నాను. అప్పుడు ఉన్నట్లుండి నా తమ్ముడు ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను వెంట పెట్టుకొని నాకు అడ్డు పడినాడు. పోలీస్ కానిస్టేబుల్ నన్ను పట్టుకొని, నీవద్ద కత్తి ఏదైనా ఉందా? అని అడిగినాడు. అందుకు నేను, ‘లేదు’ అని సమాధానమును ఇచ్చినాను. అతను నన్ను తనిఖీ చేసి తర్వాత, మీ ఊరిలో నీవు హత్య ప్రయత్నము చేసినట్లు నీపై కేసు నమోదైయున్నది కదా? అని అడిగాడు. అందుకు నేను ‘అవును’ అని సమాధానము చెప్పినాను. వెంటనే అతను నన్ను పోలీస్ స్టేషన్‌కు రావలసిందిగా బలవంత పెట్టాడు. నా తమ్ముడు, పోలీస్, ఇద్దరూ కలసి నన్ను స్టేషన్‌కు తీసుకొని వెళ్ళారు. నేను అక్కడికి పోవుసరికి, అక్కడ హాల్‌లో ఇన్స్‌పెక్టర్ ఒక నింధితున్ని చితకబాదుతూ ఉన్నాడు. కానిస్టేబుల్, నన్ను ఒక బెంచిపై కూర్చోమని చెప్పి నా తమ్ముని పక్కన నిల్చున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇన్స్‌పెక్టర్ నా వైపు తిరిగి ఎవడు వీడు? ఏం చేసినాడు? అని అమర్యాదగా మాట్లాడినాడు. నేను అప్పుడున్న మానసిక పరిస్థితిలో చాలా నొచ్చుకున్నాను. తర్వాత నా తమ్ముడు,

“ఇతను మా అన్న, ఊరిలో నా పై హత్యా ప్రయత్నం చేసినాడు. అక్కడ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేసి ఉన్నది” అని చెప్పినాడు. అప్పుడు నేను ఊహించని విధంగా ఇన్స్‌పెక్టర్ నన్ను గట్టిగా చెంపపై కొట్టి, “ఇతన్ని ఎందుకు చంపేందుకు ప్రయత్నించినావు?” అని ప్రశ్నించినాడు. అప్పుడు నేను విపరీతమైన కోపంతో ఇన్స్‌పెక్టర్ వైపు చూసి,

“నన్ను కొట్టుటకు నీకు ఎంత ధైర్యం రా?” అని అరిచినాను. తర్వాత ఏమి జరిగిందో నాకు గుర్తులేదు కాని, వెంటనే ఇన్స్‌పెక్టర్ నా పై సానుకూలత ప్రదర్శించినట్లు గుర్తు.

తర్వాత నన్ను పోలీస్ లాకప్‌లోకి పంపినారు. పోలీస్ లాకప్‌లో మూడు గదులు, ఒక టాయిలెట్ ఉన్నాయి. అందులో 15 మంది ఉండుటకు మాత్రమే సరిపడ స్థలం ఉంది. కాని అందులో దాదాపు 30 మందిని క్రుక్కినారు. అందరూ పడుకొనుటకు కూడా స్థలం సరిపోవుట లేదు. నేను లోపలికి వెళ్ళినంతనే, అందులోని ఖైదీలు తమకు ఒక కొత్త స్నేహితుడు వచ్చాడని గట్టిగా అరచి సంతోషించినారు. కొద్ది సేపటికే నాకు అక్కడి భాష హిందీ సరిగారాదని గ్రహించి, నన్ను ఎగతాళి చేసి ఏడ్పించుటకు ప్రయత్నించారు. కాని నేను ఇవేమి పట్టించు కోకుండా ఒక మూల పోయి కూర్చొన్నాను. కొద్దిసేపటి తర్వాత వారు నన్ను పట్టించుకొనలేదు. నేను జైలు గేటువద్దకు వెళ్ళి అక్కడ ఉన్న పోలీసులతో, “నన్ను వెంటనే మా ఊరికి పంపండి.,” అని కోరాను. అందుకు వారు,” మేము నిన్ను అక్కడికి తీసుకొని పోము, కోవెలకుంట్ల పోలీసులకు అప్పుడే నీ అరెస్టు గురించి తెలిపాము. వారు వచ్చిన వెంటనే నిన్ను వారికి అప్పగిస్తాము,” అని అన్నారు. రెండు రోజులు గడిచినవి, కాని నన్ను తీసుకొని పోవుటకు ఎవరూ రాలేదు. నేను మరలా ముంబాయి పోలీసులతో, “నన్ను ఇక్కడి నుండి మా ఊరికి పంపే వరకు నీరు ఆహారం తీసుకొనకుండా నిరాహారదీక్ష చేస్తాను” అని చెప్పి, ఆ రోజు నుండి పచ్చి మంచినీళ్ళు అయినా ముట్టలేదు. రెండు రోజులు గడిచినవి. ఎవరూ నా గురించి పట్టించుకోలేదు. అప్పటికే, నేను బాగా నీరసించి ఉన్నాను. కొందరు నా గురించి సానుభూతి తెలుపుచున్నారే కాని ఇంకేమియు చెయ్యకున్నారు.

అప్పుడు అక్కడ మాతో కూడా ముగ్గురు కరుడు కట్టిన నేరస్తులు ఒక రూములో ఉన్నారు. వారు బాగా బలము కలిగి, చాలా దౌర్జన్యం చేయువారు. వారి రూమ్ లోనికి ఇంకెవరిని అనుమతించకుండా వారే రూమ్ అంతా ఆక్రమించుకొని ఉన్నారు. వారు నన్ను వారి రూమ్‌లోనికి తీసుకొని వెళ్ళి, "నీవు ఈ జైలులో మరణించినను ఎవ్వరూ ఏమి పట్టించుకొనరు. కనుక ఈ రోజునుండి ఆహారం తీసుకో" అని బోధించినారు. ఇంకా ఆ పూటకు మొత్తం ఖైదీ లంతా కలసి, "ఈ వ్యక్తిని వెంటనే తన ఊరికి పంపండి లేనిచో మేము కూడా ఆహారం తీసుకొము," అని తెలిపినారు. దానికి అక్కడి పోలీసులు, మేము కోవెలకుంట్ల పోలీసులకు ఇంకొక సారి గుర్తుచేస్తామని తెలిపారు. కనుక, నేను నా నిరాహార దీక్ష విరమించి మరలా ఆహారం తీసుకొన్నాను. ఆ తర్వాత నేను కూడా ఆ ముగ్గురితో పాటు అదే రూమ్‌లో ఉన్నాను. అప్పటి నుండి ఖైదీలంతా నన్ను గౌరవంగా చూడసాగారు. కాని నేను నా విపరీతమైన ఆలోచనల నుండి బయట పడలేదు. ఇందంతా ప్రయోగాలలో ఒక భాగమే అని భావించాను. జైలులో ఇంతకంటే ఇంకేమీ గుర్తులేదు. ఆఖరుకు కోవెలకుంట్ల పోలీసులు ఒక ఇన్స్‌పెక్టర్, ఒక కానిస్టేబుల్ వచ్చి నన్ను వారి కస్టడీలోకి తీసుకొన్నారు. వెంటనే వారు నన్ను తాము బసచేసిన హొటల్ గదికి తీసుకొని వెళ్ళారు. వారు మా ఊరి పోలీసులు కాబట్టి, మా నాన్న గురించి ఇంకా మా కుటుంబమునకు సంబంధించిన ఇతర విషయముల గురించి బాగా తెలుసు. కనుక వారు నన్ను మర్యాదగానే చూసుకొన్నారు. హోటల్‌కు వెళ్ళిన వెంటనే నన్ను స్నానం చేయమని చెప్పి క్రొత్త బట్టలు ఇచ్చారు. తర్వాత విషయములు ఏవీ నాకు గుర్తులేవు. నాకు గుర్తు ఉన్నదంతా, రైలులో మా ఊరికి పోవుచున్నప్పుడు వారు

" నీవు మంచి కుటుంబం నుంచి వచ్చినావని మాకు తెలుసు, నీకు మేము ఎటువంటి అసౌకర్యం కలిగించము, కనుక నీవు స్వేచ్ఛగా సంతోషంగా ఉండు," అని చెప్పి, నా చేతులకు వేసిన బేడీలు తీసివేసినారు. మరి కొన్ని గంటల తర్వాత నేను టాయిలెట్‌కు పోయిరావలెనని చెప్పాను, దానికి వారు, "పోయి వెంటనే రా" అని చెప్పారు. వారు నా వెంట రాలేదు. రైలు చాలా వేగంగా ప్రయాణిస్తూవుంది. నేను టాయిలెట్‌కు పోయి వచ్చిన తర్వాత, కంపార్ట్‌మెంట్ డోర్ వద్ద నిలబడి ఉన్నాను. బయట నుండి వచ్చు చల్లగాలి నన్నుతాకింది. అంత దీన స్థితిలో కూడా నాకు హాయి అనిపించింది. మరుక్షణమే, ప్రపంచమంతా నన్ను రైలు నుండి దూకి ప్రాణత్యాగం చేయమని కోరుచున్నట్లు, లేకుంటే ఈ విశ్వం అంతా ప్రళయం వస్తుందని ఊహించుకొని, అదే నిజమని నమ్మి, వెంటనే దూకుటకుద్యుక్తుడనయ్యాను. మరుక్షణంలో దూకుదామని అనుకుంటుండగా, కానిస్టేబుల్ నా చేయి పట్టుకొని "ఇక్కడ ఏమి చేస్తున్నావు" అని గద్దించినాడు. దానికి నేను," రైలు నుండి దూకి ప్రాణత్యాగం చేయవలెనని ఇక్కడ ఉన్నాను," అని చెప్పిన వెంటనే, నా చేతిని పట్టుకొని ఉన్న తన పిడికిలి బిగించి నన్ను లాగుచూ, మేము కూర్చోన్న సీట్లు వద్దకు తీసుకొని పోయి,

"సూర్యా, రైలు నుండి దూకి మరణించుటకు ప్రయత్నించుచున్నాడు!" అని ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు." అప్పుడు ఇన్‌స్పెక్టర్, "నీ పై మోపబడిన కేసు కోర్టులో ఏ మాత్రము నిలువజాలదు, ఈ మాత్రనికే నీవు ప్రాణ త్యాగం చేయవలెనా? మాకు మీ నాన్న చాలా ధైర్యవంతుడని తెలుసు. నీవేమి ఇంత బేలగా ఉన్నావు!" అని చెప్పి, వెంటనే నా చేతికి మరల బేడిలు వేసి నన్ను కదలనీయకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొన్నారు.

తర్వాత నాకు ఇంకేమి గుర్తులేదు. నన్ను కోవెలకుంట్ల తెచ్చినారనే విషయం వెంటనే చాలా మందికి తెలిసింది. దగ్గరి బంధువులు, ఇంకా చాలా మంది తెలిసిన వారు వచ్చి పరామర్శించుచున్నారు. చాలా మందికి నేను కొంచెం తేడాగా కనిపించినను, ఎవ్వరికీ నేను "స్కిజోఫ్రీనియా" అనే తీవ్రమైన మానసిక వ్యాధితో బాధపడుతునాన్నని తెలిసిరాలేదు. నాకు వరుసకు బావమరిది అయిన మా దగ్గరి బంధువు, రెండు బకెట్ల వేడి నీళ్ళు స్టేషన్‌కు తెచ్చి, తను ప్రక్కనే ఉండి బాగా స్నానం చేయించి, మంచి బట్టలు ఇచ్చి వేసుకోమన్నాడు. తర్వాత, ఒక పరుపు, ఒక దోమతెర తెచ్చి స్టేషన్‌లోనే అన్ని అమర్చి, మంచి భోజనం తెచ్చి దగ్గర ఉండి తినిపించాడు. అతను నా పట్ల చూపిన ప్రేమను నేను ఎన్నటికి మరువజాలను. తరువాతి రోజు ఉదయాన్నే, మాసిన గడ్డం తీయించారు. అప్పుడు నేను కొంత మామూలు మనిషిగా కనిపించి ఉండవచ్చు. అదే రోజు నన్ను కోర్టుకు తీసుకొని వెళ్ళారు. కాని, కోర్టులో జరిగిన విచారణ ఏదీ నాకు గుర్తు లేదు. కోర్టు ప్రక్కనే ఉన్న జైలు లోనికి నన్ను జుడిషియల్ కస్టడీకి పంపినారు. అక్కడ జైలు జీవితం కొద్దిగా గుర్తుంది. ఒక్కొక్క సెల్‌లో ఆరు మందికి మించి ఉండరాదు. నాకు మా బంధువులు తమ పలుకుబడిని ఉపయోగించి సెల్‌లో బెడ్, దోమతెర, మంచి నీరు అమర్చినారు. జైలుపై భాగమున గోడకు ఉన్న గూళ్ళలో చాలా పావురములు ఉండేవి . అవి ఎప్పుడూ ఒక విధమైన గుర్, గుర్ అనేశబ్దములు చేయుచుండేవి. ఇవి నా మనసులోని ఆలోచనలను గ్రహించి, తాము చేయు శబ్దముల ద్వారా, నాకేదో సందేశము పంపుటకు ప్రయత్నిస్తున్నాయని, మనసుని ఆ శబ్దముల మీదనే లగ్నము చేసి వింటూ ఉండేవాడిని. కాని ఆ శబ్దములలోని అర్థం నాకు ఏమి తెలియలేదు. పగలు జైలు చుట్టు ప్రక్కలనున్న చెట్లపై ఎగురుతూ, నాకు అతి సమీపంలో ఉండే మైదానంలో పురుగులను గింజలను ఏరుకొని తింటూ కనిపించేవి. పోలీసులు కూడా వీటిని జాగ్రత్తగా కాపాడుచుండేవారు.

నేను ఉండే సెల్‌లో నాతో పాటు ఇంకొక 5 మంది ప్యాక్షనిస్టులు ఉండేవారు. వారు ఒక హత్య కేసు లో నిందితులు, వారికి మా నాన్న, ఇంకా కొందరు మా ముఖ్య బంధువులు బాగా తెలియును. కనుక, నాతో బాగా స్నేహంగా ఉండేవారు. వారు నాతో చాలా విషయాలు మాట్లాడేవారు. నేను పూర్తిగా డెల్యూసన్స్‌కు లోనయి, స్కిజోఫ్రీనియా అనే మానసిక వ్యాధిగ్రస్తున్ని అయిపోయాననే విషయం వారు గ్రహించలేదు. నా తోటి ఇతర ఖైదీలు కూడా నన్ను మామూలు మనిషిగానే భావిస్తూ ఉండేవారు. కాని మా దగ్గరి బంధువులు, చిన్నప్పటి నుండి నేను మెత్తని స్వభావం కలవాడిని కాబట్టి ఈ కష్టాలకు క్రుంగిపోయానని భావించి, మా పెద్దనాన్న, మా మామ గారు, ఒకరు మార్చి, ఒకరు ఎప్పుడూ నాకు తోడుగా జైలు బయటే ఉండేవారు. వారి పలుకుబడిని ఉపయోగించి, పోలీసుల సహకారంతో రాత్రి పూట కూడా సెల్ బయట నిద్రించుచుండేవారు. వారికి నా పై వున్న ప్రేమను నేను ఎన్నటికి మరచిపోలేను. ఒక రోజు మా మామ, మా పెద్ద నాన్న వచ్చి, నీకు బెయిలు వచ్చింది, నిన్ను ఈ రోజు ఇంటికి తీసుకొని పోతామని చెప్పినారు. తర్వాత వారు, మా నాన్నకు కూడా అరెస్టు కాకుండానే ముందస్తు బెయిలు వచ్చిందని చెప్పినారు. అప్పుడు జైలు బయటకు వచ్చి మేజిస్ట్రేట్ ఎదుట హాజరవుట మాత్రమే గుర్తుంది. తర్వాత నా జబ్బు బాగై, నా ఆరోగ్యం కుదుట పడేటంత వరకు ఒకటి రెండు సంఘటనలు తప్ప ఇంకేది గుర్తులేదు.

నేను ఆరోగ్యవంతుడిని అయిన తర్వాత తెలిసిన సమాచారం ప్రకారము, మా బావ డాక్టర్ రాజారెడ్డి, నన్ను, మా అక్క డాక్టర్ శిరీష దగ్గరికి తీసుకొని వెళ్ళాడు. అక్కడ, మా బావకు తెలిసిన కొందరు స్నేహితులు నన్ను సంతోష పరుచుటకు ఒక విందు ఏర్పాటు చేసినారు. అప్పుడు మా బావ, నేను ఒక

మానసిక వ్యాధికి లోనైనానని గుర్తించినాడు. మాబావ ఈ విషయమై మా అక్కతో చర్చించిన తర్వాత, వారికి తెలిసిన ఒక డాక్టర్ ద్వారా, బెంగళూరు నగరంలో డాక్టర్ హెచ్.ఎస్. సుబ్రమణ్యం అనే మానసిక వైద్యుడు, 'మానస నర్సింగ్ హోమ్' అను న్యూరో సైకియాట్రిక్ హాస్పిటల్ నెలకొల్పియున్నాడని, అతను చాలా అనుభవంగల మంచి సైకియాట్రిస్ట్ అని తెలుసుకొని, మా బావ డాక్టర్ రాజారెడ్డి, మా నాన్న, నన్ను తీసుకొని వెళ్ళి అక్కడ చేర్పించినారు. డాక్టర్ సుబ్రమణ్యం నాకు అన్ని పరీక్షలు నిర్వహించిన తర్వాత, నేను స్కిజోఫ్రీనియా అను తీవ్రమైన మానసిక వ్యాధితో బాధపడుచున్నానని. తాను నన్ను తప్పక ఆరోగ్యవంతునిగా చేయగలనని చెప్పాడు. హాస్పిటల్‌లో చేరిన వెంటనే, డాక్టర్ సుబ్రమణ్యం నాకు షాక్ థెరపిద్వారా ట్రీట్‌మెంట్ మొదలు పెట్టాడు. నాకు ఒకటి, రెండు చిన్న సంఘటనలు తప్ప ఇంకేమి గుర్తులేవు. అవి కూడా లీలగా గుర్తున్నాయి. ఒకటైతే నేను స్నానం చేయునపుడు మా నాన్న నాకు సహాయం చేస్తున్నట్లు. రెండవది, నా శరీరం అంతా బాగా వాచి, నా కాళ్ళలో విపరీతమైన నొప్పి వచ్చి నడవడం కష్టంగా ఉండేది. ఈ రెండు సంఘటనలు తప్ప ఇంకేది గుర్తులేదు. నేను మా అమ్మ, నాన్నలను కూడా గుర్తించలేక పోయానని చెప్పారు. కొంతకాలం ట్రీట్‌మెంట్ ఇచ్చిన తర్వాత డాక్టర్ నన్ను డిశ్చార్జ్ చేశారు.

నాకు 15 దినములకు మందులు వ్రాసి, సమయం తప్పకుండా మందులు మ్రింగవలెనని, 15 రోజుల తర్వాత మరలా చెకప్‌కు రావలెనని చెప్పి పంపించారు. మా నాన్న నన్ను తీసుకొని మా ఊరికి వెళ్ళకుండా, వేరే బంధువుల దగ్గరికి తీసుకొని వెళ్ళాడు. అక్కడ విశాలమైన పంటపొలాల మధ్య ఒక్కటే ఇల్లు ఉంది. ఇంటి చుట్టూ చాలా చెట్లు ఏపుగా పెరిగి ఉన్నాయి. అది ఒక తోట, ఇంకా విశాలమైన పంట పొలాలు ఉన్న ఎస్టేట్ అని తెలుసుకున్నాను. అక్కడికి పోయిన తర్వాత నాకు కాకులు గుర్తు రాసాగాయి. కాని, నేను మనస్సును వెంటనే వేరొక దాని పైకి మళ్ళించుకొనుచుంటిని. నాకు అంతా అయోమయంగాను, మనస్సులోనూ, చేతులలోనూ ఏదీ నిలకడలేక, ఏది సరిగా గుర్తులేక ఉంటిని. మా నాన్న నాతోనే ఉండి, మందులు మాత్రము సమయం ప్రకారం మ్రింగిస్తూ వుండినాడు. 15 రోజుల తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. అంతకు ముందు పడ్డ మనోవేదన తర్వాత గుర్తులేదు ఇప్పుడు నా ఆలోచనలు నిలకడగా ఉన్నాయి. డాక్టర్ దగ్గరికి చెకప్‌కు వెళ్ళగా, ఆయన నన్ను పరీక్షించి మరలా నెల రోజులకు మందులు రాసి ఇచ్చి, బాగా కోలుకుంటున్నాడని చెప్పి, మందులు మాత్రము ఒక్క పూట కూడా మానకుండా, సమయం తప్పకుండా తప్పక తీసుకొనవలెనని చెప్పినారు. అప్పుడు మా నాన్న నన్ను ఊరికి పిలుచుకొని వచ్చినాడు, ఈ మధ్య కాలంలో నేను దాదాపు 10 నుండి 15 కేజీలు బరువు పెరిగి బాగా ఆత్మవిశ్వాసంతో ఉన్నాను.

ఊరిలోని వారికెవరికీ నాఆరోగ్య విషయమై అనుమానం రాలేదు. ముఖ్యమైన బంధువులకంతా, నా ఆరోగ్య విషయం ఎవరికీ తెలియనీయకుండా గోప్యంగా ఉంచారు. తర్వాత, రోజు, రోజుకూ నా ఆరోగ్యం మెరుగుపడింది. అప్పుడు కొందరు దగ్గరి బంధువులు, మా తండ్రితోనూ, మా తమ్ముడితోనూ మాట్లాడి, రాజీ ప్రయత్నాలు చేసినారు. అందులో భాగంగా, నాకూ, మా తమ్ముడికి మధ్య ముఖాముఖి చర్చలు ఏర్పాటు చేసినారు. మా తమ్మునితో మాట్లాడిన తర్వాత అతని మనస్సు పూర్తిగా నాకు అవగతమైంది. అప్పుడు నేను మా నాన్నతో కఠినంగా మాట్లాడి, ఎలాగో ఒకలాగు మా తమ్ముని డిమాండ్స్‌ని ఒప్పుకొనుటకు ఒప్పించినాను. అంతటితో మా మధ్యనున్న తగాదాలన్ని సమసిపోయినవి. కేసులన్నీ కోర్టులో కొట్టివేసినారు. నేను డాక్టర్

దగ్గరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి చెకప్‌కు వెళ్ళి చూపించుకుంటున్నాను. మందులు ప్రతిరోజూ వేళకు సరిగా వాడుచూ ఆరోగ్యాన్ని కాపాడుకొంటూ ఉన్నాను.

## 4 వ భాగము

నేను మళ్ళీ నా చదువు కొనసాగించుటకు బెంగళూరు వెళ్ళాను. నా అనారోగ్యం వల్ల నేను రెండవ సంవత్సరం పరీక్ష ఫీజు కట్టియుండలేదు. అందువలన మూడవ సంవత్సరం 'లా' కోర్సునందు ప్రవేశం లభించలేదు. నేను ఇంతవరకు మొదటి సంవత్సరం కోర్సునందు కాని, రెండవ సంవత్సరంనందు కాని, ఒక్క పరీక్ష కూడా పాస్ కాలేదు. అన్ని పరీక్షలు వ్రాయవలసి ఉంది. ఆ తర్వాత మూడవ సంవత్సరం పరీక్షలు కూడా వ్రాయవలసి ఉంది. నేను మరలా రాజాజి నగర్ లో ఉండే పాలిటెక్నిక్ కాలేజి హాస్టల్ నందే చేరాను. అక్కడ 'శివప్రసాద్' అను విద్యార్థి నాకు రూమ్‌మేట్‌గా ఉన్నాడు. శివప్రసాద్ నాకంటే రెండు లేక మూడు సంవత్సరములు చిన్నవాడు. అతను నాతో స్నేహంగా వుండుటకు చాలా ఇష్టపడ్డాడు. నేను కూడా అతను అంటే అభిమానం పెంచుకున్నాను. వెంటనే మంచి స్నేహితులం అయిపోయాము. శివప్రసాద్‌కు నా గురించిన అన్ని విషయాలు చెప్పి, నేను ఇంకా ఒక్క పరీక్ష కూడా పాస్ కాలేదని తెలిపి బాధపడ్డాను. అందుకు అతను "బాధపడకు సూర్యా! బాగా పట్టుదలతో చదువు, నీవు అన్ని పరీక్షలు ఒక్కసారికే పాస్ కాగలవు," అని నన్ను ఉత్సాహపరిచినాడు. తర్వాత బాగా చదువుతూ, మొదటి సంవత్సరం వలెనే ఇప్పుడు కూడా కాలేజిలో అన్ని క్లాసులకు హాజరవుతూ, కావలసిన పుస్తకాలు అన్నీ కొని పరీక్షలకు తయారుగా ఉన్నాను.

తర్వాత మా తమ్మునితో ఎటువంటి ఇబ్బంది రాలేదు. ఇరువురము సఖ్యతగా ఉన్నా, మేము ఒకరినొకరు ఎక్కువగా కలసేవారము కాదు. ఇప్పుడు నా దృష్టి అంతా పరీక్షలపైనే ఉంది. ఇంతలో పరీక్షలు రానే వచ్చాయి. మొదటి సంవత్సరం పరీక్షలన్ని బాగా వ్రాశాను. తర్వాత మిగిలిన ఐదు పరీక్షలు వ్రాయలేదు. ఎందుకు వ్రాయలేదో ఇప్పుడు గుర్తులేదు. వ్రాసిన ఏడు పరీక్షలు పాస్ అయినాను. అయినాకూడా రెండవ సంవత్సరంలో ఐదు పరీక్షలు, తర్వాత మూడవ సంవత్సరంలో ఆరు పరీక్షలు, మొత్తం పదకొండు పరీక్షలు వ్రాసి పాస్ కావలసి ఉంది. ఇప్పుడు ఫైనల్ ఇయర్ 'లా' కోర్సు చదువుచున్నాను. మానసికంగా బాగా ఆరోగ్యంగా ఉన్నాను. మందులు సమయం తప్పకుండా ప్రతిరోజు వేసుకుంటున్నాను. ఊరినుండి మా నాన్న ఉత్తరాలు రాస్తూ ఉండేవాడు. నేను కూడా అప్పుడప్పుడు ఊరికిపోయి వస్తూ ఉండేవాడిని. బాగా చదువుచున్నాను, ఈ సంవత్సరం అన్ని పరీక్షలు తప్పక పాస్ అవుతాననే నమ్మకం ఉండేది.

ఈ పరిస్థితులలో ఉన్నట్టుండి జరిగిన విషయాలు అన్ని నాకు గుర్తుకు వచ్చేవి. ఎందుకో, ఏమో నా ప్రవర్తన కూడా మారిపోయింది. చెడు స్నేహాలు కుదిరినవి. సిగరెట్‌లు విపరీతంగా తాగడం అలవాటు చేసుకున్నాను. మందు తాగడం కూడా అలవాటు అయింది. నేను మంచిగా, మెత్తగా ఉండుట వల్లనే నేను ఇన్ని కష్టాలు పడవలసి వచ్చిందని, సహజసిద్ధమైన నా మంచి ప్రవర్తనను మార్చుకొనుటకు ప్రయత్నించి నేను సరిగా మందులు తీసుకొనక, డాక్టర్ వద్దకు సరిగా చెకప్‌కు పోక, నాలో మరలా మానసిక సమస్యలు తలెత్తాయి. అందు వలన నేను చెప్పదలచినది ఏమంటే, మానసిక రోగి, డాక్టర్ సలహా లేనిదే, మందులు వాడుట మానివేయడము ఎట్టిపరిస్థితులలో కూడా చేయకూడదు. మరియు సకాలంలో డాక్టర్ వద్ద చెకప్ చేయించుకొనవలెను. లేనిచో స్కిజోఫ్రీనియా వెంటనే తిరగబెడుతుంది. నేను మరలా స్కిజోఫ్రీనియా జబ్బుబారిన పడ్డాను. ఈ జబ్బు వల్ల నేను నరకప్రాయమైన జీవితం గడిపినా, నాకెందుకు తెలివిరాలేదో, నాకు

అర్థం కాలేదు. సక్రమంగా మందులు వాడుచూ, సరియైన ప్రవర్తన కలిగి ఉండినయెడల, నేను మరలా, మరలా ఈ జబ్బు బారిన పడేవాడిని కాను. ఈ సారి నా ఆలోచనలలో కాకులు రాలేదు. కాని మునుపటిలాగే నాఆలోచనలు అందరికి తెలియుచున్నవని, శాస్త్రవేత్తలు పరిశోధన చేస్తున్నారని, అందరూ నన్ను గమనిస్తున్నారని, ఇంకా జరగబోవు విషయాలు ముందుగానే తెలియచున్నాయని, నా కలలు నిజము అగుచున్నాయని, గ్రహాంతర వాసులు నాకు సందేశాలు పంపుచున్నారని, నా ద్వారా వారు మానవులతో సమాలోచన జరపుటకు ప్రయత్నించుచున్నారని భావించుచుంటిని.

కాని అప్పటికే ఒకసారి ఈ వ్యాధి బారినపడి మరలా ఆరోగ్యవంతుడిని అయిన కారణంగా, చివరకు నేను డాక్టర్ సహాయము కొరకు వెళ్ళాను. ఆయన వెంటనే నా పరిస్థితి అర్థం చేసుకొని,

"వెంటనే మీ నాన్నకు టెలిగ్రామ్ ఇవ్వు, నిన్ను ట్రీట్‌మెంట్ కొరకు హాస్పిటల్‌లో చేర్పించవలెను," అని చెప్పినాడు. ఎందుకంటే నాకు ట్రీట్‌మెంట్ మొదలు పెట్టుటకు మా ఇంటిలోని వారు ఎవరో ఒకరు ఉండవలెనని చెప్పి పంపినాడు. దురదృష్టవశాత్తు చట్టాలు ఆవిధంగా ఉన్నాయి. షాక్‌థెరపీ ఇవ్వవలెనన్న, పేరెంట్స్ కాని, ఇతర రక్త సంబంధీకులు కాని, వారి సుముఖత తెలియజేయు పత్రం ఇవ్వవలెను. ఏ డాక్టర్ కూడా, తనంట తానుగా ఈ పని చేయలేదు. కనుక డాక్టర్ గారు నన్ను వెంటనే చేర్చుకొనుటకు తన అశక్తత తెలియచేసి, మాతండ్రి గారిని తోడ్కొని రమ్మని చెప్పాడు.

కాని నేను అందుకు విరుద్ధంగా, మా నాన్నకు గాని, నా మిత్రుడైన శివ ప్రసాద్‌కు కాని ఏమీ చెప్పకుండా నాకు వచ్చు డెల్యూసన్స్‌కు పూర్తిగా లోనై, అన్ని నిజమని నమ్మి, విపరీతంగా త్రాగుచూ, పూర్తి డిప్రెషన్‌తో జీవితం మీద పూర్తిగా విరక్తి కలిగి, 1977 జనవరి 1 వ తేదిన, హాస్టల్ గదిలో, నా దగ్గర ఉండే ఒక కత్తితో, కడుపులో పొడుచుకొని ఆత్మహత్య చేసుకొనవలెనని ప్రయత్నించినాను. అదృష్టం కొద్ది దగ్గరలో ఉండే స్నేహితులు వెంటనే నన్ను విక్టోరియా హాస్పటల్‌లో చేర్పించినారు. అక్కడి డాక్టర్లు ఒక ఆపరేషన్ నిర్వహించి నన్ను మృత్యువు నుండి కాపాడి చికిత్స చేసినారు. గాయం మానిన తర్వాత నన్ను సైకియాట్రిక్ వార్డుకు మార్చి, స్కిజోఫ్రీనియాకు డాక్టర్ సింగ్ అను మానసిక వైద్యునిచే చికిత్స చేయించినారు. కాని ఈ చికిత్స వలన నాకు పూర్తి ఆరోగ్యం సమకూరలేదు. నేను తర్వాత చాలా రోజులు మా ఊరిలోనే ఇంటి వద్ద ఉన్నాను. అప్పుడు, నేనే మా నాన్నతో, డాక్టర్ సుబ్రమణ్యం గారి దగ్గరికి పోయి చికిత్స చేయించుకుంటే మంచిదని చెప్పినానట. వెంటనే మా నాన్న డాక్టర్ సుబ్రమణ్యం గారి వద్దకు తీసుకొని వెళ్ళి ఆయన హాస్పటల్‌లో చేర్పించారు. అయన వెంటనే షాక్ ట్రీట్‌మెంట్ మొదలు పెట్టారు. కొద్దికాలం తర్వాత నేను పూర్తి ఆరోగ్యం సంతరించుకున్నాను. కాని నా మీద ఐ.పి.సి. సెక్షన్ 309 క్రింద ఆత్మహత్యా ప్రయత్నమనే నేరం మోపబడింది. ఇంత జరిగినా కూడా నాకింకా తెలివి రాలేదు. నేను మరలా చెడు సహవాసములు చేయుచూ, చెడు తిరుగుళ్ళు తిరుగుచూ విపరీతంగా సిగరెట్లు, మద్యం త్రాగుచూ, అసలు చదువు మీద దృష్టే పెట్టకుండా సమయం అంతా వ్యర్థముగా గడుపుచూవుంటిని. ఊరిలోని మా నాన్నకు ఈ విషయాలేవి తెలియవు. ఆయన నామీద కొంత అసంతృప్తిగా ఉన్నా, నేను ఇంతగా దిగజారి పోయి ఉంటానని ఎన్నడూ ఊహించియుండలేదు.

ఇలా ఉండగా, ఒక రోజు నేను పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపల్ వద్దకు హాస్టల్ విషయమై మాట్లాడుటకు వెళ్ళాను. తలుపు దగ్గర ఉన్న అటెండరుకు నాపేరు వ్రాసిన స్లిప్ ఇచ్చి, నేను ప్రిన్సిపల్‌ను కలువడానికి వచ్చానని చెప్పాను. అతను స్లిప్ తీసికొని లోనికి వెళ్ళి వచ్చి, "ప్రిన్సిపల్ గారు నిన్ను 30

నిమిషములు వేచి ఉండమని చెప్పినారు, ఆ తరువాత మీరు కలువవచ్చు," అని చెప్పాడు. నేను అక్కడే ఉన్న కుర్చీలో కుర్చొని 45 నిమిషాల పాటు వేచి ఉన్నాను. కానీ లోపలి నుండి ఎలాంటి పిలుపు రాలేదు. నేను వెంటనే అటెండరు వద్దకు వెళ్ళి "మీరు 30 నిమిషములు వేచి ఉండమని చెప్పినారు, నేను 45 నిమిషముల నుండి వేచి ఉన్నాను. నేను వెంటనే ప్రిన్సిపల్ ను చూడవలెను," అని చెప్పాను. అప్పడతను లోనికి వెళ్ళి వచ్చి, "ప్రిన్సిపాల్ గారు ఇపుడు వెంటనే బయటకి వెళ్ళుచున్నారట, మిమ్ములను రేపు ఉదయము వచ్చి కలువమన్నారు," అని చెప్పాడు. నాకు విపరీతమైన కోపము వచ్చింది, "ఈ సంగతి నేను వచ్చినప్పడే చెప్పవలసింది. 45 నిమిషములు వేచి ఉన్న తరువాత ఇప్పుడు వీలుకాదు, రేపు రమ్మంటే నేను ఊరుకోను," అని తలుపు తోసుకొని లోనికి వెళ్ళి ప్రిన్సిపల్‌తో, "ఏమిటి? మీకు నేను ఎలా కన్పిస్తున్నాను? నన్ను గురించి మీరు ఏమనుకుంటున్నారు?". అని ప్రిన్సిపల్ వద్దకు వేగంగా కదిలాను. అప్పటికే ముగ్గురు, నలుగురు అటెండెర్స్ లోనికి చేరుకొని ఉన్నారు. ప్రిన్సిపల్ నా ప్రవర్తన చూసి భయపడి,

"అతనిని పట్టుకొని ఆపండి," అని గట్టిగా అరిచాడు. వెంటనే అటెండర్స్ నన్ను పట్టుకొని నిలువరించినారు. నా కోపము కట్టలు తెంచుకుంది. వెంటనే వారిలో ఇరువురిని క్రింద పడవేసినాను. మిగిలిన వారిని పిడికిలి బిగించి మొహంపై కొట్టాను. వెంటనే వారు నలుగురు ఏకమై నా మొహంపై పిడిగుద్దులు గుద్దారు. ఒక బలమైన వేటు నా ముక్కు పై పడింది. వెంటనే ముక్కు నుండి విపరీతంగా రక్తము కారసాగింది. అది చూచి వారు నన్ను వదలి పెట్టారు.

నేను వెంటనే వేగంగా అక్కడి నుండి కదిలి, బయటనే ఉన్న రోడ్డు పైకి వచ్చి ఒక ఆటోను ఆపి, అందులో కుర్చొని, అతనిని దగ్గరలోనే ఉన్న పోలీస్ స్టేషన్‌కు వేగంగా వెళ్ళమని చెప్పాను. అతను వెంటనే నన్ను పోలీస్ స్టేషన్ చేర్చాడు. అక్కడ ఇన్‌స్పెక్టరుకు

"పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపల్‌తో మాట్లాడడానికి వెళ్ళగా, అక్కడ మాటా, మాటా పెరిగి, ప్రిన్సిపల్ నన్ను తన అటెండర్స్‌తో ఉద్దేశ్యపూర్వకంగా కొట్టించినాడు." అని ప్రిన్సిపాల్ పైనా, ఇంకా ఆ నలుగురు అటెండర్స్ పైనా ఫిర్యాదు చేసినాను. ఇన్‌స్పెక్టరు నన్ను,

"వెంటనే నీ మొహంపై ఉండే రక్తాన్ని నీటితో కడుక్కో, డాక్టరు వద్దకు చికిత్స కొరకు పంపవలెనా"? అని అడిగాడు. నేను దానికి "అంత అవసరము లేదు. కానీ, మీరు వెంటనే అ ప్రిన్సిపాల్ ను, ఆ అటెండర్స్‌ను అరెస్టు చేయండి", అని కోరాను. దానికి ఇన్‌స్పెక్టరు,

"అది మా డ్యూటీ, మా డ్యూటీ మేము చేస్తాము," అని, ఇద్దరు కానిస్టేబుల్స్‌ను తోడిచ్చి నన్ను హాస్టల్‌లో దిగబెట్టి కాలేజీలో ప్రిన్సిపల్ వద్దకు పొమ్మని పంపినాడు. వారు నన్ను హాస్టల్‌కు పంపి, ప్రిన్సిపల్ వద్దకు వెళ్ళారు. ప్రిన్సిపల్ ఇదంతా ముందుగానే ఊహించి, తనకు తెలిసిన సిటీ పోలీసు కమీషనర్‌ను సంప్రదించి, తనకు సహాయము చేయమని కోరినాడు. అందుకు, పోలీసు కమీషనర్ వెంటనే ఆ స్టేషన్‌కు ఫోన్ చేసి విచారించినాడు. అందుకు ఇన్‌స్పెక్టరు, ఆ విద్యార్థి గాయపడినాడని, అతని ఫిర్యాదు ప్రకారము యఫ్.ఐ.ఆర్. రికార్డు చేశానని, ఇప్పుడు తానేమీ చేయలేనని చెప్పాడు. వెంటనే కమీషనర్, ప్రిన్సిపల్‌కు ఇది విద్యార్థులతో సమస్య కనుక, ఆ విద్యార్థితో రాజీపడమని సలహా ఇచ్చాడు. ఈ లోపల హాస్టల్ లోని విద్యార్థులమంతా ఏకమై ఆ నలుగురు అటెండర్స్‌పై దాడి చేయుట గురించి ఆలోచిస్తూ ఉన్నాము. ఆ సమయములో వార్డెన్

మావద్దకు వచ్చి, "మీరు చేయబోవు పని చాలా ప్రమాదకరమైనది. ప్రిన్సిపాల్ మీతో రాజీ కోరుచున్నాడు. దయచేసి శాంతంగా ఆలోచించండి," అని చెప్పాడు. అందుకు మేము వెంటనే, ఆ నలుగురు అటెండర్స్‌తో పాటు ప్రిన్సిపల్ కూడా మాకు క్షమాపణ చెప్తే, మేము రాజీకి ఒప్పుకుంటామని చెప్పాము. వెంటనే ఆ ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి.

నా స్నేహితులంతా సంతోషంతో ఎగిరి గంతులు వేశారు. వెంటనే వారు నన్ను వేడుక చేసుకుందామని అడిగారు. అందుకు నేను సమ్మతించాను. ఇద్దరు విద్యార్థులు బయటకు వెళ్ళి 4 ఫుల్ బాటిల్స్ మద్యము తెచ్చారు. ఇదంతా చూసి, మా నాన్నతో పరిచయమున్న హరినాధరెడ్డి ఆనే స్నేహితుడు, ఆ రాత్రి హాస్టల్ ప్రహరీ గోడ దూకి టెలిగ్రాఫ్ ఆఫీసుకు వెళ్ళి ," మీ కుమారుడు పూర్తిగా చెడిపోయినాడు. అతను ఇప్పుడు చాలా ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్నాడు, "అని మా నాన్నకు టెలిగ్రామ్ పంపినాడు. రెండు రోజుల తరువాత మా నాన్న బెంగళూరు చేరుకుని, నేరుగా హరినాథరెడ్డి రూముకు వెళ్ళి విషయమేమిటని అడిగాడు. అందుకతను, తానూ కొంచెము కల్పించి, జరిగిన సంగతంతా వివరంగా చెప్పాడు. నేను రూములో ఒంటరిగా ఉన్నప్పుడు ఎవరో గది తలుపు తట్టారు. పోయి చూడగా, మా నాన్న చాలా కోపంగా బయట కనిపించినాడు. నేను చాలా ఆశ్చర్యపోయినాను, మానాన్న రూములోకి ఒక అడుగు వేసి నా చెంప పగుల గొట్టి " నీవు పూర్తిగా చెడిపోయినావు చదువూ, సంధ్యా, లేకుండా ఇక్కడ చెడు తిరుగుళ్ళు తిరుగుచున్నావు. వెంటనే నీవు నా వెంట ఊరికి వచ్చి పొలం పనులు చూసుకో, ఇంక నీకు చదువెందుకు," అని బాగా తిట్టినాడు.

నాకు విషయమంతా అర్థమయింది, మా నాన్నకు అన్ని విషయాలు తెలిసినవని సిగ్గుతో తలదించుకున్నాను. ఇక మీదట ఎటువంటి తప్పుడు పనులు చేయను, ఇంకెప్పుడూ త్రాగను, ఈ సారికి నన్ను క్షమించమని వేడుకున్నాను. కానీ నామాటలు మా నాన్న నమ్మలేదు.

"నీగురించి ఎన్నో ఆశలు పెట్టుకొనియున్నాను. నన్ను మోసం చేసినావు. నీవు ఇలా అయిపోతావని నేనెప్పుడూ ఊహించలేదు. నీవు, నా వెంట ప్రక్క వీధిలో ఉన్న ఆలయానికి వచ్చి, దేవుని ఎదుట ప్రమాణము చేయవలెను," అని చెప్పి నన్ను గుడికి పిలుచుకొని పోయి అక్కడ పూజ జరిపించి, ఇంకెప్పుడూ మద్యము త్రాగనని, ఇకమీదట ఎటువంటి చెడ్డపనులు, చేయనని దేవుని మీద ప్రమాణం చేపించుకున్నాడు. ఆ తరువాత నేనెప్పుడూ మద్యము త్రాగలేదు, వీలైనంత వరకూ చెడ్డపనులేవీ చేయలేదు, కానీ, కొన్నిసార్లు నా మనసును నియంత్రించుకొనలేక పోయిన మాట నిజము. 1999, వరకు సిగరెట్లు త్రాగుట మానలేకపోయాను. ఆ తరువాత, ఒక్క సిగరెట్టు కూడా త్రాగలేదు. ఇదంతా దేవుని మీద భయము కంటే, మా నాన్న మీద గౌరవంతో, ఆయనకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాను.

ఈ సారి బాగా చదివి అన్ని పరీక్షలు బాగా వ్రాసి పాస్ కావలెనని స్నేహితులమంతా నిర్ణయించుకున్నాము. అందు కొరకు ఒక పద్ధతి ప్రకారము పరీక్షలకు సిద్ధమవుచున్నాము. ఈ లోగా నాపై మోపబడిన ఆత్మహత్యా ప్రయత్నమను నేరము కోర్టులో విచారణకు వచ్చినది. నేను శివప్రసాద్‌తో కలసి వెళ్ళి, ఇప్పుడేమి చేయవలెనని అక్కడి లాయర్లను అడిగాము. చాలా మంది లాయర్లు, "నేరము ఒప్పుకొని క్షమాపణ కోరు, అపుడు నిన్ను క్షమించి వదిలేస్తారు" అని చెప్పారు. ఎందుకో, నా కట్లు చేయుటకు మనసు

అంగీకరించలేదు. ఆ విషయాన్ని వారికి చెప్పాను. ఆ సమయంలో నేను పూర్తిగా మానసిక వ్యాధిగ్రస్తున్ని అయినానని, ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని స్థితిలో ఆత్మహత్యకు ప్రయత్నించానని, మానసిక ఆరోగ్యము సరిగ్గాలేక ఏ తప్పు చేసిననూ అది శిక్షార్హము కాదని, వారితో చెప్పినాను. అప్పుడక్కడ ఉన్న ఒక యువ న్యాయవాది 'అహమ్మద్', అనునతను "నేను నీకు ఉచితంగా న్యాయ సహాయము అందిస్తాను" అని ముందుకు వచ్చాడు. నేను అందుకు సంతోషించి, నా తరపున వాదించమని కోరాను.

కోర్టులో కేసులు అంత తొందరగా తేలవు, నేను చాలా వాయిదాలకు హాజరైనాను, ఊరికే వాయిదాలు పడుచున్నవి. నేను ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్నపుడు తీవ్రమైన మానసిక వ్యాధితో బాధపడుచున్నానని, హాస్టల్ లోని విద్యార్థులకు, నాకు చికిత్సచేసిన డాక్టర్లకు బాగా తెలుసు. నేను తీవ్రమైన మానసిక వేదనతో కృంగిపోయి, నిజమేదో, అబద్ధమేదో తెలియని పరిస్థితిలో నే నా ఆత్మహత్యా ప్రయత్నము చేసినాను. ఈ విషయము నాపై నేరము మోపిన పోలీసులకు ఎందుకు తెలియలేదో నా కర్థము కాలేదు. ఒక నిర్దోషి, మానసిక రోగి అయిన నాపై కేసు పెట్టి, ఎటువంటి పరిశోధనా లేకుండా నాపై నేరము మోపి, వారి వృత్తి ద్వారా వారికి సంక్రమించిన అధికారాన్ని దుర్వినియోగపరచినారు. నా కేసు సరిగా పరిశోధన జరిపి ఉంటే, సంబందిత అధికారులు నిస్వార్థపరులు అయిఉంటే, తప్పక కేసు వెనక్కు తీసుకునేవారు. అలా చేయక నాకు అనవసరమయిన మానసిక వేదన, కష్టము కలిగించినారు. ఇందు వలన నాకు చాలా అసౌకర్యము కలిగినది. కనుక, నేను వెంటనే నా వకీలును సంప్రదించి, నేను తీవ్రమయిన మానసిక వ్యాధితో బాధపడినానని, ఈ వాయిదాలకు తిరుగుట వలన నాకనవసరమయిన ఆందోళన కలిగి నా మానసిక ఆరోగ్యము పాడవుచున్నదని, నేనిప్పటికి కూడా ట్రీట్‌మెంట్ కొనసాగించుట వలన, నా కేసు తొందరగా విచారించి తీర్పు ఇవ్వవలెనని, కోర్టువారిని వేడుకున్నాను. నా అభ్యర్తనను కోర్టువారు మన్నించి, నా కేసు వెంటనే విచారణకు స్వీకరించినారు. కేవలము రెండు వాయిదాలలో విక్టోరియా హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ సింగ్ మరియు మానసా హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ హెచ్.ఎస్. సుబ్రమణ్యం గారు కోర్టుకు వచ్చి, నేను ఆత్మహత్యా ప్రయత్నం చేసినపుడు స్కిజోఫ్రీనియా అనే జబ్బుతో బాధపడుచున్నానని సాక్ష్యం చెప్పినారు. వెంటనే కోర్టు నాపై మోపబడిన కేసు కొట్టివేసి, నన్ను నిర్దోషిగా తేల్చింది. ఏ ప్రతిఫలం ఆశించక నా కేసు వాదించిన అహమ్మద్ అనే లాయర్ యొక్క మంచితనాన్ని, నేను ఎన్నటికీ మరువలేను.

నాకు తెలిసినంతవరకు జంతువులు ఆత్మహత్య చేసుకొనలేవు. ఎందుకంటే, అవి ఆలోచించలేవు. ఆలోచించగల అద్భుతమైన శక్తి గల మనిషి అప్పుడప్పుడు సరిగా ఆలోచించలేక, తన సమస్యలపై సరియైన నిర్ణయం తీసుకొనలేక, ఆత్మహత్య వైపు మొగ్గు చూపుతాడు. చాలా మంది యువకులు, స్కిజోఫ్రీనియాతోనో లేక డిప్రెషన్‌తోనో, బలహీన మనస్కులై ఆత్మహత్యల వైపు పురి కొల్పబడతారు. ఆత్మహత్యా ప్రయత్నం చేయుటకు ముందు వీరంతా తీవ్రమైన మానసిక వేదనను అనుభవించి, డిప్రెషన్‌కు లోనై, వారి సమస్యకు పరిష్కారమే లేదని, చావు తప్ప వేరే గత్యంతరం లేదని భావిస్తారు. ఆశ్చర్యకరంగా, చావు నుండి బయటపడిన తర్వాత వీరంతా చాలా సంతోషిస్తారు. కనుక పరిష్కారమే లేదనుకున్న వీరి సమస్యలన్ని కేవలం ఊహాజనితమైనవేనని ఋజువగుచున్నది. కేవలం ఆ సమయంలో వారు సరిగా ఆలోచించ లేకపోవుట

వలన, వారు అటువంటి నిర్ణయం తీసుకున్నారే తప్ప, మరి ఇంకేమి కాదు. కనుక ఈ యువకులందరికి నేను ఇచ్చే సలహా ఒక్కటే! తమ మనసు ఆత్మహత్మల వైపు మ్రొగ్గు చూపిన యెడల, తొందర పడక, ఈ విషయము తమకు ఇష్టమైన, ముఖ్యమైన వారికి తెలియజేసి, తమ తల్లిదండ్రులను, తను ప్రేమించే ఇతరులను గుర్తు చేసుకొని, ఆ ఆలోచన నుండి బయటపడవలెను. ఇంకా, వెంటనే ఒక మానసిక వైద్యున్ని సంప్రదించుట మంచిది. ఈ ప్రపంచము చాలా అందమైనది మరియు అద్భుతమైనది. నీ ఈ జన్మ చాలా విలువైనది. కనుక, ఎన్ని కష్టాలు వచ్చినను కడవరకు జీవించి ఉండవలెను. ఈ జన్మ ఇంకొక సారి రాదు.

భారత శిక్షాస్మృతి సెక్షన్ 309 ప్రకారము ఆత్మహత్య శిక్షార్హమైన నేరము. కాని, ఈ సెక్షన్‌ను రద్దు చేయాలని భారత ప్రభుత్వాన్ని వేడుకొంటున్నాను. ఎందుకంటే, మొదటగా, ఆత్మహత్య చేసుకొన బోవు వ్యక్తి ఆ ప్రయత్నం నుండి బయటపడినయెడల, తనకు చట్టము వలన ప్రాప్తించు శిక్ష గురించి ఆలోచించి, ఆ ప్రయత్నము మానుకొనడు. రెండవది, అప్పటికే తీవ్రమైన మానసికవేదన, ఇంకా తీవ్రమైన డిప్రెషన్‌కు లోనైన వ్యక్తిని శిక్షించుట ఎంతవరకు సమంజసము? ప్రభుత్వము వీరి పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి పునరావాసము కల్పించి, అలాగే వీరికి సరియైన వైద్యము చేయించిన సముచితంగా ఉంటుంది.

పైన పేర్కొన్న చేదు అనుభవాలతో బెంగళూరు నందు చదువు 'లా' కోర్సు అయిపోయినది. కనుక ఊరికి బయలుదేరి వెళ్ళాను. 'లా' డిగ్రీ తీసుకొనుటకు ఇంకా రెండు పరీక్షలు పాస్ కావలసిఉంది. అందరికి నేను అన్ని పరీక్షలు పాస్ అయినానని చెప్పాను. ఈలోగా, మా అక్క డాక్టర్ శిరీష మరియు మా బావ డాక్టర్ రాజారెడ్డి "అల్జీరియా" అనే దేశమునకు వెళ్ళి అక్కడ ఉద్యోగం చేస్తూ ఉన్నారు. వారు, అక్కడ నాకు కూడా తప్పక ఏదో ఒక ఉద్యోగం దొరుకుతుందని రమ్మన్నారు. నేను అక్కడికి వెళ్ళి, ఇంగ్లీషు టీచర్‌గా ఉద్యోగంలో చేరినాను. కాని అక్కడ శీతాకాలంలో చలి చాలా తీవ్రంగా ఉండుట వల్ల మరియు అక్కడ నాకు హీటర్స్ మొదలగు సౌకర్యములు లేక పోవుట వలన, అక్కడ ఉండలేక, ఎట్లైననూ మన దేశము తిరిగి రావలెనని ప్రయత్నించుచుంటిని. ఈ లోగా నా తల్లిదండ్రులు, రుక్మిణీదేవి అను అమ్మాయితో నా పెళ్లి నిశ్చయించుట వలన, వెంటనే బయలుదేరి 1981 మార్చి 1 వ తేదిన భారతదేశము తిరిగి వచ్చాను. మార్చి 8 న, మా పెళ్ళి జరిగింది. నా భార్య అప్పటికే M.Sc., మాథమాటిక్స్ చేసి ఉండినది. తర్వాత గడిచిన నా జీవితాన్ని అంతా సింహావలోకనం చేసుకొని, జరిగిన తప్పులన్నీ సరిదిద్దు కొనవలెనని ప్రయత్నించినాను. ఆ ప్రయత్నంలో భాగంగా, ముందు 'లా' కోర్సు నందు మిగిలిన రెండు పరీక్షలు రాసి పాస్ అయి 'లా' డిగ్రీ తీసుకొన్నాను. తర్వాత, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్‌గా చేరి, నంద్యాలలో ప్రాక్టీస్ మొదలు పెట్టాను. నా భార్య తల్లిదండ్రులు ఆళ్ళగడ్డలో నివసిస్తూ వుండేవారు. నేనూ, నా భార్య కూడా వారితోనే ఉంటూ నంద్యాలకు పోయి వస్తూ ఉంటిని. ఆళ్ళగడ్డకు నంద్యాల 40 కిలోమీటర్ల దూరం మాత్రమే.

లాయర్‌గా చేరిన కొద్ది రోజులకే నేను చాలా మందికి మంచి వకీలుగా పరిచయమైనాను. ప్రతిరోజూ ఆళ్ళగడ్డ నుండి నంద్యాలకు పోయి, అక్కడ నా పని అయిపోయిన తర్వాత ఇంటికి వచ్చుచుంటిని. చాలా బిజీగా కాలము గడిచిపోవుచున్నది. ఈ పరిణామములు, నాలో సంతోషంతో పాటు రెట్టించిన ఆత్మవిశ్వాసం నింపినది. నేను వాడు మందులు ఆళ్ళగడ్డలో గాని, నంద్యాలలో గాని ఏ మెడికల్ షాపులో కూడా దొరుకుట

లేదు. కర్నూలుకు పోయి తెచ్చుకొనవలెను. అదేమి అంత కష్టం కాకున్ననూ, పని వత్తిడి వలన నేను మందులు సరిగా వేసుకొనడంలో అశ్రద్ధ చేసి, డాక్టర్ దగ్గరకు చెకప్‌కు పోవుట కూడా మరచితిని. అయినా, ఇప్పుడు చాలా బాగున్నాను కదా, నాకింకేమి కాదులే! అని కొన్ని రోజుల తర్వాత మందులు వాడుటయే మానితిని. ఈ తప్పు ఏ స్కిజోఫ్రీనియా వ్యాధిగ్రస్తుడు కూడా చేయకూడదు. డాక్టర్ సలహా లేనిదే మందులు మానుట లేక మార్చుట చేయరాదు. తప్పక మధ్య మధ్యలో చెకప్‌కు పోతూ ఉండవలెను. పై వాటిలో ఏ తప్పు చేసినా స్కిజోఫ్రీనియా వెంటనే తిరగబెడుతుంది.

మందులు మాని వేసిన కొద్దిరోజులకే నాకు మరలా స్కిజోఫ్రీనియా తిరగపెట్టింది. మొదటిమాదిరే మరలా డెల్యూసన్స్‌కు లోనయి, తీవ్రమైన డిప్రషన్‌లోనికి జారుకొని, జీవితంపై విరక్తితో మరలా ఆత్మహత్యా ప్రయత్నం చేసినాను. డాక్టర్స్ ఎలాగో నన్ను కాపాడినారు. దీనితో బంధువులకు, స్నేహితులకందరికి నా మానసిక అనారోగ్యం గురించి తెలిసిపోయినది. మా అత్త, మామలు కొంతబాధపడినా నన్ను ఎక్కువగా అభిమానిస్తుండే దాని వల్ల నా గురించిన అన్ని విషయాలు తెలిసినా, నన్ను ఏమీ తప్పు పట్టక నాకు అండగా నిలబడినారు. పెళ్ళి అయిన మొదటి రోజునే నా భార్యకు నా అనారోగ్యం గురించి క్లుప్తంగా వివరించి ఉన్నాను. కనుక, ఆమె కూడా నన్ను అపార్థము చేసుకొనలేదు. కాని ఇన్ని రోజులు నన్ను అపురూపంగా చూసుకొన్న మా తల్లిదండ్రులు నన్ను పూర్తిగా అపార్థం చేసుకొని, తమ వైపు నుంచి ఎటువంటి సానుభూతి లేకుండా విమర్శించడం ప్రారంభించినారు. డాక్టర్ సుబ్రమణ్యంగారు నన్ను మరలా మాములు మనిషిని చేసి, “ నీవు మందులు సరిగా తీసికొనకుంటే, ఇక మీదట నేను నీకు సహాయము చేయలేను,” అనిచెప్పినాడు. మరలా కొద్దిరోజుల తరువాత కోర్టుకు పోవుట ప్రారంభించినాను. కానీ ఇంతకు మునుపున్న ఉత్సాహముకాని, ఆత్మవిశ్వాసముకాని లేవు. మరియు, ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ఉదయాన్నే లేవకుండా మత్తుగా నిద్రపోతున్నాను. కనుక, ఆళ్ళగడ్డ నుండి నంద్యాలకు పోయి ‘లా’ ప్రాక్టీసు చేయడము కష్టంగా ఉండేది. కోర్టుకు సరిగా పోకుండుటవలన, మునుపు నాకున్న మంచిపేరు కాస్తా అదృశ్యమయి పోయింది. దీనితో నాకు దిగులుగా ఉండేది. సిగిరెట్లు త్రాగుట ఎక్కువ చేసినాను. దానితో శారీరక ఆరోగ్యము కూడా పాడవుచుండేది. ఈ సారి చెకప్‌కు పోయినపుడు డాక్టరు గారితో, “ నేను ఉదయాన్నే లేవలేకున్నాను, మరియు రోజంతా మత్తుగా ఉంటున్నది,” అని చెప్పాను. దానికి డాక్టరు గారు “ ఇది కేవలము నీ బద్దకము కారణంగానే అలా జరుగుతూ ఉంది, కనుక నీ బద్దకము విడిచిపెట్టు రోజూ కొంచెము వ్యాయమము చేయి బాగుంటుంది,” అని చెప్పినాడు.

వ్యాయమము చేయవలెనన్నా కూడా నాకు బద్దకమే. నా భార్య, “మన భవిష్యత్తు కోసమయినా నీవు పొద్దున్నే లేచి కోర్టుకుపో అని ప్రాధేయపడేది. పడుకునే ముందు, ఎలాగయినా ఉదయాన్నే లేవాలని నిర్ణయించు కుంటాను కానీ, ఉదయము లేవవలసిన సమయములో నాకా పట్టుదల ఉండేది కాదు. నేను బద్దకానికి బానిసనయిపోతున్నాను. మా మామ గారు ఈ పరిస్థితి చూసి “ సూర్యా! నీవు నంద్యాలకు పోవుట కష్టంగా ఉంటే ఇక్కడ ఆళ్ళగడ్డలోనే కోర్టుకు పో,” అని సలహా ఇచ్చారు. నేను కూడా అదే మంచిదని నిర్ణయించు కొని ఆళ్ళగడ్డలోనే ప్రాక్టీసు చేయుట ప్రారంభించినాను. కానీ నేను మునుపటిలా ఉత్సాహంగా ఉండలేకపోతున్నాను.

ఈ మధ్య కాలంలో ఆళ్ళగడ్డలోని చాలా మంది ప్రముఖులతో పరిచయమేర్పడింది. వారంతా నన్నెంతో గౌరవించేవారు. కానీ డబ్బులకు చాలా ఇబ్బందిగా ఉండేది. ఈ పరిస్థితులలో మా అత్తమామలు నాకు వారికున్నంతలో సహాయము చేయచుండేవారు. వారు నన్ను మునుపటికంటే ప్రేమగా, గౌరవంగా చూచుకునేవారు. కానీ నేనెంతగానో ప్రేమించిన నా తల్లిదండ్రులు, దూరమవుచున్నారే అని భాధపడుచుండేవాన్ని. ఈ లోగా నాభార్య ఆళ్ళగడ్డలోని పాఠశాలలో టీచరుగా ఉద్యోగములో చేరింది. ముందంతా మనకెందుకు ఉద్యోగము అనుకుంటూ ఉండేవాడిని. చివరకు ఆమె చేసేది చిన్న ఉద్యోగమే అయినా అదే మాకు ఆలంబన అయింది. 1984 వ, సంవత్సరములో మాకు ఒక కుమారుడు పుట్టినాడు. అంతా చాలా సంతోషించినాము. నాకు, వాడిని నా వలె కాక, నా జీవితాన్ని ఒక గుణపాఠంగా తీసికొని, జాగ్రత్తగా పెంచవలెనని నిర్ణయించుకున్నాను.

1985 లో నా భార్యకు పదోన్నతి పై కర్నూలుకు బదిలీ అయినది, అక్కడ జిల్లా కోర్టు కూడా ఉన్నది. అక్కడే నేను ఎలాగయినా న్యాయవాద వృత్తిలో స్థిరపడాలని కోరుకున్నాను. కాని అది నాకు సాధ్యపడలేదు. నాకు సబ్–కాన్సియస్‌గా డెల్యూసన్స్ వెంటాడుచునే ఉన్నవి. మానసికంగా నేను చాలా బలహీనున్ని అయిపోయాను. ఏదీ తట్టకునే శక్తి నాకప్పుడు లేదు. నాకు డబ్బు అవసరాలు పెరిగాయి. నా భార్యకు వచ్చు జీతము తప్ప ఇంకే ఆధారము లేదు. నాభార్య చాలా పొదుపుగా సంసారాన్ని మోయుచున్నది. నాకేమో ఇన్ని కష్టాలు పడినా పొదుపు అలవాటు కాలేదు. నా సిగరెట్లకు, మందులకు చాలా ఖర్చు అవుతూ ఉండేది. కానీ ఆమె నన్ను ఏ విషయము లోను నిందించేది కాదు. నాకు ధైర్యము చెప్పేది. కోర్టుకు పోలేనని అర్థము చేసుకున్నది కనుక, దాని గురించి నన్ను వేధించేదికాదు.

ఈ లోగా మా అత్తమామలు కూడా కర్నూలుకు వచ్చినారు. అప్పటి నుండీ అంతా కలసే ఉంటున్నాము. వారి రాకతో నేను కొంచెము ధైర్యంగానే ఉన్నాను. కానీ కోర్టుకు పోలేకపోతున్నాను. ప్రయత్నించినా కూడా, ఒక వారము, లేదా 15 రోజులలో మళ్ళీ మానుకుంటున్నాను. ఇప్పుడందరికీ నేను మానసిక వ్యాధిగ్రస్తున్ననే విషయం తెలుసు, అందువలన నాలో ఒక విధమైన సిగ్గు, భయము కలుగుచుండేవి. ఇతరులు నన్ను అంతగా పట్టించుకోకున్నా, అందరూ నన్ను హేళనచేస్తారేమోనని భయపడుచుండేవాడిని. ఇలా ఉండగా నాకు శ్రీనాథ్ అనే జర్నలిస్టుతో పరిచయమైంది. అతను నన్ను బాగా అభిమానించేవాడు, ప్రతిరోజూ తన ఆఫీసుకు రమ్మని ప్రోత్సహించేవాడు. అతను ఆంధ్రప్రభ మరియు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా పత్రికల విలేకరి. ఆంధ్రప్రభ ఆఫీసులో, అన్ని రంగముల వారు చేరి చాలా విషయముల గురించి చర్చించుకునేవారు. నాకు అక్కడ సరియైన గుర్తింపు, గౌరవము లభించినవి. చాలా మంది మంచి స్నేహితులైనారు. శ్రీనాథ్, నాకు మానసిక వ్యాధి వలన కలిగిన సిగ్గు, భయము నుండి బయటపడుటకు తోడ్పడేవాడు.

ఈ లోగా, శివరామిరెడ్డి అనే సీనియర్ కమ్యూనిస్టు నేతతో పరిచయమైంది. ఆయన చాలా మంచివారు. అతను 1950 వ దశకంలో, జిల్లాలో కమ్యూనిస్టు మూమెంటు నందు ఒక నిష్ఠాతుడైన వ్యక్తి. ఆయన మంచి విద్యావంతుడు, చాలా విషయములపై మంచి పట్టు ఉన్నది. నాకు తెలియని ఎన్నో విషయాలు, ఆయన నాకు వివరంగా చెప్పేవారు. ఆయన కమ్యూనిస్టు ఫిలాసఫీ గురించి, నాతో వివరంగా చర్చించేవాడు. ఇంకా, నాకు కార్ల్‌మార్క్స్ వ్రాసిన కమ్యూనిస్టు ఫిలాసఫీ అను గ్రంధాన్ని, మరికొన్ని పుస్తకాలను ఇచ్చి

చదువమన్నారు. ఆయన్ను నేను ఎక్కువగా కమ్యూనిస్టు ఆఫీసులోని అతని రూములో కలిసేవాణ్ని. ఆ కొద్ది కాలము నా టి.వి.యస్.మోపెడ్ మీద చాలా చోట్లకు కలసి తిరిగేవారము. కొంత కాలము ఇతని సహచర్యము వలన నాలో రేషనల్ థింకింగ్ ఆలవడినది. దీనివలన నాకున్న డెల్యూసన్స్ గురించి ఇంకా మిగతా మూఢ నమ్మకముల గురించి, నాలో నేనే తర్కించుకొని, సరియైన ఆలోచనలు చేయుచుంటిని. నేను డెల్యూసన్స్ మీద విజయం సాధించుటకు ఈ రేషనల్ థింకింగ్ చాలా ఉపయోగపడింది.

ఈ సమయంలోనే, కర్నూలు వీధుల వెంట ఆలనాపాలనా లేని మానసిక రోగులు, మాసిన గడ్డాలతో పీలికలైపోయిన బట్టలతో, గమ్యంలేకుండా తిరుగుతూ కనిపించారు. నేను, వీరి గురించి అప్పటి కలెక్టరు గారికి, ఇంకా కొందరు రాజకీయ నాయకులకు, "ఈ అభాగ్యులైన మానసిక రోగులకు వైద్యము, కూడు,గుడ్డా ఇచ్చి కాపాడవలను," అని విన్నవించుకున్నాను.

కానీ, వారంతా ఇదేమంత ప్రాధాన్యత లేని విషయంగానే పరిగణించారు. కొందరు రాజకీయ నాయకులైతే, వీరు ఆనందంగా కష్టాలు కూడా తెలియకుండా జీవిస్తుంటే, నీవెందుకు వారి గురించి దిగులు పడుతున్నావు,"" అని ఎగతాళిచేశారు. ఇలాంటి సమయంలో, కర్నూలులోని పాత బస్టాండు కూడలిలో, ఒక మానసిక రోగి, ఎప్పుడూ అక్కడే పడుకొని ఉండుటను గమనించాను. నేను వెంటనే అక్కడున్న వారిని ఇతని పరిస్థితి గురించి విచారించినాను. దానికి వారు, ఇతను చాలా రోజుల నుండి ఎవరితోనూ ఏమీ మాట్లాడకుండా అక్కడే పడి ఉన్నాడని, ఎవరైనా ఆహారమిస్తే తింటాడు తప్ప కావాలని ఎవరినీ అడగడని అప్పుడప్పుడు తనలోతాను నవ్వుకుంటూ, కొన్నిసార్లు ఎవరినీ ఉద్దేశించకుండానే తిడుతూ ఉంటాడని, ఇంకా కాలకృత్యములు కూడా అతను తీర్చుకొనలేడని తెలిపినారు. ఇదంతా విని నేను చాలా ఆందోళన చెందాను. అది ఏప్రిల్ నెల, అప్పుడక్కడ మాధ్యాహ్నపు ఎండ వేడి 40 డిగ్రిస్ సెంటీగ్రేడ్ వరకు ఉంటుంది. ఆ ఎండ నుండి అతడెటువంటి రక్షణ లేకుండా, అలాగే పడిఉండేవాడు. నేను అతనికి వెంటనే ఏదైనా సహాయము చేయవలెనని నిర్ణయించుకున్నాను. ఈ విషయమై ఆంధ్రప్రభ విలేకరి శ్రీనాథ్‌ను సంప్రదించాను. అతను, "నీవు వెంటనే జిల్లా కలెక్టరును కలసి వారికి ఈ విషయము తెలిపి, ఆవ్యక్తికి వెంటనే సహాయము చేయమని కోరు", అని చెప్పినాడు. నేను అలాగే అతికష్టము మీద కలెక్టరును కలిసి, ఈ విషయాలన్ని వివరంగా ఒక విన్నపములో రాసి ఇచ్చి, ఇతనికి ప్రభుత్వము తరపున ఏదైనా సహాయము చేయమని కోరాను. అందుకు కలెక్టరు క్లుప్తముగా "వీరిని అసైలమ్‌కు పంపవచ్చు, మేము త్వరలోనే ఒక నిర్ణయము తీసుకుంటాము," అని చెప్పి నన్ను పంపించారు. ఒక వారము రోజులు గడచినా కూడా కలెక్టరు ఎటువంటి చర్య తీసుకొనలేదు. ఇక వారికి నివేదించుట వ్యర్థమని తేలిపోయింది. నేను ఆంధ్రప్రభ ఆఫీసులోని నా స్నేహితులతో చర్చించాను. కొందరు, బెంగళూరు నగరములోని "నిమ్‌హాన్స్" (NIM HANS) అనే ప్రభుత్వ మానసిక వైద్యశాలలో వీరిని చేర్పించవచ్చుని చెప్పిన వెంటనే, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకొని, ఒక సన్నిహితుని వెంట తీసికొని, మొదట డా॥ జగన్‌మోహనరెడ్డి హాస్పిటల్‌లో చేర్పించి, ప్రాధమికంగా అతనిని పరీక్ష చేయించి, ఆ రాత్రికి మేము బెంగళూరు బయలుదేరి వెళ్ళాము. అక్కడ హాస్పిటల్‌లో ఇతనిని పరీక్షించి, స్కిజోఫ్రీనియాతో బాధపడుచూ మతిస్తిమితము కోల్పోయినాడని, తన పేరు కూడా తెలియని పరిస్థితిలో ఉన్నాడని, ఇతనిని ఇక్కడ చేర్పించవలెనన్న మేజిస్ట్రేట్ ఆర్డరు తప్పనిసరి అని చెప్పినారు. అప్పుడు, అక్కడ దగ్గరలోనే ఉన్న విల్సన్ గార్డెన్ పోలీస్‌స్టేషన్‌లో ఇతనిని హాజరు పరచి, వారి

ద్వారా కోర్టుకు పంపి, మేజిస్ట్రేట్ ఆర్డరు సంపాదించాము. ఆ సాయంత్రమే ఇతనిని అక్కడి హాస్పిటల్‌లో చేర్పించి, మేము ఇంటికి బయలుదేరి వచ్చాము తిరుగు ప్రయాణంలో నేను ఒక మంచి పని చేసినందుకు చాలా తృప్తి పడ్డాను, కానీ చాలామంది తెలిసినవారు, ఇతనికేమైన పిచ్చా, ఇలా చేస్తున్నాడని అనుకున్నారు. కానీ, నా ఎదురుగా ఎవరూ ఏమీ మాట్లాడలేదు. విలేకరి శ్రీనాథ్ మానసిక రోగుల గురించి మరియు నా గురించి పలుమార్లు పేపర్లలో వార్తలు వ్రాసినాడు. దాని వలన అందరికీ నా అనారోగ్యము గురించి తెలిసింది.

1991 వ, సంవత్సరములో మాకు ఇంకొక కొడుకు జన్మించాడు, అందరము సంతోషించాము. నాపై బాధ్యతలు పెరిగాయి. కానీ నేను భాధ్యతల నుండి తప్పించుకొనుటకు ప్రయత్నించుచుంటిని. నేను మా తండ్రి వద్ద నాకు వారసత్వ రీత్యా సంక్రమించు ఆస్థి కొరకు, గట్టిగా అడుగుచూ ఉంటిని. నేనెప్పుడైతే ఆస్థి గురించి నా భాగము అడిగినానో వెంటనే మా నాన్న, నన్ను విమర్శించడం మొదలు పెట్టాడు. ఆస్థి పంపకంలో కూడా నాకు చాలా అన్యాయము జరిగినది. కానీ తల్లిదండ్రుల తీర్పును నేను శిరసావహించాను. ఈ పరిణామాలతోనే నేను మరలా డిప్రెషన్ లోనికి జారుకొని ఆత్మహత్యా ప్రయత్నము చేశాను. సమయానికి నన్ను హాస్పిటల్‌లో చేర్పించడము వలన, డాక్టర్లు నన్ను కాపాడగలిగారు. తరువాత, నాభార్య మరియు మా మామగారు, నన్ను బెంగళూరు తీసికొని పోయి మానసా హాస్పిటల్‌లో చేర్పించారు. డాక్టర్ సుబ్రమణ్యంగారు చికిత్సచేసిన తరువాత, వారు నాతో, “ఇప్పటికే నీవు మాటిమాటికి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటూ, ఆరోగ్యరీత్యా నీవు చాలా క్లిష్టపరిస్థితిలో ఉన్నావు, ఇక మీదట నీ ఆరోగ్యము పాడైనచో, నీ శేష జీవితము ఎవరో ఒక అటెండెంట్ సహాయముతో జీవించవలసి ఉంటుంది కనుక జాగ్రత్తగా ఉండు,” అని నన్ను తీవ్రంగా హెచ్చరించారు.

ఇట్టి పరిస్థితులలో, స్కిజోఫ్రీనియా జబ్బు పూర్తిగా నయము చేయడానికి, ‘ రెస్పిరిడాన్’ అనే మందు కొత్తగా కనిపెట్టబడింది. నేను ఈ మందు వాడడం మొదలు పెట్టిన కొద్ది రోజులలోనే ఇన్నాళ్ళు నన్ను వెంటాడి వేధిస్తున్న డెల్యూసన్స్ పూర్తిగా అదుపులోనికి వచ్చినాయి. ఆ తరువాత నేను ఆనందంగా, హాయిగా ఉన్నాను. మా మామ గారి ఇంటి నుండి బయటకు వచ్చి, సొంతంగా ఉండుట అలవాటు చేసుకున్నాను. కానీ, వారితో నా అనుబంధము యింకా దృఢపడింది. మా అమ్మ, నాన్నల ఆరోగ్యము, వయసు కారణంగా క్షీణించింది. అప్పుడప్పుడూ ఊరికి వెళ్ళి వారిని పరామర్శించేవాడిని. కానీ ఆవూరిలో ఉండుటకు ఇష్టపడేవాన్ని కాను. నా పిల్లలు పెరిగి పెద్దవారవుచున్నారు. ఈ విధంగా ఒక 4 సంవత్సరములు గడచినవి. మందులు ఏ మాత్రము అశ్రద్ధ చేయకుండా ప్రతిరోజు రెండు పూటలా సమయము తప్పకుండా తీసుకునేవాన్ని. నెలకు సరిపడా మందులు కొనేవాన్ని. ఒక పర్సులో ఒక వారమునకు సరిపడా మందులు నా జేబులో ఎప్పుడూ పెట్టుకునే వాన్ని. నే నెక్కడికి వెళ్ళినా ఒక పూట కూడా మందులు మానకుండా అన్ని జాగ్రత్తలు తీసుకునేవాన్ని. ప్రతి 3 నెలలకు ఒక సారి తప్పక డాక్టరు దగ్గరుకు చెకప్‌కు వెళ్ళేవాన్ని. ఇది ఇలా ఉండగా, ‘ఒలాంజాపిన్’ అనే మరియొక క్రొత్త మందు స్కిజోఫ్రీనియాను ఇంకా బాగా నియంత్రించుటకు తయారు చేయబడింది. ఇది ఒక అద్భుతమైన ఔషదంగా పేరుగాంచింది. అయితే, దీని వలన కొన్ని చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. అవి గాఢంగా నిద్రపోవుట, బరువు పెరుగుట, మధుమేహం బారిన పడుట, లాంటివి. అందు వలన డాక్టర్లు ఈ మందును అవసరాన్ని బట్టి వాడుచున్నారు. మొత్తము మీద ‘రెస్పిరిడాన్’ మరియు ‘ఒలాంజాపిన్’ అను ఈ రెండు మందులు ‘స్కిజోఫ్రీనియా’ వ్యాధిగ్రస్తులకు ఒక వరంగా లభించాయి.

1975 నుండి, 1991 వరకు, 17 సం॥ కాలములో, నేను 5 సార్లు ఈ జబ్బుబారిన పడి, హాస్పిటల్‌లో చేరి చికిత్స చేయించుకున్నాను, మరియు 4 సార్లు ఆత్మహత్యా ప్రయత్నము చేసినాను. అయితే 'రెస్పిరిడాన్' మరియు 'ఒలాంజాపిన్' వాడిన తరువాత, 1992 నుండి, నేటి వరకు, అంటే 2013 వరకు, 21 సం॥ కాలములో, నేను ఒక్క సారి కూడా చికిత్స కొరకు హాస్పిటల్‌లో చేరలేదు. అలాగే, ఒక్కసారి కూడా ఆత్మహత్యా ప్రయత్నము చేయలేదు. నేనిప్పుడు పూర్తి ఆరోగ్యముగా ఉన్నాను. ఇన్నాళ్ళూ నన్ను పట్టి పీడించిన 'డెల్యూసన్స్' నుండి పూర్తిగా విముక్తుడనయ్యాను. స్కిజోఫ్రీనియాను పూర్తిగా నయము చేయవచ్చుననుటకు నేనే ఒక ఉదాహరణ. మనము చేయవలసినదల్లా, జబ్బు గుర్తించిన వెంటనే మానసిక వైద్యుని దగ్గరకు తీసుకుని వెళ్ళి చికిత్స చేయించవలెను. కానీ, దురదృష్టవశాత్తూ మనదేశంలో 10 నుండి 15 శాతము మందికి మాత్రమే మంచి వైద్యము దొరుకుచున్నది. మిగిలిన వారిని వారి తల రాతకు వదలివేయుచున్నారు. కానీ ప్రజలు ఈ జబ్బు గురించి సరియైన అవగాహన కలిగి, ప్రభుత్వ మానసిక ఆరోగ్య కేంద్రాలు మరియు మానసిక వైద్య నిపుణులను గణనీయంగా పెంచినచో పరిస్థితి చాలా వరకు మెరుగుపడగలదు.

నేను సిగరెట్లు చాలాకాలము నుండి ఎక్కువగా త్రాగుటవలన నా శరీర ఆరోగ్యము పాడయినది. డాక్టర్లు, నాభార్య, నా కుమారులు, ఈ దురలవాటును మానుమని నాపై ఒత్తిడి పెంచారు. కనుక నేనెట్లైననూ ఈ అలవాటును మానుకొనవలెనని ప్రయత్నించి, నికోటిన్ పాచెస్ తెప్పించుకుని వాటి సహాయముతో 1999 సం॥ నుండి ఈదురలవాటును శాశ్వతంగా మానివేశాను. తరువాత కొంత కాలానికే నా శరీర ఆరోగ్యము కుదుట పడింది. నేటికీ 'స్కిజోఫ్రీనియాకు' నేను మందులు వాడు చున్నాను. నాకు పునర్జన్మను ప్రసాదించిన డా॥ సుబ్రమణ్యం గారు కొంత కాలము క్రిందట మరణించారు. అది తెలుసుకుని నేను చాలా బాధపడ్డాను.

నేటికీ నేను మానసాహాస్పిటల్‌కు చెకప్ కొరకు వెళుతున్నాను. ఇప్పుడీ హాస్పిటల్ లో డా॥ సుబ్రమాణ్యంగారి కుమారుడు డా॥ ఆదిత్య సుబ్రమణ్యం డైరెక్టరుగా ఉన్నారు. ఇతను ఒక మంచి మానసిక వైద్యుడు. ఇంకా డా॥ యమ్ ధర్మేంద్ర అనే మంచి నైపుణ్యము కలిగిన మానసిక వైద్యుడు, మరియు బి.ఆర్. మధుకర్ అను మంచి అనుభవము గల మానసిక వైద్య నిపుణుడు మొదలైనవారు ఈ హాస్పిటల్ నిర్వహిస్తున్నారు. నేను ఆరోగ్యముగా ఉన్నాననే విశ్వాసము పూర్తిగా ఉన్నా, నేను వాడే మందుల గురించి ఏమాత్రము నిర్లక్ష్యంగా ఉండను. నేను మందులు మానిన మరుక్షణమే నా ఆరోగ్యము పాడవుతుందని, నాకిప్పుడు పూర్తిగా తెలుసు. అలాగే క్రమం తప్పకుండా డాక్టరు వద్దకు చెకప్‌కు పోవుట కూడా మరచిపోరాదు. నాకిప్పుడు డా॥ యమ్. ధర్మేంద్ర గారు వైద్య సహాయము అందచేస్తున్నారు. కొన్ని సం॥ క్రిందట నాకు అన్నిటికీ అనుమానపడే అలవాటు ఎక్కువగా ఉండేది. డాక్టరుగారు, నాకు రెస్పిరిడాన్ మరియు ఒలాంజాపిన్ మందుల కాంబినేషన్ ఇస్తున్నారు. దీనితో నేను ఆ సమస్య నుండి పూర్తిగా విముక్తున్నయ్యాను. కనుక, మన మెల్లప్పుడూ డాక్టరు దగ్గర చెకప్ చేయించుకుంటూ, మనకున్న లక్షణాలను తెలిపి వారిసలహాలు పాటించవలెను.

స్కిజోఫ్రీనియా వ్యాధిగ్రస్తులు సున్నిత మనస్కులై ఉంటారు. కనుక వారు మంచి అలవాట్లను అలవరచుకొనవలెను. ఏ తప్పు చేస్తే, తరువాత అపరాధ భావనతో బాధపడవలసి వస్తుందో, అలాంటి తప్పు ఎప్పుడూ చేయకూడదు. ఎందుకంటే అపరాధ భావన వల్ల డెల్యూసన్స్ ప్రేరేపింపడతాయి. వీరు డాక్టరును విశ్వాసములోనికి తీసుకొని, వారి మనసులోని అన్ని సమస్యలను డాక్టరుకు వివరించాలి. అప్పుడే డాక్టరు ఇంకా బాగా చికిత్స చేయగలడు. వీరు అన్ని విషయాల గురించి సానుకూలంగా ఆలోచించాలి, వ్యతిరేకమైన

ఆలోచనలు చేయరాదు. వీరు ఊరికే కుర్చొనకుండా ఏదో ఒక వ్యాపకము పెట్టుకొని బిజీగా ఉండాలి. ఎందుకంటే, ఊరికే ఉంటే అనవసరమైన ఆలోచనలు మన మనసు లోకి వస్తాయి. కనుక, ఏ పని లేని సమయములో, మంచి సంగీతము వినడము, మంచి పుస్తకాలు చదవడము, మంచి ప్రదేశములు చూడడము చేస్తూ ఉండాలి. వీరు మానసిక వ్యాధిగ్రసులైనందు వల్ల ఏర్పడే సిగ్గు, భయాలను జయించి, ఆత్మవిశ్వాసముతో జీవించడం నేర్చుకొనవలెను. ఈ వ్యాధి వలన కలిగిన మానసిక వేదన చాలు, ఇంకా అనవసరమైన ఈ ప్రపంచము చేయు హేళన భరించవలసిన అవసరము లేదు. మనము ఆత్మ విశ్వాసముతో బ్రతుకుట నేర్చుకున్న ఎడల, ఈ ప్రపంచము కూడా హేళన చేయడము మానుకుంటుంది. ఈ జబ్బు బారిన పడిన వారిని ప్రేమతో, గౌరవంతో, స్నేహ పూర్వకంగా చూడమని ఈ ప్రపంచాన్ని వేడుకుంటున్నాను. ఈ జబ్బు ఎవరికైనా రావచ్చు కానీ, అది ఎంత మాత్రము వారి నేరముకాదు . వారిని హేళన చేయడము కాని, చిన్న చూపుచూడడము కాని చేయరాదు.

కొంతకాలము క్రిందట మా నాన్న గారు స్వర్గస్తులైనారు. ఆయన నేను పుట్టినప్పటి నుండి నన్ను ప్రత్యేకమైన ప్రేమాభిమానాలతో పెంచినారు. నా మీద ఎన్నో ఆశలు పెట్టుకొని ఉండేవారు. నేను మంచి పేరు సంపాదించి బాగా ధనవంతుని కావలెనని కోరుకున్నారు, కానీ, ఇవేవీ సాధ్యపడలేదు. అంతేకాక నేనెన్నో కష్టనష్టములను ఎదుర్కొనవలసి వచ్చింది. చివరికి ఆయన నన్ను చూసి చాలా అసంతృప్తి చెందారు. ఆయన తన అసంతృప్తిని ఏమాత్రమూ దాచుకొనలేదు. అదంతా నా మీద వెల్లగ్రక్కారు. ఆయన్ను అసంతృప్తి పాలు చేసిన దానికి ఈ రోజు నేను చాలా బాధపడుచున్నాను. ఏ మానసిక వ్యాధిగ్రస్తునికైనా తన కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు చాలా అవసరము. నా అదృష్టము కొద్దీ నా పెళ్ళి వరకు నా తల్లిదండ్రులు, ఆ తరువాత నా భార్య, ఆమె కుటుంబ సభ్యులు, నాకు చాలా సహాయ సహకారములు అందించినారు. కనుకనే నేను ఈనాడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను. మందుల తరువాత ఇదే చాలా ఆవశ్యకమైనది. కనుక కుటుంబ సభ్యులు వీరి సమస్యల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.

నా భార్య, నా ఆరోగ్య విషయమే కాకుండా ఇతర అన్ని విషయములు ఓర్పుగా నిర్వహించింది. నేను ఆమె ఋణం ఈ జన్మలో తీర్చుకొనలేను. నా పెద్ద కుమారుడు ఆమెరికాలో మంచి ఉద్యోగము చేస్తున్నాడు. చిన్న కుమారుడు, బెంగళూరులో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుచున్నాడు. ఉన్న కొద్దిపాటి ఆస్తి ఒక పద్దతి ప్రకారము అభివృద్ధి చేసుకున్నాము. ఇప్పుడు నేను సంతృప్తిగా ఉన్నాను. మానసిక వ్యాధిగ్రస్తులపై నాకు ప్రత్యేకమైన సానుభూతి ఉంది. ప్రభుత్వము ఇప్పటికే వీరి సంక్షేమము కొరకు అనేక ప్రత్యేక చట్టాలు చేసింది. కాని అవి సరిగ్గా అమలగుట లేదన్నది జగమెరిగిన సత్యము. కనుక ప్రభుత్వము, వీరి శ్రేయోభిలాషులు, వీరి సమస్యల పట్ల సరియైన అవగాహన కలిగి, వీరి అభ్యున్నతికి కృషి చేయవలెనని ఈ ఆత్మకథ ద్వారా ఆందరిని కోరుచున్నాను.